PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 152 | విజయవాడ, శనివారం 3 జనవరి 2026 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 3 January 2026 | Rs



నేటి నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభ

- రేపు మారిషస్ అధ్యక్షులు ధరమ్‌భీర్ గోకుల్ రాక

2



షమీ, పంత్ ఎంపికపై సుదీర్ఘ చర్చ

- బుమ్రా, హార్దిక్‌లకు విశ్రాంతి
- న్యూజిలాండ్‌తో వైట్‌బాల్ సిరీస్‌కు జట్ల ప్రకటనపై ఉత్కంఠ

6

విద్యుత్ సవరణ బిల్లుపై యుద్ధమే!

ప్రజా కంటక విధానాలపై క్షేత్ర స్థాయి ఉద్యమం

విశాఖ ఉక్కును దెబ్బతీసే కుట్రలు సాగనివ్వం

సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

అనంతవట్టన్ ఆనందన్ నగర్ - గ్రేటర్ విశాఖ బ్యూరో

కష్టజీవుల బతుకులను ఛిద్రం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాల పరంపరలో భాగంగా ముందుకొచ్చిన విద్యుత్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, లేకుంటే యుద్ధమేనని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు క్షేత్ర స్థాయి ఉద్యమానికి కార్మికవర్గం సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కొత్త విద్యుత్ సవరణ బిల్లు కార్పొరేట్ విద్యుత్ కంపెనీల ప్రయోజనాల కోసం తెచ్చిందే తప్ప మరొకటి కాదన్నారు. ఇప్పటికే లేబర్ కోడ్‌లు, ఉపాధి హామీ చట్టంలో మార్పులు చేసి కార్మిక హక్కులపైన, పేదల ఉపాధిపైన దాడి చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పుడీ విద్యుత్ చట్ట సవరణ బిల్లును తీసుకొచ్చి ప్రజలపై మరింత భారాన్ని మోపుతోందని అన్నారు. ఈ ప్రజాకంటక విధానాలకు వ్యతిరేకంగా త్వరలో క్షేత్రస్థాయి ఉద్యమాన్ని చేపడతామని ఆయన ఉద్ఘాటించారు. మహాసభ మూడవ రోజు శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా గోష్టిలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ 'బిజెపి హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ కునారిల్లుతోందని, అసమానతలు పెరిగిపోయా'యని అన్నారు. లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మిక హక్కులపై దాడి చేస్తూ ఉపాధి అవకాశాలను దెబ్బతీసే పరిస్థితుల్లో సమరశీల పోరాటాలు చేయాలని తపన్ సేన్ పేర్కొన్నారు. దేశ రక్షణ, ప్రజల జీవనం మెరుగు కోసం ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెతో శంఖారావం పూరించబోతున్నామన్నారు. విశాఖలో జరుగుతున్న సిఐటియు అఖిల భారత 18వ మహాసభల్లో వీటన్నిటిపై రాష్ట్రాల వారీగా ఎలా పోరాడాలో స్థానిక అనుభవాలను ప్రతినిధులు



మీడియా గోష్టిలో మాట్లాడుతున్న తపన్‌సేన్, పక్కన సిహెచ్ నర్సింగరావు

ఇప్పటికే చర్చల సందర్భంగా తెలిపారు. బిజెపి విధానాలతో సామాన్య ప్రజల ఆదాయాలు పడిపోతూ ఉపాధి తగ్గిపోతుంటే మరోవైపు దేశ ప్రజలను కుల, మతాల వారీగా విభజించే 'నేరపూరిత విద్వేషాల'ను పెంచుతోందని, ఇలాంటి ఆటలు సిఐటియు సాగనివ్వదని చెప్పారు. లేబర్ కోడ్‌లను రద్దుచేసి పాత కార్మిక చట్టాలనే కొనసాగించాలని సిటు డిమాండ్ చేస్తోందన్నారు.

విశాఖ ఉక్కుపై రాజకీయ కుట్రలు...

18వ అఖిల భారత సిఐటియూ మహాసభలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రతినిధులు చర్చించారని అయిదేళ్లుగా రా మెటీరియల్ ఇవ్వరు, ఉత్పత్తి సక్రమంగా జరగనివ్వరు, వేతనాలు పూర్తిగా ఇవ్వరు, కన్వేయర్ బెల్ట్‌లు పోతాయి' ఇవన్నీ కుట్రపూరితంగా కేంద్ర బిజెపి రాజకీయ డైరెక్షన్‌లో సాగుతున్నాయని ప్లాంట్‌ను అమ్మడానికే ఈ వాతావరణం సృష్టిస్తోందని తపన్‌సేన్ మండిపడ్డారు. దేశంలో తమిళనాడులో శామ్‌సంగ్ వర్కర్ల పోరాటం స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. యూనియన్ పెట్టుకున్నా యాజమాన్యం ససేమిరా మిగతా 5లో

నదీజలాల వివాద పరిష్కారానికి కమిటీ

- కేంద్ర జలశక్తి శాఖ నోటిఫికేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు రాష్ట్రాల మధ్య నదీజలాల వివాద పరిష్కారానికి కేంద్ర జలశక్తిశాఖ కమిటీ ఏర్పాటు చేసింది. సిడబ్ల్యుసి ఛైర్మన్ అధ్యక్షతన ఏర్పాటయ్యే ఈ కమిటీ వివిధ సంఘాలు, వ్యక్తులు, నిపుణులతో చర్చించి మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని పేర్కొంది. ఈ మేరకు జలశక్తిశాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ సంజయ్‌కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. సెంట్రల్ వాటర్ కమిషన్ ఛైర్మన్ అధ్యక్షులుగా ఉండే ఈ కమిటీలో ఎపి ప్రభుత్వం నుండి జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సలహాదారు, ఇఎన్‌సి, చీఫ్ ఇంజనీరు సభ్యులుగా ఉండనున్నారు. తెలంగాణా ప్రభుత్వం నుండి జలవనరులశాఖ సలహాదారు, ముఖ్యకార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి. ఇఎన్‌సి సభ్యులుగా ఉంటారు. వీరు కాకుండా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్‌బోర్డు, గోదావరి నది మేనేజ్‌మెంట్‌బోర్డు, ఎన్‌డబ్ల్యుడిఏ చీఫ్ ఇంజనీరు, సిడబ్ల్యుసి చీఫ్ ఇంజనీరు సభ్యులుగా ఉంటారు. వాస్తవంగా రెండు రాష్ట్రాల నీటి కేటాయింపులకు సంబంధించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అంశంపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం నడుస్తోంది. రెండు రాష్ట్రాల నుండి వేర్వేరుగా తమ వాదనలు వినిపించారు.

ఆకాశమూ అదానీకే!

పౌర విమానయానంలోకి విదేశీ కంపెనీలు

- అదానీ ఒత్తిళ్లతో కేంద్రం కసరత్తు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న టాటా, ఇండిగో



న్యూఢిల్లీ : విదేశీ విమానయాన కంపెనీలకు భారత గగనతలాన్ని పూర్తిగా తెరిచిపెట్టాలని అదానీ గ్రూపు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోంది. ఇటీవల పలు దేశాలతో భారత్ కుదుర్చుకుంటున్న ద్వైపాక్షిక ఒప్పందాల్లో విదేశీ కంపెనీలకు అనుమతులివ్వాలని కోరినట్లు ఆంగ్లమీడియాలో విస్తృతంగా కథనాలు వస్తున్నాయి. ఈ ప్రతిపాదనపై భారత్‌కు చెందిన రెండు అతిపెద్ద ఎయిర్‌లైన్స్ సంస్థలైన ఎయిర్ ఇండియా, ఇండిగో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

తమ సిఫార్సులకు విరుద్ధంగా అదానీ ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపాయి. విదేశీ ఎయిర్‌లైన్స్‌కు భారత గగనతలాన్ని పూర్తిగా అందుబాటులోకి తీసుకురావడం వల్ల పశ్చిమ ఆసియాలోని భారీ నగదు నిల్వలున్న విమానయాన సంస్థల నుంచి తాము తీవ్రమైన, అన్యాయమైన పోటీని ఎదుర్కోవాల్సి వస్తుందని ఎయిర్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది.

ముంబయి నగరాన్ని అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా మార్చడానికి విదేశీ విమానాలకు విరివిగా అనుమతివ్వడం ద్వారా సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని అదాని గ్రూప్ గత నెలలో ప్రభుత్వానికి తెలిపినట్లు ఎకనామిక్ టైమ్స్ నివేదిక పేర్కొంది. 2030 నాటికి టెర్మినల్స్, రన్‌వేలు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాండ్లింగ్ సౌకర్యాలు, ప్రయాణికుల సౌకర్యాల కోసం 11.1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1 లక్ష కోట్లు) ఖర్చు చేయాలని అదాని గ్రూప్ యోచిస్తోందని అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ డైరెక్టర్ జీత్ అదానీ ఇటీవల పేర్కొన్నారు.

"ప్రయాణికులకు మరిన్ని ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకురావడం అనేది భారతీయ విమానాశ్రయాలను ప్రపంచస్థాయి హబ్‌లుగా మార్చడంలో కీలకమైన అంశం. ఇది భారతీయ విమానయాన సంస్థలు పోటీకి సిద్ధంగా ఉన్నాయా లేదా అనే దానిపై మాత్రమే ఆధారపడి ఆలోచించకూడదు. అంతర్జాతీయ విమాన కంపెనీలకు అనుమతివ్వకపోవడం వల్ల విమానాశ్రయాల ఆస్తులను వృథా చేయడమే అవుతుంది." అని అదాని కంపెనీ అధికారి పేర్కొన్నారు.

జాతీయ పౌరవిమానయాన విధానాన్ని ఉల్లంఘించేలా ప్రతిపాదనలు

భారతీయ విమానయాన సంస్థల వినియోగం 80 శాతం దాటితే తప్ప విదేశీ క్యారియర్‌లకు అదనపు విమాన హక్కులు మంజూరు చేయకూడదనే జాతీయ పౌర విమానయాన విధానాన్ని ఉల్లంఘించేలా అదానీ గ్రూపు ప్రతిపాదన ఉండటం ఆందోళన కరం. చాలా విదేశీ విమానయాన కంపెనీలు భారతదేశం నుంచి తీసుకెళ్లే ప్రయాణికులలో 70 శాతం కంటే ఎక్కువమంది ఇతర దేశాలకు వెళ్లేవారేనని ఎయిర్ ఇండియా సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్ పేర్కొన్నారు. ఈ క్రమంలో భారతీయ సంస్థల పెట్టుబడులకు విఘాతం కలగకుండా మార్పులుండాలని తెలిపారు.

దేశీయ కంపెనీలకు సవాళ్లు..

అదాని గ్రూప్ ప్రతిపాదనలకు కేంద్రం తలొగ్గితే దేశీయ విమాన కంపెనీలు గడ్డుకాలాన్ని ఎదుర్కోనున్నాయి. ఖతార్ వంటి విమాన సంస్థలకు వారి ప్రభుత్వాల నుంచి భారీగా రాయితీలు, నిధుల మద్దతు ఉంటుంది. వాటి వద్ద ఉన్న భారీ నగదు నిల్వలు, తక్కువ ధరకే లభించే ఇంధనం వల్ల అవి టికెట్ ధరలను తగ్గించి విక్రయిస్తాయి. దాంతో భారతీయ కంపెనీలు పోటీ పడలేక నష్టాలను చవి చూస్తాయి.


దుబాయ్, అబుదాబి లేదా దోహా వంటి ప్రాంతాల మీదుగా యూరప్, ఉత్తర అమెరికాకు ప్రయాణికులను చేరవేసే గల్ఫ్‌దేశాల ఎయిర్‌లైన్స్‌కు ప్రయాణికులు మళ్లిపోతారు. దీంతో భారతీయ కంపెనీలు నేరుగా ఇతర దేశాలకు నడిపే విమానాలకు ఆదరణ తగ్గుతుంది. ఈ క్రమంలో దేశీయ విమాన కంపెనీల వ్యాపారం ఒత్తిడికి గురికానుంది. ఈ ప్రభావం భారత విదేశీ మారకంపైనా పడనుంది. మరోవైపు మిగతా 5లో

భూ వివాదాలు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు

టెలీకాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజలకు భూ వివాదాలు లేకుండా, రికార్డుల్లో తప్పులు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం రాష్ట్ర మంత్రులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూతన సంవత్సర కానుకగా రాజముద్రతో కూడిన 22 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలతో గ్రామంలో రెవెన్యూ సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయన్నారు. వివాదాలు లేని స్థలాలను కూడా రీసర్వే పేరుతో అడ్డదిడ్డంగా చేసి వివాదాస్పదంగా చేశారన్నారు. భూమే ప్రాణంగా బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలకు అభద్రతను దూరం చేశామన్నారు. పాస్‌పుస్తకాల పంపిణీ ప్రతి



ఇంట్లో కొత్త సంతోషాన్ని తెస్తోందన్నారు. పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్దిష్ట సమయాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలన్నారు. మంత్రులు, జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో ఎక్కువ చొరవ చూపాలన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఏదో ఒక రోజు తాను స్వయంగా పాల్గొంటానన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి షెడ్యూల్ ప్రకటించినట్లు తెలిపారు. తొలిరోజు పంపిణీ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర వ్యాప్తంగా వారి వారి నియోజకవర్గాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. వేలాది గ్రామాల్లో ఈ కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రికి మంత్రి వివరించారు.

పాస్ పుస్తకాల పంపిణీ సక్రమంగా జరిగేలా చూడండి : సిఎస్

రాష్ట్రంలో రెవెన్యూ సంబంధిత సమస్యలను వీలైనంత వరకు తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం సక్రమంగా జరిగేలా చూడాలని సిఎస్ కె విజయానంద్.. జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైల్వే అండర్ బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వేలకు సంబంధించి పెండింగ్ భూ సేకరణ కేసులకు సంబంధించిన అంశాలు, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ, ప్రజల సంతృప్తి, డాక్యుమెంట్ల అప్‌లోడ్ అంశాలపై శుక్రవారం సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పాస్‌పుస్తకాలను పంపిణీ చేసేందుకు 23 లక్షలు ముద్రించి మిగతా 5లో

గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత..!

- సమ్మెతో దిగొచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ : గిగ్‌వర్కర్ల సమ్మె పిలుపుతో ఫుడ్ యాప్‌లతో పాటు తాజాగా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. ఒక ఆర్థిక సంవత్సరంలో డెలివరీ బాయ్స్ ఒక అగ్రిగేటర్ వద్ద కనీసం 90 రోజులు పని చేస్తే సామాజిక భద్రత కల్పిస్తూ కేంద్రం ముసాయిదా పత్రాన్ని విడుదల చేసింది. ఒకటి కంటే ఎక్కువ అగ్రిగేటర్ల వద్దనైతే 120 రోజులు పని చేయాలని పేర్కొంది. గిగ్ వర్కర్ ఒకే రోజు ముగ్గురు అగ్రిగేటర్ల వద్ద పనిచేస్తే దానిని మూడు రోజులుగా పరిగణిస్తారు. నేరుగా లేక పరోక్షంగా అగ్రిగేటర్‌తో కలిసి పనిచేసే వారిని గిగ్ వర్కర్‌గా గుర్తిస్తామని కేంద్రం పేర్కొంది. ఇ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి గుర్తింపు కార్డు జారీ చేస్తారని, సామాజిక భద్రత ప్రయోజనాలు అందుతాయని పేర్కొంది. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు గత నెల 25, 31 తేదీల్లో సమ్మె చేపట్టడంతో స్విగ్గీ, జొమాటో ప్రోత్సాహకాలు ప్రకటించగా, కేంద్రం ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం ముసాయిదాను డిసెంబర్ 30న విడుదల చేసింది.

ఉమర్ ఖలీద్‌కు బెయిలివ్వండి

- భారత్‌కు అమెరికన్ కాంగ్రెస్ సభ్యుల లేఖ
- మీ గురించే ఆలోచిస్తున్నామని న్యూయార్క్ మేయర్ నోట్

వాషింగ్టన్ : ఎలాంటి విచారణ లేకుండా ఐదేళ్లుగా జైలులో మగ్గుతున్న జెఎన్‌యు విద్యార్థి ఉమర్ ఖలీద్‌కు బెయిల్ మంజూరు చేయాలని, అంతర్జాతీయ చట్ట నిబంధనలకు అనుగుణంగా స్వేచ్ఛగా, సక్రమంగా విచారణ జరిగేలా చూడాలని ఎనిమిదిమంది అమెరికా పార్లమెంట్ సభ్యులు కోరారు. ఈ అంశంపై భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రాకు డిసెంబరు 30న వారు ఒక లేఖ రాశారు. ఉమర్ ఖలీద్, ఆయన సహ నిందితులపై అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా జ్యుడీషియల్ కార్యకలాపాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఖలీద్‌ను గుర్తు చేసుకుంటూ న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ విడిగా ఒక నోట్ రాశారు. ఖలీద్ తల్లిదండ్రులతో తన సమావేశాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు తెచ్చుకున్నారు.

డెమొక్రాట్, టామ్‌లాంటోస్ మానవ హక్కుల కమిషన్ ఉపాధ్యక్షులు జిమ్ మెక్‌గవర్న్ ఎనిమిదిమంది సంతకాలతో కూడిన లేఖను షేర్ చేశారు. ఈ లేఖపై సంతకాలు చేసిన వారిలో భారతీయ సంతతికి చెందిన కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీలా జయపాల్ కూడా వున్నారు. డిసెంబరులో ఉమర్ ఖలీద్ తల్లిదండ్రులను తాము కలుసుకున్న



విషయాన్ని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. యుఎపిఎ కింద ఐదేళ్లుగా బెయిల్ కూడా లేకుండా ఖలీద్‌ను నిర్బంధించా రని, ఇది అంతర్జాతీయ ప్రమాణాలను ఉల్లంఘించడమేనని స్వతంత్ర మానవ హక్కుల నిపుణులు హెచ్చరించారని ఆ లేఖ పేర్కొంది. ఖలీద్ విషయంలో ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తు, చట్టపరమైన ప్రక్రియకు సంబంధించి మానవ హక్కుల సంఘాలు, న్యాయ నిపుణులు, అంతర్జాతీయ మీడియా అనేక ప్రశ్నలు లేవనెత్తాయని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ అంశాలన్నింటినీ సుప్రీంకోర్టు పరిశీలిస్తోందని తెలిసిందని పేర్కొన్నారు. సోదరి వివాహానికి హాజరయ్యే నిమిత్తం ఖలీద్‌కు డిసెంబరు 16 నుండి 29 వరకు షరతులతో కూడిన తాత్కాలిక బెయిల్ లభించింది.

మమ్దానీ లేఖ

ఉమర్ ఖలీద్‌కు న్యూయార్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ స్వయంగా రాసిన నోట్‌లో "చేదు అనుభవాల గురించి మీరు చెప్పిన మిగతా 5లో

విద్యుత్ ఛార్జీలపై ప్రచారార్భాటం ఆపాలి

సర్దుబాటు ఛార్జీల భారం తగ్గించాలి : సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి కూటమి 18 నెలల పాలనలో అదనంగా మోపిన రూ.15,485 కోట్ల సర్దుబాటు ఛార్జీలు రద్దు చేసి తమ చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం ఆపి హామీ ఇచ్చిన విధంగా భారాలు తగ్గించాలని కోరారు. అదనంగా మోపిన రూ.15,485 కోట్ల సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, నెలకు రూ.0.40 పైసలు చొప్పున అదనపు వసూళ్లు ఆపాలని, అదానీ స్మార్ట్‌మీటర్లు ఆపి ప్రజలను రక్షించాలని, విద్యుత్ సుంకం అధికంగా వసూలు చేసిన బకాయిలు కోర్టు ఆదేశాలకు అనుగుణంగా తిరిగి చెల్లించాలని కోరారు. 2019-24 సంవత్సరాల కాలంలో వినియోగించుకున్న విద్యుత్‌పై రూ.12,771 కోట్లు ట్రూఅప్ ఛార్జీలు భారం వేయడానికి పంపిణీ సంస్థలు ప్రతిపాదనలు పెట్టాయని, విద్యుత్ నియంత్రణ మండలి వాటిలో రూ.8,274 కోట్లను తిరస్కరించి రూ.4,497 కోట్లు వసూలు చేయాలని ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నదని ప్రకటించారు. గత 26 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా కూటమి ట్రూడౌన్ చేసిందని మంత్రి ప్రకటించడం హాస్యాస్పదమని వివరించారు. గత 18 నెలల కాలంలో కూటమి సర్కారు రూ.15,485 కోట్లు, 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తున్నదని వివరించారు. ప్రతినెలా అదనంగా యూనిట్‌కు మరో 40 పైసలు వసూలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పెంచిన విద్యుత్ సుంకాన్ని అదే రీతిలో యూనిట్‌కు రూపాయి చొప్పున వసూలు చేశారని, కోర్టు ఆదేశాలిచ్చినా అదనంగా వసూలు చేసిన బకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు. 2024-25 సంవత్సరాల కాలంలో ముందుగానే యూనిట్‌కు 40 పైసలు చొప్పున రూ.2,700 కోట్లు వసూలు చేశారని వివరించారు. అదనంగా వసూలు చేసిన దాంట్లో రూ.923 కోట్లు తగ్గించి ట్రూడౌన్ అని ప్రజల్ని మభ్యపరచడం తగదని పేర్కొన్నారు. తప్పుడు లెక్కలతో మరో రూ.12,771 కోట్లు భారం వేయాలని ప్రభుత్వం తరపున పంపిణీ సంస్థలు కుట్రపన్నాయని, నియంత్రణ మండలి వీటిల్లో అత్యధిక భాగాన్ని తిరస్కరించిందని పేర్కొన్నారు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు.

రాజధాని అమరావతిలో 'గణతంత్ర' వేడుకలు

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26న రిపబ్లిక్ డే వేడుకలను రాజధాని అమరావతిలో జరపాలని నిర్ణయించింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాల నుంచి హైకోర్టుకు వెళ్లే మార్గంలో కుడివైపున సుమారు 22 ఎకరాల్లో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని శుక్రవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్ కుమార్, సిఆర్‌డిఎ కమిషనర్ కె కన్నబాబు, ఎడిసిఎల్, పోలీస్ అధికారులు పరిశీలించారు. గతేడాది రాజధానిలో రిపబ్లిక్ వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. స్థల పరిశీలన చేసింది. వేడుకల నిర్వహణకు అనువైన పరిస్థితులు లేకపోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. ఈ ఏడాది అమరావతిలోనే వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. రిపబ్లిక్ వేడుకల నిర్వహణతో అమరావతికి మరింత ప్రాముఖ్యత పెరుగుతుందని భావిస్తోంది. అందుకనుగుణంగా వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది.


తెలుగును కాపాడుకుందాం

విజయవాడ పుస్తక మహోత్సవంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ నరసింహ

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

ఆంగ్ల మాధ్యమ ప్రభావం నుండి తెలుగు భాషను కాపాడుకోవాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ అన్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో 36వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని ప్రధాన అతిథిగా హాజరైన ఆయన శుక్రవారం సాయంత్రం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జస్టిస్ శ్రీ నరసింహ మాట్లాడుతూ ప్రతి మంచి పుస్తకానికీ తనదైన వ్యక్తిత్వం, జీవలక్షణం ఉంటాయన్నారు. చాలా పుస్తకాలు అల్పాయువులని, కొన్ని పుస్తకాలు చిరాయువులని తెలిపారు. పుస్తకాలు పాఠకులతో తమదైన బాంధవ్యాన్ని పెంపొందించుకుంటా యన్నారు. తన విద్యాభ్యాసమంతా ఆంగ్లమాధ్యమంలో జరిగినా తండ్రి సూచనల మేరకు తెలుగు చదవడం, రాయడం నేర్చుకున్నానని తెలిపారు. పుస్తకాలు చదవడం అనే సంస్కృతిని తర్వాతితరాలకు అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు.

సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కె.రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ తెరలపై పుస్తకాలను చదవడం అంత రసవత్తరమైన అనుభవం కాదన్నారు. అందుకే



విజయవాడ పుస్తక మహోత్సవంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ

నిజమైన పాఠకులంతా మళ్లీ పుస్తకాలవైపు మళ్లుతున్నారని తెలిపారు. రాష్ట్ర రాజధానిలో పుస్తక మహోత్సవానికి స్థలం కేటాయించే అంశాన్ని సానుకూలంగా పరిశీలించేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రముఖ సాహితీవేత్త, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పుస్తక ప్రచురణకర్తలు... రచయితలకు పురుడుపోసే మంత్రసానిలాంటివారని పేర్కొన్నారు. ఆధునిక ఎలక్ట్రానిక్ మాధ్యమాలు పుస్తకాలకు ప్రత్యామ్నాయాలు కాలేవన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన సిపిఐ జాతీయ నాయకులు కె.నారాయణ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమమే స్వాతంత్ర్యోద్యమానికి దారి తీసిందని గుర్తుచేశారు. స్వరాజ్య మైదానాన్ని పుస్తక మహోత్సవానికి, ప్రజలకు దూరం చేయడం పట్ల ఆవేదన వ్యక్తం మిగతా 5లో

'ఎస్ఐఆర్'పై అఖిలపక్ష సమావేశం

- సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అమలుపై తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను అమలు చేయాలని ఇసిఐకి జనసేన పార్టీ విజ్ఞప్తి చేయడం బిజెపి కుట్రపూరిత రాజకీయాలకు ఆ పార్టీ వంతపాడటమేనని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సంస్థాగత విభాగాలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకుని కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని ఎస్ఐఆర్ పేరుతో తమకు అనుకూలంగా లేని ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టిందన్నారు. ఇప్పటికే కేరళలో 22 లక్షలు, మధ్యప్రదేశ్‌లో 42 లక్షలు, చత్తీస్‌గఢ్‌లో 27 లక్షలు, తమిళనాడులో 95 లక్షల మంది ఓటర్లను తొలగించినట్లు పేర్కొన్నారు.

వల్లభనేని వంశీకి ఊరట

ప్రజాశక్తి-అమరావతి

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి హైకోర్టులో ఊరట లభించింది. తదుపరి విచారణ జరిగే వరకు వంశీని అరెస్టు చేయొద్దని మాచవరం పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను సంక్రాంతి సెలవుల తరువాత చేపడతామని ప్రకటించింది. ఎన్‌టిఆర్ జిల్లా, మాచవరం పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ వంశీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు శుక్రవారం విచారించారు. గత జులైలో వంశీ అనుచరులు ఆయన సమక్షంలోనే తనపై మరణాయుధాలతో దాడి చేసి గాయపరిచారని పేర్కొంటూ పోరంకికి చెందిన నూతక్కి సునీల్ డిసెంబరు 17న పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. తొలి నిందితుడిగా వంశీపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన కోర్టును ఆశ్రయించారు. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని వంశీ తరపున న్యాయవాది వి దేవీ సత్యశ్రీ కోరారు. ఘటన జరిగిన 18 నెలలకు కేసు నమోదు చెల్లదన్నారు. ఈ వివరాలను నమోదు చేసిన హైకోర్టు, తదుపరి విచారణ జరిగే వరకు పిటిషనరు వంశీని అరెస్టు చేయరాదని పోలీసులకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వేతన బకాయిలు చెల్లించేలా ఆదేశాలివ్వండి

- జడ్‌పిటిసిలు పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

తమకు చెల్లించాల్సిన గౌరవ వేతనం, టిఎ, డిఎ బకాయిలను ప్రభుత్వం చెల్లించేలా ఆదేశాలివ్వాలంటూ కడప జిల్లాకు చెందిన 27 మంది జడ్‌పిటిసి సభ్యులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత 35 నెలలుగా, ఒక్కో సభ్యునికి రూ.2.10 లక్షల మేరకు ఉన్న బకాయిలను చెల్లించాలంటూ గత ఆగస్టులో ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఫలితం లేదని పేర్కొంటూ ముత్యాల చెన్నయ్య సహా 27 మంది పిటిషన్ వేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర చట్టసభ ప్రతినిధులకు సకాలంలో వేతనాల చెల్లింపులు ఉన్నాయని, తమకు మాత్రం చెల్లించడం లేదని అన్నారు. ప్రభుత్వం తమ పట్ల వివక్ష చూపుతోందని, రాజ్యాంగంలోని అధికరణ 14, 21లకు విరుద్ధంగా ప్రభుత్వ చర్యలున్నాయని చెప్పారు. వెంటనే ప్రభుత్వం వేతన బకాయిలను చెల్లించేలా ఉత్తర్వులివ్వాలన్న పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేయనుంది.

'జి ఆర్ఎంఎం జి' రద్దుకు ఒత్తిడి చేయండి

- ముఖ్యమంత్రిని కోరిన షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకం ఉసురు తీసిన 'జి ఆర్ఎంఎం జి' చట్టాన్ని రద్దు చేయాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. మోడీ తెచ్చిన కొత్త చట్టంతో రాష్ట్రానికి ప్రమాదమని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి తీసుకొస్తున్న నల్ల చట్టాలకు టిడిపి వంత పాడటం సిగ్గు చేటన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఊతం ఇచ్చింది మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని వెల్లడించారు. దేశంలోనే తొలి ఉపాధి హామీ జాబ్ కార్డు అందింది రాష్ట్రంలోనేనని తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని తెలిసి మిన్నకుండటాన్ని తప్పుబట్టారు. కొత్త చట్టంలో నిబంధనల ప్రకారం 40 శాతం నిధులు ఎక్కడ నుంచి తెస్తారని ప్రశ్నించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలకు సిఎం చంద్రబాబు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

విశాఖ ఉక్కు భారతీయులందరి హక్కు

- సిఐటియు అఖిల భారత కార్యదర్శి ఎకె.సింధు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్



మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న కేరళ మాజీ మంత్రి మెర్సీ కుట్టి అమ్మ, సిఐటియు నేత సింధు, ఐద్వా నాయకులు

విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు మాత్రమే కాదని... భారతీయుల హక్కు అని సిఐటియు అఖిల భారత కార్యదర్శి ఎకె.సింధు అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షల్లో శుక్రవారం ఐద్వా జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు. మోడీ విధానాలు స్టీల్‌ప్లాంట్ కార్మికుల, ప్రభుత్వ రంగ పరిశ్రమల మెడకు ఉరితాడుగా మారాయని తెలియజేస్తూ మహిళలు మెడకు ఉరితాడు తగిలించుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, మిట్టల్ ప్రైవేట్ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నష్టాల బాటలో పెట్టి ప్రైవేటు వారికి కట్టబెట్టాలని చూస్తున్నారని వివరించారు. ఇప్పటికే 32 విభాగాలను ప్రైవేటు వారికి కట్టబెట్టేందుకు పూనుకున్నారన్నారు. ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడమే కాకుండా విఆర్ఎస్ పేరుతో పర్మినెంట్ ఉద్యోగులను వేల సంఖ్యలో బయటకు పంపించేశారని తెలిపారు.

ప్రైవేటుపరమైన ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థల పరిస్థితి ఎలా ఉందో మనం చూస్తున్నామన్నారు. దేశ రక్షణకు, సంపదకు కీలకమైన ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటుపరం చేస్తే, మన దేశ భవిష్యత్తు ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టివేయబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమ పరిరక్షణకు ఐదు సంవత్సరాలుగా పోరాడుతుండడం, అందులో మహిళలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావడం గొప్ప విషయమన్నారు. దేశవ్యాప్తంగా ఈ పోరాటాలు శ్రామిక మహిళలకు ఉత్తేజాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలను పరిరక్షించాలని, కార్మికులకు తీవ్ర నష్టాన్ని కలిగించే లేబర్ కోడ్స్‌ను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్ర మాజీ కార్మిక శాఖ మంత్రి మెర్సీ కుట్టి అమ్మ హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పేషీలపై నిఘా !

- విశృంఖలంగా పిఎలు, పిఎస్‌లు, ఒఎస్‌డిలు
- మంత్రులే ప్రోత్సహిస్తున్న పరిస్థితి
- సిఎంఒ నుంచి వ్యవహారంపై ఆరా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర మంత్రుల పేషీలపై ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అనేక పేషీల్లో పనిచేస్తున్న సిబ్బంది వ్యవహారం బయటకు వస్తుండడంతో ప్రభుత్వం కూడా ఇరకాటంలో పడుతోంది. కొంతమంది సిబ్బంది.. మంత్రులకు తెలియకుండా వ్యవహారాలు నడుపుతుంటే.. ఇంకొంతమంది మంత్రులు తమ సిబ్బందిని నేరుగా ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. తాజాగా ఈ వ్యవహారం ముఖ్యమంత్రి దృష్టికి రావడం, ఆయన కూడా మంత్రుల శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఏడాదిన్నర పాలనలో చాలా మంది మంత్రుల పేషీలపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గత ప్రభుత్వంలో పనిచేసిన వారిని విధుల్లోకి తీసుకోవద్దని 2024లోనే ముఖ్యమంత్రి పేషీ నుంచి ఆదేశాలొచ్చాయి. అయితే చాలా శాఖల్లో మాత్రం పాత వారినే పేషీల్లోకి చేర్చుకున్నారు. ఇప్పుడు ఇదే అవకతవకలకు కారణమవుతోందని అంటున్నారు. ఆయా శాఖల్లో ఫైళ్లు కదలాలంటే చేతులు తడపాల్సిందేనని, అప్పుడు ఆ ఫైళ్లకు మోక్షం కలుగుతోందని విమర్శలొస్తున్నాయి. దీనికోసం కొంమంది ఒఎస్‌డిలు, పిఎస్‌లు, పిఎలు సొంతంగా కౌంటర్లు కూడా ప్రారంభించినట్లు తెలుస్తోంది. అత్యంత కీలక శాఖలకు చెందిన ఇద్దరు మంత్రులైతే తమ వ్యక్తిగత సిబ్బంది ద్వారా హైదరాబాద్‌లో ప్రత్యేక కౌంటర్ నిర్వహిస్తున్నట్లు కూడా ముఖ్యమంత్రి పేషీకి సమాచారం వెళ్లినట్లు తెలిసింది. మరో నలుగురు మంత్రులు కూడా తమ సోదరులకు ఆ బాధ్యతలు అప్పగించారని, వారి నుంచి తుది సంకేతాలు వస్తేనే ఫైళ్లు కదులుతున్నాయని విమర్శలొస్తున్నాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత అనేక మంత్రివర్గ భేటీల్లో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించడం, పేషీల్లో సిబ్బందిపై ఆరోపణలను నేరుగా ప్రస్తావించడంతో కొంతమంది తమ సిబ్బందిని విధులకు దూరంగా పెట్టారు. అయితే మొత్తం ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో తొలగించబడిన వారి సంఖ్య అతి తక్కువగా ఉందని అంటున్నారు. అందుకే తాజాగా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం రంగంలోకి దిగి మంత్రుల వ్యవహారంపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఒకవైపు ముఖ్యమంత్రి పేషీ అధికారులే కూపీ లాగుతుండగా, మరోవైపు ఇంటెలిజెన్స్ నుంచి కూడా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఒక మహిళా మంత్రి కూడా ఉన్నట్లు తెలిసింది. ఆమె తన సోదరునికే లావాదేవీల బాధ్యతలు అప్పగించారని సచివాలయంలో ప్రచారం జరుగుతోంది.

వైద్య విద్యార్థుల్లో ఆత్మహత్యల నివారణకు శిక్షణ

- క్యూపిఆర్ ఇండియా సంస్థతో హెల్త్ యూనివర్సిటీ ఒప్పందం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, ఆత్మహత్యలను నివారించేందుకె అమెరికాకు చెందిన క్వశ్చన్, పర్స్యూవేడ్ రిఫర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (క్యూపిఆర్) సంస్థతో ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఒప్పందం చేసుకుంది. విజయవాడలోని విశ్వవిద్యాలయంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ సమక్షంలో అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ సంస్థకు చెందిన మానసిక వైద్య నిపుణులు అపర్ణ మధ్య ఈ ఒప్పందం శుక్రవారం జరిగింది. దీని ప్రకారం ఎంబిబిఎస్‌లో ప్రథమ సంవత్సరం (2025-26)లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో చేరిన విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందించేందుకు, ఒత్తిడిని పారదోలేందుకు, ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటపడేలా కళాశాలల వారీ ఎంపిక చేసిన తేదీల్లో శిక్షణ ఉంటుందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సౌరబ్ గౌర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులతో నేరుగా మానసిక వైద్య నిపుణులు సమావేశమై వారిలో సందేహాల్ని నివృత్తి చేస్తారని పేర్కొన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వైద్య కళాశాలలో ఎంపిక చేసే ఒక సమన్వయకర్త ద్వారా శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులకు మేలు చేకూర్చేలా నిర్వహిస్తామన్నారు.

సాగుదారులకు 'పీత' కష్టాలు !

- అందుబాటులోలేని సీడ్
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి



పీతల సాగు (ఫైల్)

వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా ప్రస్తుత సీజన్లో పీతల సాగు సమస్యగా మారింది. పీతల సాగుకు అవసరమైన సీడ్ హెచరీల్లో దొరకడం లేదు. దీంతో, సాగుదారులు మత్స్యశాఖ అధికారులను సంప్రదిస్తున్నారు. ఫిబ్రవరి వరకు సీడ్ అందించలేమని హెచరీలు చెప్తుండడంతో పీతల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. రొయ్యల పెంపకం గిట్టుబాటు కావడం లేదు. ఎకరం విస్తీర్ణంలో రొయ్యల సాగుకు రూ.5.50 లక్షల వరకు వ్యయం అవుతోంది. ఇంత ఖర్చుపెట్టినా వ్యాధులు సోకిన సందర్భాల్లో పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో, తీరప్రాంతంలోని కొందరు రైతులు పీతల సాగువైపు మొగ్గుచూపుతున్నారు. చెరువుల్లో పెంచే పీతలను ఎక్కువగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. సముద్రతీర ప్రాంతాలు పీతల పెంపకానికి అనుకూలం. నాలుగు నెలల కాలానికి పీతల పెంపకానికి ఎకరాకు రూ.1.75 లక్షల వరకు వ్యయం అవుతోంది. మార్కెట్లో కిలో సైజ్ పీత ధర రూ.1,000, అరకిలో సైజు పీత రూ.750కు వ్యాపారులు కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు. రొయ్యలతో పోలిస్తే వీటికి వ్యాధులు తక్కువ. ఎకరాకు రూ.3.50 లక్షల వరకు ఆదాయం వస్తోంది. కృష్ణా జిల్లాలో అత్యధికంగా ఐదు వేల ఎకరాల్లో, పశ్చిమ గోదావరిలో 2,500, తూర్పు గోదావరిలో 1,900, గుంటూరులో 1,000, ప్రకాశం 750, నెల్లూరు జిల్లాలో 500 ఎకరాల చొప్పున మొత్తం 11,500 ఎకరాల్లో పీతలు సాగు చేస్తున్నారు. అనధికారికంగా రికార్డుల్లో లేని సాగు ఎక్కువగా ఉంది. రెండు నుంచి ఐదు గ్రాముల బరువున్న పీతల సీడ్ మూడు వేల వరకు అవసరం. ఈ దశలో ఒక్కో పిల్ల రూ.20 నుంచి రూ.35 వరకు విక్రయిస్తారు. సి 5, సి 8 దశలో ఉన్న సీడ్ ఎకరాకు ఆరు వేల వరకు అవసరం. సీడ్ దొరక్కపోవడంతో సాగుదారులు మత్స్యశాఖ అధికారులను సంప్రదిస్తున్నా వారూ చేతులెత్తేస్తున్నారు.

ప్రభుత్వ సీడ్‌పైనే రైతుల్లో గురి

పాండిచ్చేరి రాష్ట్రం సిరికాయిలి తాలూకా తోడువాయి గ్రామంలో రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్‌లో ఉత్పత్తి అయ్యే సీడ్ సాగుకు రైతులు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇక్కడ నాణ్యమైన సీడ్ లభిస్తుందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సెంటర్లో డిసెంబర్ నుంచి రైతులకు సీడ్ అందుబాటులో ఉండేది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా సీడ్ అందుబాటులో లేదని చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సీడ్ కోసం ప్రయత్నిస్తున్నాం

పీతల సీడ్ కోసం రైతులు సంప్రదిస్తున్నారు. పాండిచ్చేరిలో ఆక్వా సెంటర్‌ను సీడ్ అడుగుతున్నాం. ఇప్పుడు ఇండెంట్ పెడితే ఫిబ్రవరి తర్వాత మాత్రమే అందించగలమని ఆ ఆక్వా సెంటర్ చెబుతోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పాండిచ్చేరిలో సీడ్ అందుబాటులో లేదు. త్వరలో ప్రత్యామ్నాయలను చూసి రైతులకు సీడ్‌ను సిఫార్సు చేస్తాం.

-ఎ.నాగరాజు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, కృష్ణా జిల్లా

యథాతథంగా 'ఉపాధి' చట్టం

- 'విబి జి ఆర్ఎంఎం జి' పేదల హక్కులకు వ్యతిరేకం
- తెలంగాణ అసెంబ్లీ తీర్మానం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తెలంగాణ శాసనసభ తీర్మానించింది. ఈ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ గ్రామీణ్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (విబి జి ఆర్ఎంఎం జి) పథకం పేదలకు వ్యతిరేకమని పేర్కొంది. దీనిని అమలు చేవద్దని కోరింది. అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. గాంధీని చంపిన ఆర్ఎస్ఎస్ శక్తులే నేడు ఉపాధి హామీ చట్టం నుంచి గాంధీ పేరును తొలగించాయని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ తీర్మానంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 2005లో యుపిఎ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రతి గ్రామీణ కుటుంబానికీ ఏడాదిలో వంద రోజులు పని కల్పించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన ఈ చట్టం ద్వారా రాష్ట్రంలో లబ్ధి పొందిన వారిలో 90 శాతం మంది ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసిలే ఉన్నారని, వారిలో 62 శాతం మంది మహిళలేనని తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం విబి జి ఆర్ఎంఎం జి పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇది ఉపాధి చట్టం ఆత్మను దెబ్బతీసేలా ఉందన్నారు. దీనివల్ల పనిదినాలు తగ్గిపోతాయని, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిధుల వాటాను నిర్ణయించారని వివరించారు. కొత్త పథకంలో శ్రమ ఆధారిత పనులు తొలగించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని పేదల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. సిపిఐ పక్షనేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం పేదల జీవనంతో మమేకమైందన్నారు. ఈ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరారు.

విబి జి ఆర్ఎంఎం జిని సమర్థించిన బిజెపి

విబి జి ఆర్ఎంఎం జిని బిజెపి సమర్థించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకించింది. బిజెపి సభ్యులు మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ విబి జి ఆర్ఎంఎం జి వల్ల ఏ వర్గానికీ నష్టం జరగదన్నారు. ఎంఐఎం సభ్యులు జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని స్వాగతించారు. బిఆర్ఎస్ పార్టీ అప్పటికే వాకౌట్ చేయడంతో ఈ తీర్మానంపై చర్చలో పాల్గొనలేదు.



ప్రపంచ తెలుగు మహాసభ వేదిక ప్రవేశ ద్వారం

నేటి నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభ

- రేపు మారిషస్ అధ్యక్షులు ధరమ్‌భీర్ గోకుల్ రాక
- 5న సిఎం చంద్రబాబు నాయుడు హాజరు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో శని, ఆది, సోమ వారాల్లో ప్రపంచ తెలుగు మహాసభలు జరగనున్నాయి. గుంటూరు - చిలకలూరిపేట జాతీయ రహదారిపై ఏటుకూరు బైపాస్ వద్ద శ్రీ సత్య సాయి స్పిరిట్యుయల్ సొసైటీ సిటీ ప్రాంగణంలో ఈ వేడుకలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం ప్రారంభ సభలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమీడిఘనటం నరసింహం, శాసన సభ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొంటారు. ఈ నెల 4న ఉదయం 10 గంటలకు జరిగే సభలో మారిషస్ అధ్యక్షులు ధరమ్‌భీర్ గోకుల్ హాజరు కానున్నారు. 5న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ సభ జరగనుంది. అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చనతో మహాసభ ప్రారంభం అవుతుందని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు, నిర్వాహకులు కెసిరాజు (గజల్) శ్రీనివాస్ తెలిపారు. తెలుగు మహాసభ ప్రాంగణం ఏర్పాటు చేసిన మరో అయిదు ఉప వేదికలపై సన్మానాలు, సాహితీ సదస్సులు, కవి సమ్మేళనాలు, తెలుగు గీతాలాపనలు వంటి అనేక తెలుగుదనం ఉట్టిపడే కార్యక్రమాలు రాత్రి 11 గంటల వరకు జరగనున్నాయని చెప్పారు. శనివారం సాయంత్రం సభకు ముఖ్య అతిథిగా ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్.మానవేంద్ర రాయ్, విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురంధేశ్వరి, శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొననున్నారు. ఏర్పాట్లను, భద్రత వ్యవహారాలను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, ఇంటిల్ జెన్సు సెక్యూరిటీ ఎస్‌పి ఆరీఫ్ హఫీజు, పలువురు అధికారులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు.

ప్రతిపాదిత పెట్టుబడుల్లో రాష్ట్రం అగ్రగామి

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



దేశ వ్యాప్తంగా ప్రతిపాదిత పెట్టుబడుల్లో రాష్ట్రం అగ్రగామిగా ఉందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశ వ్యాప్తంగా ప్రతిపాదిత మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం వాటాను రాష్ట్రం దక్కించుకుందని బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా నివేదిక వెల్లడించిందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం వెనుకబడటం లేదని, ముందుకు దూసుకుపోతోందని పేర్కొన్నారు. ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) రాష్ట్రాలను వెనక్కునెట్టి ముందంజలో నిలిచిందని పేర్కొన్నారు. నిరంతరం సంస్కరణలు, వేగవంతమైన నిర్ణయాలు, పెట్టుబడిదారుల పట్ల స్పష్టమైన నిబద్ధతకు ఇదే ఫలితమని తెలిపారు. దీని ద్వారా దేశంలోని పారిశ్రామిక, పెట్టుబడి దిశ తూర్పు నుంచి దక్షిణ రాష్ట్రాల వైపు మళ్లుతున్నట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా ప్రకటించిన మొత్తం మూలధన పెట్టుబడుల్లో 51.2 శాతం కేవలం మూడు రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిపాదిత పెట్టుబడి ప్రకటనలు రూ.26.6 లక్షల కోట్లకు చేరాయన్నారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు అనుకూల పాలన, అనుమతుల మంజూరులో వేగం, రంగాలవారీ విధానాలు, పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, ఇంధనం, డిజిటల్ మౌలిక వసతులపై భారీ పెట్టుబడులు ఈ విజయానికి ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు.

రాజధాని విస్తరణకు 7 నుంచి మలివిడత భూ సమీకరణ

- మంత్రి పి నారాయణ

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)



రాజధాని అమరావతి విస్తరణకు ఈ నెల 7వ తేదీ నుంచి మలి విడత భూ సమీకరణ చేపట్టనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిలోని ఎల్‌పిఎస్ (ల్యాండ్ పూలింగ్) లేవుట్లలో జరుగుతున్న విధంగానే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాజధాని గ్రామాలు నేలపాడు, మల్కాపురంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. మల్కాపురం గ్రామసభ ముగిసిన అనంతరం మీడియాతో నారాయణ మాట్లాడారు. 3వ తేదీ నుండి భూ సమీకరణకు అధికార యంత్రాంగం సమాయత్తం కాలేదని, 7వ తేదీ నుంచి భూ సమీకరణ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. తుళ్లూరు మండలం వడ్డమానులో 1,937 ఎకరాలు, పెదపరిమిలో 6,513, హరిశ్చంద్రపురంలో 2,428 ఎకరాలు, అమరావతి మండలం ఏంద్రాయిలో 2,944 ఎకరాలు, కర్లపూడి లో 2,166, వైకుంఠపురంలో 3,036, పెదమొద్దు రులో 1,145 ఎకరాలు కలిపి 16,667.57 ఎకరాలను ప్రభుత్వం భూ సమీకరణ ద్వారా రైతుల నుంచి తీసుకోవాలని సంకల్పించింది. ఇప్పటికే ఈ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మలివిడత భూ సమీకరణపై మంత్రి ప్రకటన చేశారు. నేడో రేపో ఇందుకు సంబంధిం చిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

రాజధాని అభివృద్ధికి సమాంతరంగా గ్రామాభివృద్ధి

రాజధాని అభివృద్ధికి సమాంతరంగా గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని గ్రామాలైన నేలపాడు, మల్కాపురంలో శుక్రవారం 'గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన' పై ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో మంత్రి మాట్లాడుతూ రాజధాని ఎల్‌పిఎస్ (ల్యాండ్ పూలింగ్) లేవుట్లలో జరుగుతున్న విధంగానే గ్రామాల్లో కూడా రూ.906 కోట్లతో తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా గ్రామాల రూపురేఖలు మారిపో తాయన్నారు. ఆరు నెలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు పూర్తి కానున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ భూసమీకర ణలో రాజధాని నిర్మాణానికి మొదట భూములిచ్చిన నేలపాడు గ్రామం నుంచి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేందుకు గ్రామసభ నిర్వహించామన్నారు. నేలపాడు, మల్కాపురం సభల్లో స్థానిక సమస్యలతోపాటు గ్రామకంఠాలు, రిటర్నబుల్ ప్లాట్లలో వీధి పోట్లు తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కొంతమంది మంత్రికి, ఎమ్మెల్యేకి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌డిఎ చీఫ్ ఇంజనీర్ ధనుంజయరావు, రైతు జెఎసి నాయకులు ధనేకుల రామారావు, బెల్లంకొండ నరసింహారావు, డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి భూసమీకరణ కార్యకలాపాలు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి రెండోదశ భూ సమీకరణ ప్రక్రియకు సంబంధించి శనివారం కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. తొమ్మిది యూనిట్లు ఏర్పాటు చేయనుండగా, అందులో ఏడు కార్యాలయాల్లో కార్యకలాపాలు ప్రారంభమయ్యా యి. వాటిల్లో సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కొన్ని యూనిట్లలో కార్యాలయాలకు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. తీసుకున్న భూములను ఎలా నమోదు చేయాలి, ఫార్మాట్లు తదితర అంశాలపై శిక్షణ మొదలుపెట్టా రు. పెదపరిమిలో రెండు యూనిట్లు ఏర్పాటు చేస్తున్నా వేర్వేరు కార్యాలయాలు కాకుండా ఒకేచోట పెట్టాలని నిర్ణయించారు. పూలింగుకు సంబంధించి గ్రామాల వారీ భూమి వివరాలు, రైతులు, వృత్తులు, వ్యవసాయంపై ఆధారపడుతున్న వారు, ఏ పంట దిగుబడి ఎంత ఉంది వంటి అంశాలపై తుళ్లూరు, అమరావతి తహశీల్దార్లు నివేదిక పూర్తి చేసి ఆయా జిల్లాల కలెక్టర్లకు, సిఆర్‌డిఎ కార్యాలయానికి పంపారు. అదనంగా ఇద్దరు స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు కావాల్సి ఉండటంతో వారి నియామకాన్ని కూడా ఒకటీ రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిసింది. నోటిఫికేషన్ సిద్ధమైనప్పటికీ ముఖ్యమం త్రి షెడ్యూల్ కూడా బిజీ ఉండటంతో ఏదైనా అత్యవసరం అయితే చర్చించేందుకు అవకాశం ఉండదని ఆలోచన చేసినట్లు తెలిసింది. దీంతోపా టు సర్వే నెంబర్లకు సంబంధించిన భూమి స్థితిపైనా స్వల్ప మార్పులు ఉండటంతో వాటిని పరిశీలన చేస్తున్నారు. శనివారం రెండోదశ పూలింగు ప్రాంతంలో అధికారులు పర్యటించనున్నారు. 20,494 ఎకరాలకు సంబంధించిన రైతుల సంఖ్యలోనూ తేడాలు ఉండటంతో వాటిని సరిచేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ భూమికి సంబంధించి అటవీ భూమి, కొండ పోరంబోకు వంటి భూములు కూడా ఉన్నాయని, వాటిల్లో కొంత సాగుదారులు, కొన్నిచోట్ల పట్టాలు కూడా ఉన్న నేపథ్యంలో వాటిని ఏ కేటగిరి కింద చేర్చాలనే అంశంపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. అలాగే గతంలో ప్రభుత్వం కొని రైతులకు కేటాయించిందని, వాటిని ఏ కేటగిరిలో చేర్చాలనే అంశంపైనా రెవెన్యూ అధికారులు స్పష్టత కోరినట్లు తెలిసింది.


5, 6 తేదీల్లో పంచాయతీల వర్గీకరణ ప్రతిపాదనలు పరిశీలన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో రాష్ట్రంలో గ్రామ పంచాయతీల వర్గీకరణ ప్రతిపాదనలను జిల్లాల వారీ రూపొందించి ఈ నెల 5, 6 తేదీల్లో అందించాలని జిల్లా పంచాయతీ అధికారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరు కార్యాలయం ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది. జిల్లాల పునర్విభజనతో కొత్తగా రెండు జిల్లాలు ఏర్పడినందున 28 జిల్లాల వారీ గ్రామ పంచాయతీల వర్గీకరణ ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 5న జోన్ 1, జోన్ 2కు సంబంధించిన, 6న జోన్ 3, జోన్ 4కు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని పేర్కొంది.

ప్రజా ఉద్యమకారులపై పీడీ యాక్టు చట్టవిరుద్ధం

- రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తాం : విజూ కృష్ణన్, వెంకట్



అప్పలరాజు తల్లిని, భార్యను పరామర్శిస్తున్న విజూ కృష్ణన్, వెంకట్ తదితరులు

ప్రజాశక్తి- ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా)

దేశంలోనూ, రాష్ట్రంలోనూ అభివృద్ధి పేరుతో అరాచకం జరుగుతోందని అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. పీడీ యాక్టు కింద ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజును అరెస్టు చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. అప్పలరాజు కుటుంబాన్ని ఎస్.రాయవరం మండలం ధర్మవరం గ్రామంలో శుక్రవారం ఉదయం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పలరాజు వంటి ప్రజాఉద్యమకారులపై పీడీ యాక్టు పెట్టడం అత్యంత అప్రజాస్వామికమని, నిరంకుశ పోకడని తెలిపారు. దీనిపై ఢిల్లీలో సంయుక్త కిసాన్ సభ సమావేశం నిర్వహించి ఖండిస్తామన్నారు. రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత పొరపాటు చేశామని ఒప్పుకొని అప్పలరాజును బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కంపెనీల కోసం రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా భూములను గుంజుకుంటుంటే వాటి సాగుదార్లయిన పేద రైతులకు మద్దతుగా అప్పలరాజు నిలిచారన్నారు. భూసేకరణతో ఉపాధి కోల్పోయే బలహీన వర్గాలు, మత్స్యకారుల హక్కుల కోసం నిలబడ్డారన్నారు.

ప్రభుత్వమే భూ దందాలకు పాల్పడితే ఈ చట్టాలను కాపాడేది ఎవరిని ప్రశ్నించారు. కూటమి నాయకులు కార్పొరేట్ కంపెనీలతో లాలూచీ పడి వాటాల కోసం ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఆయా సంఘాల జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జిఓ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా ఉద్యమ నేత, సిపిఎం అనకాపల్లి జిల్లా నాయకులు ఎం అప్పలరాజుపై పోలీసులు పెట్టిన పీడీ యాక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసింది. అనకాపల్లి జిల్లా కలెక్టరు పీడీ యాక్టు నమోదు చేయించి డిసెంబరు 23న అప్పలరాజును పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ దీనిపై అధికారిక ఉత్తర్వులను జిఓ 4 ద్వారా శుక్రవారం విడుదల చేశారు.

జల్లికట్టులో అపశృతి

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి - చంద్రగిరి (తిరుపతి జిల్లా)

జల్లికట్టు సంబరాలలో ఎద్దులను నిలువరించే ప్రయత్నంలో పలువురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కొత్తశానంబట్లలో శుక్రవారం వేడుకగా జల్లికట్టు ఉత్సవం జరిగింది. ఈ వేడుకలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి గ్రామస్తులు పెద్ద ఎత్తున ఎద్దులను తీసుకువచ్చారు. ఎద్దుల కొమ్ములను అందంగా అలంకరించి వాటి కొమ్ములకు చెక్కపలకలు, టవళ్లు, ఇతర బహుమతులు కట్టారు. పశువుల కొమ్ములకు ఉన్న బహుమతులను చేజిక్కించుకొనేందుకు అనేక గ్రామాల నుంచి యువకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పశువులను ముస్తాబు చేసిన తర్వాత ఉత్సాహంగా ఎద్దులను యువకులపై వదలిపెట్టారు. వాటిని నిలువరించేందుకు యువకులు కొంత ఇబ్బంది పడ్డారు. ఈ తరుణంలో పది మంది యువకులు తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు 20 మంది యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన యువకులను స్థానిక ఆస్పత్రికి తరలించి గ్రామస్తులు చికిత్స చేయించారు.

శ్రీశైలంలో అర్ధరాత్రి చిరుత కలకలం

- భయాందోళనలో స్థానికులు

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం పాతాళగంగ మెట్ల మార్గంలోని సత్యనారాయణ శాస్త్రి ఇంటి ప్రాంగణంలోకి గురువారం అర్ధరాత్రి చిరుత ప్రవేశించింది. ఈ దృశ్యాలు సిసి కెమెరాలో రికార్డ్ అయ్యాయి. గతేడాది జనవరి ఆరున కూడా ఇదే ఇంటి ఆవరణంలోనికి చిరుత రావడం గమనార్హం. వరుస ఘటనలతో స్థానికులు, యాత్రికులు రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సిబ్బంది సూచనలు ఇస్తూ చిరుత కదలికలపై నిఘా పెంచారు. విషయం తెలుసుకున్న దేవస్థానం అధికారులు యాత్రికులు, స్థానికులు రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని మైకు ద్వారా ప్రకటన చేశారు.

నేడు కొండగట్టుకు పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రానికి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ శనివారం వెళ్లనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా టిటిడి నుంచి రూ.35.19 కోట్ల నిధులతో సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల మధ్య ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

సామాన్య యాత్రికులకు సర్వదర్శనం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి సామాన్య యాత్రికులను శుక్రవారం నుండి ఈ నెల 8వ తేదీ వరకు పూర్తిస్థాయిలో సర్వదర్శనానికి అనుమతిస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య చౌదరి మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే యాత్రికులకు నాలుగో రోజైన శుక్రవారం నుండి 8వ తేదీ వరకు పూర్తిగా సర్వదర్శనానికి కేటాయించినట్లు తెలిపారు. 1వ తేదీ సాయంత్రం నుండి యాత్రికులు పెద్ద సంఖ్యలో తిరుమలకు రావడంతో 1వ తేదీ అర్ధరాత్రి నుంచే యాత్రికులకు వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతించినట్లు చెప్పారు. శ్రీవారి ఆలయంలో అన్ని ఆర్జిత సేవలు, బ్రేక్ దర్శనాలు, ప్రత్యేక దర్శనాలను టిటిడి రద్దు చేసిందని తెలిపారు. టిటిడిలోని అన్ని విభాగాలు పూర్తిస్థాయిలో యాత్రికులకు సేవలందిస్తున్నామని చెప్పారు. క్యూలైన్‌లలో వేచి ఉండే యాత్రికులకు అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు శ్రీవారి సేవకుల ద్వారా నిరంతరాయంగా అందిస్తున్నట్లు తెలిపారు.

ఆ భూములు అర్హులకే ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెత్తందారుల ఆక్రమణలో ఉన్న దళిత, గిరజన, బలహీనవర్గాలకు చెందిన భూములను వెనక్కి తీసుకుని అర్హులైనవారికే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. అసైన్డ్ చట్టానికి విరుద్ధంగా అనర్హులకే ఈ భూములను కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 13 లక్షల ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, అందులో 5.75 లక్షల ఎకరాలు అక్రమంగా, చట్టవిరుద్ధంగా 22ఎ నుంచి వైసిపి ప్రభుత్వం తొలగించి ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అక్రమంగా కట్టబెట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినట్లు తెలిపారు. ఈ భూములను అర్హులకే తిరిగి అందజేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో 2 పర్యాయాలు రెవెన్యూ సదస్సులు నిర్వహించినా ఒక్క ఎకరం భూమి కూడా అనర్హుల నుంచి తీసుకుని అర్హులకు ఇవ్వలేదన్నారు. ఫ్రీ హోల్డ్ నిషేధం గురించి వచ్చే నెలలో నిర్ణయం తీసుకుంటామని రెవెన్యూశాఖ మంత్రి ప్రకటించారని, దీనికి ఇన్ని సమావేశాలు నెలల తరబడి నిర్వాహించాల్సిన అవసరం లేదన్నారు.



గంజాయి నిందితులను రోడ్డుపై నడిపించుకుని తీసుకెళ్తున్న కదిరి పోలీసులు

గంజాయి పట్టివేత

- నిందితులను రోడ్డుపై నడిపించి స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు

ప్రజాశక్తి - కదిరి టౌన్ (శ్రీ సత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో గంజాయి ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కదిరి పట్టణంలోని ప్రధాన వీధుల్లో నడిపించుకుని పోలీసు స్టేషన్ వరకు తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం కదిరి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి శివనారాయణ వెల్లడించారు. కదిరి పట్టణం కోనేరుకు సమీపంలోని ఏటిగడ్డ వద్ద గంజాయి విక్రేతలు ఉన్నారన్న సమాచారంతో సిఐ డివి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బుక్కే అంజినేయులు నాయక్, దేవరకొండ పవన్ కుమార్, సాకే సూరిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1200 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, కదిరి ప్రధాన వీధుల్లో వారిని నడిపించుకుంటూ పోలీసులు తీసుకువెళ్లారు. నిందితులు గత ఆరు నెలలుగా అనంతపురం ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొచ్చి కదిరి పట్టణం, పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వీరితో పాటు గంజాయి తాగుతున్న చాకలి ఆదినారాయణతో పాటు మరో తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశారు. పట్టణ, పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నా, సేవిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని డిఎస్‌పి కోరారు. గంజాయి విక్రేతలపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.

పొట్టేళ్ల వ్యాపారి దారుణ హత్య

- మార్కాపురం జిల్లాలో తొలి ఘటన

ప్రజాశక్తి- బేస్తవారిపేట (మార్కాపురం జిల్లా)

గత బుధవారం ఏర్పాటైన మార్కాపురం జిల్లాలో తొలి హత్య చోటుచేసుకుంది. బేస్తవారిపేటలోని బిసి కాలనీలో ఒక వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పొట్టేళ్ల వ్యాపారం చేసుకుంటున్న ఇద్దరు వ్యక్తులు ఒక ఇంటిని తీసుకుని నివాసం ఉంటున్నారు. వారిలో ఒకరు హత్యకు గురికావడం స్థానికంగా సంచలనం కలిగించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తాడివారిపల్లి గ్రామానికి చెందిన జయంపు కృష్ణయ్య (55), పట్టణానికి చెందిన కొమరోలు చిన్నరంగయ్య ఉమ్మడిగా పొట్టేళ్ల వ్యాపారం చేసుకుంటూ బిసి కాలనీలో నివాసం ఉంటున్నారు. చిన్నరంగయ్య కోసం వచ్చిన మిత్రుడు ఒకరు లోపల మంచంపై ఒక వ్యక్తి నిర్జీవంగా ఉండడం, మృతదేహంపై దుప్పటి కప్పి ఉండడం గమనించి రంగయ్య సోదరులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి తలుపు తెరిచి చూడగా కృష్ణయ్య దారుణ హత్యకు గురైనట్లు గుర్తించారు. కత్తితో విచక్షణారక్షితంగా దాడి చేయడంతో సంఘటనా స్థలం రక్తమడుగులో ఉంది. విఆర్ఒ తురిమెళ్ల చెన్నమ్మ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కంభం సిఐ మల్లికార్జునరావు, బేస్తవారిపేట ఎస్ఐ రవీంద్రారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మార్కాపురం డిఎస్‌పి యు.నాగరాజు ప్రత్యేకంగా ఈ కేసుపై విచారణకు బేస్తవారిపేటకు వచ్చారు. మృతుడి సహచరుడు చిన్నరంగయ్య ఆచూకీ లేకపోవడంతో పరారీలో ఉన్నట్లు భావిస్తున్నారు. వ్యాపార లావాదేవీల నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉండవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. బేస్తవారిపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాయచోటినే జిల్లా కేంద్రంగా కొనసాగించాలి

- లేని పక్షంలో కడప జిల్లాలో విలీనం చేయాలి
- ముస్లిం మైనార్టీ నేతల భారీ ర్యాలీ



రాయచోటిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీలు

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్ (కడప జిల్లా)

రాయచోటిని కడప జిల్లా కేంద్రంగా ప్రకటించి తగిన న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం పట్టణ ముస్లిం మైనార్టీ పెద్దల ఆధ్వర్యంలో రాయచోటిలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి నుండి నేతాజీ సర్కిల్, బస్టాండు సర్కిల్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రాయచోటి జామియా మసీదు సర్కాజీ, ముస్లిం మతపెద్ద షర్ఫుద్దీన్ సాహెబ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా తొలగించడం ద్వారా రాయచోటికి కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. జిల్లాలో ఇక పరిపాలన కుదుట పడిందనుకుంటున్న తరుణంలో ప్రభుత్వం జిల్లా కేంద్రాన్ని అకారణంగా మదనపల్లెకు తరలించడం దారుణమని విమర్శించారు. జిల్లాను మూడు ముక్కలు చేయడం రాయచోటి వాసుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు ప్రజాభిప్రాయాన్ని గౌరవించి రాయచోటిని తిరిగి జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, కాని పక్షంలో రాయచోటి నియోజకవర్గాన్ని కడప జిల్లాలో విలీనం చేయాలని కోరారు.

మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైసిపి నేతలు జాఫర్‌అలీఖాన్, ఎస్.కె.హుస్సేన్, డాక్టర్ జక్రియాబాష మాట్లాడుతూ టిడిపి కూటమి పాలకులు చేసిన తప్పును సరిదిద్దుకోని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ నరసింహ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో సహారా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆప్తాబ్, అమీర్, జిలాన్, వైసిపి నేతలు నవాజ్‌క్రిష్, రోటరీ రియాజ్, టిడిపి నేత బోనమల ఖాదర్‌వలీ, జాఫర్‌అలీఖాన్, ఎజాస్‌ఖాన్, అత్తావుల్లా, పెద్దఎత్తున ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.



నదిలో పడిపోయిన కలెక్టర్‌ను మరో బోటులోకి ఎక్కిస్తున్న మత్స్యకారులు

కలెక్టర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

- పోటీల ట్రయల్ రన్‌లో పడవ బోల్తా

ప్రజాశక్తి - ఆత్రేయపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించే పడవ పోటీల ట్రయల్ రన్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆత్రేయపురం మండలం పులిదిండిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 13 వరకూ సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాదిలాగే ఈ ఏడాదీ గోదావరి కాలువలో పడవ పోటీలను నిర్వహించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా శుక్రవారం పులిదిండిలోని గోదావరి మధ్య డెల్టా ప్రధాన కాలువలో పడవ పోటీల ట్రైల్ రన్ నిర్వహించారు. ఈ రన్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్వయంగా పాల్గొన్నారు. కయాకింగ్ బోటులో బోటింగ్ చేస్తుండగా అదుపుతప్పి పడవ బోల్తా పడింది. వెంటనే పక్కన ఉన్న పడవలోని మత్స్యకారులు ఆయనను సురక్షితంగా మరో బోటు ఎక్కించి ఒడ్డుకు చేర్చారు. లైఫ్ జాకెట్ ఉండటంతో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

తగ్గిన సహకార బ్యాంక్‌ల నిరర్థక ఆస్తులు

న్యూఢిల్లీ : అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్‌లు (యుసిబి) మెరుగైన ప్రగతిని కనబర్చుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) విడుదల చేసిన 'ట్రెండ్స్ అండ్ ప్రోగ్రెస్ ఇన్ బ్యాంకింగ్' నివేదిక ప్రకారం.. 2021 సెప్టెంబర్ నాటికి యుసిబిల స్థూల నిరర్థక ఆస్తులు 15.4 శాతంగా ఉన్నాయి. ఇవి 2025 సెప్టెంబర్ నాటికి 7.6 శాతానికి పరిమితమయ్యాయి. అదే సమయంలో నికర నిరర్థక ఆస్తులు 8.7 శాతం నుంచి 2.5 శాతానికి దిగివచ్చాయి. దేశంలో దాదాపు 1,457 పట్టణ సహకార బ్యాంకులు ఉన్నాయి. ఇవి దాదాపు 11,500 శాఖల ద్వారా 9 కోట్ల మందికి పైగా వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి. స్థానిక వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, చిన్న వ్యాపారాలు, తక్కువ ఆదాయ గృహాలకు ఆర్థిక సేవలు అందించడంలో ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయి.

పిఠాపురంలో పవన్ సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 10న పిఠాపురంలో పర్యటించనున్నారు. అక్కడ జరిగే సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొనున్నారు. ఈ సంక్రాంతి సంబరాల్లో పాల్గొనే కళాకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4.80 లక్షలు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శుక్రవారం విడుదల చేశారు. సంక్రాంతి సంబరాల్లో పాల్గొనే కళాకారులకు పారితోషికం, రవాణా ఛార్జీల కింద ఈ నగదు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

రబీ నుంచి పొగాకు ఫసల్ బీమా యోజన

- టుబాకో బోర్డు గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో చైర్మన్ యశ్వంత్‌కుమార్



రైతుల్ని సత్కరిస్తున్న బోర్డు చైర్మన్, ఈడీ, ఇతర అధికారులు

ప్రజాశక్తి - గుంటూరు

ప్రపంచ పొగాకు మార్కెట్‌లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు పొగాకు ఉత్పత్తిలో ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని పొగాకు బోర్డు చైర్మన్ సిహెచ్.యశ్వంత్‌కుమార్ అన్నారు. టుబాకో బోర్డు 50వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గోల్డెన్‌జూబ్లీ వేడుకలు శుక్రవారం గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డులో గల శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మెరుగైన సాగుపద్ధతుల ద్వారా అధిక దిగుబడి సాధించిన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 26 మంది రైతులకు పురస్కారాలు అందించి సత్కరించారు. నూతన సంవత్సర డైరీని, మెరుగైన సాగుపద్ధతులపై రూపొందించిన పుస్తకాన్ని పొగాకు బోర్డు చైర్మన్, ఇతర అతిథులు ఆవిష్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ పొగాకు పంటపై అనిశ్చితిని తొలగించడానికి, మార్కెటింగ్ సుస్థిరత కోసం రైతులు, విధానకర్తలు, పాలసీ మేకర్స్, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకుల కృషితో 1975 టుబాకో బోర్డు ఏర్పాటైందని గుర్తు చేశారు. గత ఐదు దశాబ్దాలుగా అంతర్జాతీయ మార్కెట్లో భారతీయ పొగాకును ప్రోత్సహించడంలో పొగాకు బోర్డు కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. ఈ ఏడాది అత్యధికంగా 240 మిలియన్ కేజీల ఉత్పత్తిని సుదీర్ఘకాలం వేలం నిర్వహించి, సమర్థవంతంగా విక్రయించుకోగలగటం ద్వారా బోర్డు చరిత్రలో 50వ సంవత్సరం చారిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. వచ్చే రబీ నాటికి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని టుబాకో పంటకు కూడా వర్తింప చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

బోర్డు ఇడి బి.విశ్వశ్రీ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో నాణ్యతతో పాటు ఇఎస్‌జి (పర్యావరణ, సామాజిక, పరిపాలన) ప్రమాణాలు పాటించాలన్నారు. ఇఎస్‌జి మార్గదర్శకాలపై రైతులకు శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో పొగాకు బోర్డు కేవలం రెగ్యులేటరీ సంస్థగా కాకుండా, కంప్లయెన్స్ ఫెసిలిటేటర్, కెపాసిటీ బిల్డర్, ఇంటిగ్రేటర్‌గా పనిచేయనుందన్నారు. బోర్డులో ఖాళీల భర్తీకి, వేలం కేంద్రాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐసిఎఆర్- ఎన్ఐఆర్‌సిఎ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ మాట్లాడుతూ మన పొగాకు నాణ్యతను పెంచేందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు.

టుబాకో బోర్డు వెబ్‌సైట్ ఆవిష్కరణ

ఈ సందర్భంగా టుబాకో బోర్డు వెబ్‌సైట్‌ను ఇండియన్ టుబాకో అసోసియేషన్ సెక్రెటరీ వై.అంకమ్మచౌదరి ఆవిష్కరించగా, మొబైల్ యాప్‌ను శేషుమాధవ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోర్డు ఆక్షన్ డైరెక్టర్ బి.సి.శ్రీనివాస్, బోర్డు సెక్రెటరీ డి.వేణుగోపాల్, రైతులు, వ్యాపార ప్రతినిధులు ప్రసంగించారు.

ఎల్ఐసి బంపర్ ఆఫర్

- ల్యాప్స్ పాలసీల పునరుద్ధరణకు అవకాశం



హైదరాబాద్ : ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) తమ పాలసీదారులకు మరోసారి అద్భుత అవకాశాన్ని కల్పిస్తుంది. నిలిచిపోయిన పాలసీలను పునరుద్ధరించుకోవచ్చని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. వ్యక్తిగత ల్యాప్స్ పాలసీల కోసం జనవరి 1 నుండి మార్చి 2వ తేదీ వరకు ప్రత్యేక పునరుద్ధరణ క్యాంపెయిన్ కొనసాగుతుందని ఎల్ఐసి సిఇఒ, ఎండి ఆర్ దొరైస్వామి తెలిపారు. ప్రీమియం చెల్లించని తేదీ నుండి 5 సంవత్సరాల లోపు ఉన్న పాలసీలను ఈ ప్రత్యేక ఆఫర్ వర్తిస్తుందన్నారు. తమ ప్రియమైన పాలసీదారులు ఆర్థిక భద్రతను పొందడానికి ఇదొక మంచి అవకాశమన్నారు.

ఈ పథకం కింద పునరుద్ధరణకు అర్హత ఉన్న అన్ని నాన్-లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌లపై ఆలస్య రుసుములో 30 శాతం వరకు లేదా గరిష్టంగా రూ.5,000 వరకు రాయితీని అందిస్తుంది. రూ.1,00,000 వరకు 30 శాతం లేదా రూ.3,000 రాయితీ, రూ.1,00,001 నుండి 3,00,000 వరకు 30 శాతం లేదా రూ.4,000 తగ్గింపు, రూ.3,00,001 మరియు అంతకంటే ఎక్కువ పాలసీపై 30 శాతం లేదా రూ. 5,000 వరకు డిస్కౌంట్‌ను పొందవచ్చున్నారు.

పొగాకు ఉత్పత్తులపై పన్ను పెంపు తగదు : ఫైఫా

హైదరాబాద్ : పొగాకు తుది వస్తువులపై భారీగా పన్నులు వేయడాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఫార్మర్ అసోసియేషన్స్ (ఫైఫా) ఆందోళన వ్యక్తం చేసింది. సెంట్రల్ ఎక్సైజ్ (అమెండ్‌మెంట్) బిల్లు 2025 ద్వారా పొగాకు ఉత్పత్తులపై భారీగా పన్నుల పెంపు, రైతులు, గ్రామీణ వాటాదారులలో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తుందని పేర్కొంది. అధిక పన్నులు వినియోగాన్ని తగ్గించడంలో చారిత్రాత్మకంగా విఫలమయ్యాయని.. బదులుగా అవి అక్రమ వాణిజ్యానికి దారి తీశాయని ఫైఫా ప్రెసిడెంట్ మురళీ బాబు పేర్కొన్నారు.



కియా కొత్త సెల్టోస్ ధర రూ.10.99 లక్షలు

హైదరాబాద్ : ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా తన రెండో జనరేషన్ సెల్టోస్‌ను భారత మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ధరల శ్రేణిని రూ.10.99 లక్షలు- రూ.19.99 లక్షలుగా నిర్ణయించింది. జనవరి రెండో వారం తర్వాత నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయని కియా వెల్లడించింది. డిసెంబర్ 11 నుంచి రూ.25,000 టోకెన్ మొత్తంతో బుకింగ్స్ ప్రారంభించింది.

సంపాదకీయం

మొట్టికాయలు!

రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లోని బాలబాలికల మరణాలపై హైకోర్టు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసి హాస్టల్స్‌లోని బాలబాలికలను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్న నేపథ్యంలోనైనా ఏలికలు తగురీతిన స్పందిస్తారా? లేక యథాలాపంగా పాలన సాగిపోతుందో ప్రభుత్వ యంత్రాంగం కదలిక, కార్యాచరణ ద్వారానే తెలుస్తుంది. హాస్టల్ విద్యార్థుల వెతలగురించి ఇప్పటికిప్పుడే హఠాత్తుగా హైకోర్టు మొట్టికాయలు వేయలేదు. వసతిగృహ విద్యార్థుల దుస్థితిపై ప్రజాశక్తితో సహా కొన్ని దిన పత్రికలు ధారావాహికలు ప్రచురించాయి. ఎలక్ట్రానిక్ మీడియా కూడా కొన్ని కథనాలిచ్చింది. విద్యార్థి సంఘాలు ఆందోళనలు గావించినా సర్కారులో మాత్రం చలనం నామమాత్రమే కావడం విచారకరం. 2016 నుంచి ఇప్పటి వరకు 45 మంది బాలబాలికలు చనిపోయారని హైకోర్టు గుర్తించింది. రికార్డుల్లో నమోదు కాని మరణాలింకెన్నో! హాస్టళ్లలో పిల్లలు జ్వరం, కడుపు నొప్పి, కంటి ఇన్‌ఫెక్షన్, బ్లడ్ ఇన్‌ఫెక్షన్ వల్ల చనిపోతున్నారని అధికారులు చెబుతున్నారని, వాటిని ముందుగా నివారించేందుకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హైకోర్టు ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. ఈ విషయంలో అధికారులు తమ విధులను నిర్వహించడంలో విఫలమయ్యారని తప్పుబట్టింది. జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులు ప్రతి 15 రోజులకోసారి సంక్షేమ హాస్టళ్లను సందర్శించి రాత్రి అక్కడ బస చేయాలంటూ 2023 జులై 14న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓ 46ను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించింది. అసాధారణ రీతిలో సాంఘిక సంక్షేమ శాఖ కింద నమోదు చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంతకంతో జారీ అయిన ఆ 50 పేజీల జిఓ లో స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్స్ (ఎస్‌ఓపి) వివరించారు. ఆ జిఓ లోనే పేర్కొన్నదాన్నిబట్టి అప్పటి ముఖ్యమంత్రి ఫిబ్రవరి 6న, ఆ తరువాత మార్చి 15న రెండు సమీక్షా సమావేశాల్లో ఇచ్చిన సూచనలకు అనుగుణంగా నాలుగు మాసాల తరువాత జులై 14న జిఓ జారీ చేశారు. ఎస్‌ఓపి అమలు అరకొరగానే జరిగింది కనుకనే హాస్టళ్లు ఈ దీన స్థితిలో వున్నాయి. ఇక హాస్టళ్లలో మౌలిక సదుపాయాల పరిస్థితీ అంతంత మాత్రమే! పిల్లలకు రక్షిత మంచి నీటిని ఇవ్వడమే సర్కారుకు కష్టమైపోతోంది. పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం హాస్టళ్లలో 86 మంది గిరిజన విద్యార్థినులు కామెర్ల సమస్యతో ఇబ్బంది పడగా ఒకరు మరణించారు. మరో 150 మంది ఇతర సమస్యలతో ఆస్పత్రిపాలయ్యారు. దీనిపై హైకోర్టు ఆదేశం మేరకు విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అందజేసిన నివేదిక ప్రకారం బావిలోని నీటిని నేరుగా నీళ్ల ట్యాంకుకు పంపించి, వాటినే విద్యార్థులు తాగారని తేలింది. 611 మంది విద్యార్థులకు 58 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని, ఇందులో 40 దొడ్లను వ్యాధి ప్రబలిన తర్వాతే కట్టారనీ, 11 మరుగుదొడ్లకు, 2 స్నానపు గదులకు తలుపులు కూడా లేవని నివేదిక పేర్కొంది. ఈ నివేదికను పరిశీలించిన హైకోర్టు.. సిఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో సంబంధిత శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పన ఉండాలని నిర్దేశించింది. ఇంత వివరంగా హైకోర్టు ఆదేశించినా సర్కారు ఏ తీరున స్పందిస్తుందో చూడాలి. ఎందుకంటే హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఆహారం, దుస్తులు, ఆవాసం, ఇతర మౌలిక వసతుల సమస్యలను అధిగమించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని హైకోర్టు ధర్మాసనం 2025 జులై లోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించినా ఇప్పటికీ అది అందజేయనేలేదు. ఆ విషయాన్ని గురువారంనాడు జరిగిన విచారణ సందర్భంగా ధర్మాసనమే గుర్తు చేయాల్సిరావడం సర్కారుకు అవమానకరం. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల పరిధిలో నిర్వహిస్తున్న దాదాపు నాలుగు వేల వసతిగృహాల్లోని విద్యార్థినీ విద్యార్థులను కాపాడడం సర్కారు బాధ్యతేనన్న విషయాన్ని మనసా వాచా కర్మణే సర్కారు పాటిస్తుందని ఆశించ వచ్చునా!

మహనీయుల మాట



నువ్వు ఎగరలేకుంటే పరుగెత్తు,
పరుగెత్త లేకుంటే నడువు,
నడవ లేకుంటే పాకు,
కానీ ఏదో ఒక విధంగా
ముందుకు కదులు.
- మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్


Martin Luther King Jr.

అమానుష హత్యాచారాలు - మనువాద మూలాలు

వ్యాఖ్య

గత వారం సంచలన పరిణామాలు మహిళలపై అత్యాచారాల సమస్యను మరోసారి నాటకీయంగా దేశం ముందుకు తెచ్చాయి. పదిహేనేళ్ల వయసులోనే స్థానిక శాసనసభ్యుడు కులదీప్ సింగ్ సెంగార్ ఉచ్చులో చిక్కిన ఉన్నావో అత్యాచార బాధితురాలు అసాధారణ కథ ప్రజల్లో చర్చగా విస్ఫోటనం చెందింది. 2017లో జరిగిన ఈ అత్యాచార కేసులో సెంగార్ కు విధించబడిన యావజ్జీవ శిక్షను నిలిపివేసి ఆయనను విడుదల చేయాలని ఢిల్లీ హైకోర్టు తీర్పునివ్వడం నమ్మశక్యంగాని విషయంగా తయారైంది. సహజంగానే ఈ తప్పుడు పరిణామంపై దేశమంతటా నిరసన వెల్లువ వ్యక్తమైంది. లైంగిక హింసకు గురైన మహిళలకు న్యాయం చేసే విషయమై మరోసారి చర్చ ప్రారంభమైంది.

ఈ కేసులో పోరాడిన అంబేద్కర్ అనుయాయుడైన న్యాయవాది మెహమూద్ ప్రాచా ఈ తీర్పు భయానక పర్యవసానాలను పేర్కొంటూ 'న్యాయమే బాధితురాలైంది' అంటూ చాలా లోతైన అర్థంగల వ్యాఖ్య చేశారు. 'ఆసిఫా కేసు, హత్రాస్ కేసు, ఇక ఇప్పుడు ఉన్నావో కేసు వంటివి మొత్తం సమాజాన్ని కలచివేస్తాయి. అయితే ఈ రోజున భారత దేశంలో న్యాయపరమైన ఆలస్యం ఎంత మామూలై పోయిందంటే న్యాయమే బాధిత అవుతున్నది అని కూడా ఆయన అన్నారు.



> మత హింస సాగించేప్పుడు మొత్తం ఒక వర్గాన్ని అవమానించేందుకు, నీరసపర్చేందుకు పాశవిక లైంగిక హింస ఒక సాధనంగా ప్రయోగించబడుతుందనేది బాగా తెలిసిన విషయమే. అయితే పోరాటంతో బిల్కిస్ శిక్ష పడేలా చేసినా ప్రభుత్వం ఆ దుండగులను క్షమించి వదిలేసింది. అయితే గౌరవ ప్రదమైన కొన్ని స్వచ్ఛంద సంస్థలూ, జాతీయ మానవ హక్కుల కమిషన్ కృషి వల్ల సుప్రీం కోర్టు ఈ కేసు దర్యాప్తును గుజరాత్ నుంచి బదలాయించింది. పోలీసులు తయారు చేసిన ఎఫ్.ఐ.ఆర్ ను తిరస్కరించింది.

> అతి ప్రాచీన కాలాల నుంచి భారత దేశంలో స్త్రీలు సాధికారతకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, ఆదాయం వంటి అంశాల్లో అసమానతలకు తోడు ఇప్పటి పరిస్థితులలో మూఢత్వం, పురుషాధిక్య పోకడలతో కూడిన అమానుష ప్రపంచమనే మరో పెద్ద సవాలును ఎదుర్కోవలసి వస్తున్నది. కేవలం ప్రజాస్వామిక, లౌకిక శక్తుల సమిష్టి బలంతోనే ఆ సవాలును ఎదుర్కొనడం సాధ్యమవుతుంది. స్త్రీపురుషులు చేయి చేయి కలిపి పోరాడవలసి వుంటుంది. అలాంటి లక్ష్య సాధన కోసం ప్రజాతంత్ర మహిళా ఉద్యమం ఇప్పటికే గణనీయమైన దోహదం చేసింది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

బిల్కిస్ బానో చారిత్రక సమరం

బహుశా ఈ కొత్తరకం భయానక పరిణామాల పరంపర గుజరాత్ మత మారణహోమంతో ప్రారంభమై వుండాలి. బిల్కిస్ బానో సంచలన కేసు ఒళ్లు గగుర్పొడిచే ఈ తప్పుడు ప్రక్రియలను ముందుకు తెచ్చింది. అంతకు ముందు మహిళలు హింసకు గురి కాలేదని కాదు. అయితే కొత్త కోణం ఏమంటే అలాటి నేరాలను ఆయుధాలుగా ప్రయోగించడం. అందుకుగాను మొత్తం సామాజిక రాజకీయ సైద్ధాంతిక తోడ్పాటు కూడా అందించడం. ఈ విధంగా అటు మహిళా సమస్యను ఇటు మతపరమైన దళిత హింసను జతపర్చడం ప్రస్తుతం మరింత భయంగొల్పే అంశంగా మారింది.

న్యాయం కోసం చేసిన పోరాటంలో బిల్కిస్ బానో చెప్పుకోదగిన దృఢ వ్యక్తిత్వాన్ని ప్రదర్శించింది. పౌర సమాజం, పెద్ద ఎత్తున లైంగిక హింస జరిగినట్టు హక్కుల బృందాలు వెల్లడించిన నివేదికలలో సాక్ష్యాధారాలు లభించాయి. అయితే కొన్ని అత్యాచార కేసులు మాత్రమే నమోదు చేశారనీ, అనేకం పోలీసులు సేకరించిన వాటిలోనూ ఆ మహిళలు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో వారు తాము ఎదుర్కొన్న నరకాన్ని గురించి చెప్పేందుకు విముఖంగా వున్నారని ఆర్‌టిఐ ప్రశ్నల ద్వారా సేకరించిన సమాచారం వెల్లడించింది. సమాజం చులకనకు గురవుతామనే భయం వారిని చెప్పడానికి సంశయించేలా చేసేందుకు కారణమైంది. గుజరాత్‌లో 2022 జాతి హత్యాకాండ సాగించిన వారి అమానుష ప్రవర్తనతో భయకంపితులైన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు జంకారు. మరీ ముస్లిం మహిళలకైతే పోలీసులపై అసలు విశ్వాసం లేకుండా పోయింది.

అలాంటి వాతావరణంలోనూ బిల్కిస్ బానో ధైర్యంగా ముందుకొచ్చిన కొద్ది మంది బాధిత మహిళలలో బిల్కిస్ బానో ఒకరు. చారిత్రకంగా చెప్పుకోదగిన స్థాయిలో ఆమె చేసిన పోరాటం కారణంగానే స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే మత హింస నేపథ్యంలో జరిగిన అత్యాచారం కేసులో మొట్టమొదటిసారి శిక్ష పడింది. మత హింస సాగించేప్పుడు మొత్తం ఒక వర్గాన్ని అవమానించేందుకు, నీరసపర్చేందుకు పాశవిక లైంగిక హింస ఒక సాధనంగా ప్రయోగించబడుతుందనేది బాగా తెలిసిన విషయమే. అయితే పోరాటంతో బిల్కిస్ శిక్ష పడేలా చేసినా ప్రభుత్వం ఆ దుండగులను క్షమించి వదిలేసింది. అయితే గౌరవ ప్రదమైన కొన్ని స్వచ్ఛంద సంస్థలూ, జాతీయ మానవ హక్కుల కమిషన్ కృషి వల్ల సుప్రీం కోర్టు ఈ కేసు దర్యాప్తును గుజరాత్ నుంచి బదలాయించింది. పోలీసులు తయారు చేసిన ఎఫ్.ఐ.ఆర్ ను తిరస్కరించింది.

అమానుష హత్యాకాండ

2002 గుజరాత్ మారణకాండలో బిల్కిన్ బానో తదితర ఇంకా అనేక కేసులలో జరిగిన దాన్ని మరింత భయంకరంగా గుర్తు చేసింది ఉన్నావో కేసు. వాస్తవంగా ఉన్నావో కేసు మొక్కుబడిగా తెరిచి మూసేయడానికి ఉదాహరణ వంటిది. అయితే సెంగార్‌కు బలమైన సంబంధాలున్న కారణంగా పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనత చూపాయి. న్యాయ విచారణ సందర్భంలోనే బాధితురాలి సమీప బంధువులను చంపేయడం ద్వారా సాక్ష్యాధారాలను మటుమాయం చేసే ప్రయత్నం జరిగింది. సిబిఐ ఈ కేసులో ఉదాసీనతను వ్యతిరేకిస్తూ పిటిషన్ వేయలేదు. అతనికి మినహాయింపునిస్తూ ఈ అమానుషమైన ఉత్తర్వునిచ్చిన ఢిల్లీ హైకోర్టు కూడా ఆ మాట చెప్పింది. అయితే ఈ ఉత్తర్వు తర్వాత దేశమంతటా వ్యక్తమైన తీవ్ర నిరసన కారణంగా సిబిఐ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వుపై స్టే కోరుతూ సుప్రీంకు వెళ్లవలసి వచ్చింది. ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వు శాంతి భద్రతల కోణంలోనూ లోపభూయిష్టమని చెప్పడం, మినహాయింపును కొట్టి వేయడానికి సాధారణ నిబంధనలు దాటి వెళ్లడం మరో విషయం.

ప్రముఖ సామాజిక కార్యకర్తలు, మహిళా ఉద్యమ నాయకులు, పౌర సమాజ నేతలు ఈ అమానుష పరిణామాలకు సంబంధించి రాజకీయమైన మేధాపరమైన సమాచారం ఎంతో సేకరించారు. ఈ పరిణామాలకు సంబంధించి వారు పొందుపర్చిన అనుభవాలను విస్మరించడం అంటే అనర్థాన్ని కొనితెచ్చుకోవడమే అవుతుంది. హిందూత్వ శక్తుల పెరుగుదల, ఆరెస్సెస్, బిజెపిలకు అధికారం వుండటానికి మహిళలపై నేరాలు పెరిగిపోవడానికి చాలా దగ్గర సంబంధం వుందని ఈ నాయకులు, కార్యకర్తలు, న్యాయవేత్తలు, స్త్రీవాదులు చేసిన అధ్యయనాలు ప్రచురణలూ నిర్ద్వంద్వంగా నిరూపిస్తున్నాయి.

నూరేళ్ల ఆరెస్సెస్ భావజాలం

అందువల్ల ఇక్కడ కేవలం నేరం మాత్రమేగాక ఆ నేరాలను విజయోత్సవాలుగా జరిపి నేరపూరిత సమర్థన కూడా దేశం మూలాలను ఛిద్రం చేస్తున్నది. ఈ ప్రమాదకర జాడ్యం సైద్ధాంతిక మూలాల్లోకి వెళ్లడం ఉపయోగకరంగా వుండగలదు. ఆర్‌ఎస్‌ఎస్ నూరేళ్ల వేడుకల సందర్భంలో ఆ సంస్థ అగ్ర నాయకత్వం అధినేత మోహన్ భగవత్‌తో సహా దాని పురుషాధిక్య పోకడలూ పితృస్వామిక లక్షణాలూ అవిభాజ్యమైనవని వెల్లడించుకున్నారు. సనాతన ధర్మంతో సహా హిందూత్వను ప్రబోధించడం దాని అంతస్సారాన్ని పట్టి చూపించాయి. రామాయణ మహాభారతాల కాలం నుంచి ఇవి మనందరి మెదడు పొరలలో నిక్షిప్తమై పోయాయి. తన పాతివ్రత్యాన్ని నిరూపించుకోవడం కోసం అగ్ని పరీక్షను ఎదుర్కోవలసింది సీత మాత్రమే. ఆధిపత్యం కోసం జరిగే పోరాటంలో అవమానాలకు గురయ్యేది ద్రౌపది శరీరమే.

ఇతిహాసాలు మాత్రమే కాదు, వేదాలు, పురాణ పాఠాలు కూడా వాస్తవంగా స్త్రీలను తక్కువగా చూపడం, శిలువ వేయడం చెరిగిపోని వాస్తవాలుగా వున్నాయి. రుగ్వేద అథర్వ వేదాలలో స్త్రీలకు ఇంటి పని, పిల్లలను కనడం మాత్రమే కేటాయించబడ్డాయి. భర్తకు అంకితం కావడమనే పాతివ్రత్యం లొంగుబాటుకు పర్యాయపదంగా మారింది. భగవద్గీత, అర్థశాస్త్ర అన్నిటినీ మించి మనుధర్మం "స్త్రీలకు శయనించడం, కామదాహం, కోపిష్టితనం, నయవంచన, కపటం, తప్పు నడత వంటి దుర్లక్షణాలుంటాయి. వారికి హృదయమే వుండదనీ, విశ్వాసహీనులనీ, వారిని కాపలాలో వుంచాలనీ, స్త్రీలు స్వాతంత్ర్యానికి అనర్హులనీ, సామాజిక చట్రాన్ని విచ్ఛిన్నం చేస్తారనీ, చంచల స్వభావులనీ' పేర్కొన్నాయి. భర్త తన భార్యను వదలేయవచ్చనీ, తాకట్టు పెట్టవచ్చనీ, లేదంటే అమ్ముకోవచ్చనీ (ద్రౌపది వలె) మనుస్మృతి చెబుతున్నది. శివ పురాణంలోనూ దేవీ భాగవత పురాణం, బ్రహ్మ వైవర్త పురాణం, భగవత్ పురాణం, నారద పురాణం, గరుడ పురాణం, అగ్ని పురాణం మత్స్య పురాణం, బ్రాహ్మణ పురాణం అన్నిటిలోనూ అలాంటి జ్ఞాన గుళికలు వున్నాయి. ఇంటికి పరిమితమై పతి సేవలో, కుటుంబంలోని ఇతర పురుషుల సేవలో నిమగ్నమై స్త్రీలు తమ స్వాతంత్ర్యాన్ని పూర్తిగా మర్చిపోవాలి.

రెండు సవాళ్లపై సమరం

కాలం చెల్లిన ఈ దురభిప్రాయాలన్నీ ఇరవయ్యవ శతాబ్దంలో ఏ విధంగానూ చెల్లుబాటు కాబోవనేది పరమ సత్యం. ఎన్నికైన నాయకులు తాము విశ్వగురువులమనీ, సమకాలీన ప్రపంచంలో అపారమైన ప్రభావశీల నేతలమని భావించేట్టయితే వారు ఇలాంటి తిరోగామి ఆలోచనల నుంచి విడగొట్టుకోవలసి వుంటుంది. వాటికి వ్యతిరేకత ప్రకటించు కోవాల్సి వుంటుంది. అయితే ఆరెస్సెస్ హిందూత్వతో బిజెపి పేగు బంధం కారణంగా ఇది జరిగేపని కాదు. అందువల్ల అతి ప్రాచీన కాలాల నుంచి భారత దేశంలో స్త్రీలు సాధికారతకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, ఆదాయం వంటి అంశాల్లో అసమానతలకు తోడు ఇప్పటి పరిస్థితులలో మూఢత్వం, పురుషాధిక్య పోకడలతో కూడిన అమానుష ప్రపంచమనే మరో పెద్ద సవాలును ఎదుర్కోవలసి వస్తున్నది. కేవలం ప్రజాస్వామిక, లౌకిక శక్తుల సమిష్టి బలంతోనే ఆ సవాలును ఎదుర్కొనడం సాధ్యమవుతుంది. స్త్రీపురుషులు చేయి చేయి కలిపి పోరాడవలసి వుంటుంది. అలాంటి లక్ష్య సాధన కోసం ప్రజాతంత్ర మహిళా ఉద్యమం ఇప్పటికే గణనీయమైన దోహదం చేసింది.

(డిసెంబర్ 31 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

సందర్భం

తొలి మహిళా టీచర్



> దళితులకు మొదటి పాఠశాలను 1848 మే 12న ప్రారంభించి, నాలుగేళ్లలో 20 పాఠశాలలను ఏర్పాటుచేసి, మధ్యాహ్న భోజనం, ఉచిత విద్యను అమలు చేసిన ఘనత ఆమె సొంతం. ఆమె పాఠశాలల్లో ఆంగ్ల విద్యా ప్రాముఖ్యతను వివరించి, సాంప్రదాయ బ్రాహ్మణ కట్టుబాట్లను విమర్శించారు. కరువు కాలంలో 2 వేల అనాథ బాలలను అక్కున చేర్చుకొని విద్యాభ్యాసం అందించడం, ఆమె విద్యా ఉద్యమంలో ఎంతో ముఖ్యమైన అంశం.

సావిత్రీ బాయి ఫూలే భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు. స్త్రీ విద్య, సామాజిక సంస్కరణలకు అంకితమైన ప్రముఖ ఉద్యమకారిణి. ఆమె తన సహచరుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే ఉద్యమంతో కలసి నడిచింది. 1848 జనవరి ఒకటిన మొదటి మహిళా పాఠశాలను పూణేలో స్థాపించి, కుల మతాలకు అతీతంగా విద్యను అందించారు. వితంతువుల వివక్షకు, అక్రమ సంతాన శిశువుల హత్యలకు వ్యతిరేకంగా 1852లో 'మహిళా సేవా మండలి'ని స్థాపించి పోరాడారు. ఆమె సత్యశోధక సమాజంలో మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి కులాంతర వివాహాలు, వితంతు పునర్వివాహాలకు మద్దతిచ్చారు.

అనాథ బాలలు, స్త్రీలకు ఆశ్రమాలు నడిపి, బాల్య వివాహాలు, సతీ సహగమనం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. 1890లో తన జీవిత భాగస్వామి జ్యోతిరావు ఫూలే మరణించినప్పుడు ఆమె అంత్యక్రియలు చేపట్టి, సామాజిక ఆచారాలను ధిక్కరించారు.

దళితులకు మొదటి పాఠశాలను 1848 మే 12న ప్రారంభించి, నాలుగేళ్లలో 20 పాఠశాలలను ఏర్పాటుచేసి, మధ్యాహ్న భోజనం, ఉచిత విద్యను అమలు చేసిన ఘనత ఆమె సొంతం. ఆమె పాఠశాలల్లో ఆంగ్ల విద్యా ప్రాముఖ్యతను వివరించి, సాంప్రదాయ బ్రాహ్మణ కట్టుబాట్లను విమర్శించారు. కరువు కాలంలో 2 వేల అనాథ బాలలను అక్కున చేర్చుకొని విద్యాభ్యాసం అందించడం, ఆమె విద్యా ఉద్యమంలో ఎంతో ముఖ్యమైన అంశం. 1850లో 'నేటివ్ ఫిమేల్ స్కూల్', 'సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆఫ్ మహార్ మాంగ్స్' వంటి సంస్థలు స్థాపించారు. సత్యశోధక సమాజం ద్వారా కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు.

సావిత్రీ బాయి ఫూలే మరాఠీ సాహిత్యంలో తొలి ఆధునిక కవయిత్రిగా, సామాజిక సంస్కరణలు విద్యా ప్రాముఖ్యతను ప్రతిబింబించే కవితా సంపుటాలు వెలువరించారు. ఆమె ప్రధాన కవితా పుస్తకాలు 'అభంగ్' శైలిలో రాసినవి. 38 కవితలతో కూడిన మొదటి సంపుటి 'కావ్య ఫూలే'ని 1854లో వెలువరించారు. ఈ సంపుటి ఆత్మకథాత్మక కవితలతో కూడినది. కుల-లింగ వివక్షలు, విద్యా ప్రాముఖ్యతను వివరించింది.

'పావన కాశీ సుబోధ్ రత్నాకర్ సంపుటిని 1891లో వెలువరించారు. ఇది జ్యోతిరావు ఫూలే జీవిత చరిత్రాత్మక కావ్యం. ఆమె ఆత్మ కథాంశాలతో కూడుకుని ఉంది. ఆమె రచనల్లో, ప్రకృతి, భూమి, పీడితుల స్థితి, శ్రామికుల హక్కుల గురించి సమాచారం ఎక్కువగా ఉంటుంది. ఆమె కవితలు బ్రిటీష్ ఇండియాలో ప్రచురితమైన మొదటి భారతీయ మహిళా కవితా సంపుటాలుగా చరిత్రలో నిలిచాయి.

సావిత్రీ బాయి 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతార జిల్లా, నావలే గ్రామంలో మాలీ కులంలో జన్మించింది. అక్షరాభ్యాసం లేని కుటుంబంలో పుట్టినప్పటికీ తొమ్మిదేళ్ళ వయసులో జ్యోతిరావు ఫూలేతో వివాహం కావడంతో ఆయన ప్రోత్సాహంతో చదువుకుంది. తర్వాత ఆమె అహ్మద్ నగర్‌లో ఉపాధ్యాయురాలి శిక్షణ పొంది, భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్రకెక్కింది. 1897 మార్చిన 10న పూణెలో ప్లేగు సోకడంతో రోగులకు సేవలు అందించింది. ఆ క్రమంలో ప్లేగు సోకిన ఒక బాలుడికి చకిత్స చేస్తుండగా ఆ వ్యాధి సోకి ఆమె మరణించారు. ఆమె సామాజిక సంస్కరణలు, కవిత్వం, మొత్తంగా సావిత్రీ బాయి ఫూలే జీవితం ఈనాటికీ ఎంతో స్ఫూర్తిదాయకం.

- కత్తి కళ్యాణ్,
సెల్ : 6303847077

అభిప్రాయం

మహిళలంటే అంత అలుసా?

హీరోయిన్ల వస్త్రధారణపై సినీ నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి సోషల్ మీడియాలో దుమారం రేగుతోంది. ఆడవారి మీద అఘాయిత్యాలు, అన్యాయాలు పెరిగి పోతున్నాయని గుండెలు బాదేసుకున్న నటుడు శివాజీ కూడా తన సినిమాలలో కథానాయికలు అరకొర దుస్తులతో నటించినప్పుడు ఈ విచక్షణ లేదు. శివాజీకి సపోర్టుగానో, అతన్ని వ్యతిరేకించినవారికి సపోర్టుగానో వస్తున్న గొప్ప వక్తలు ఎవరూ కూడా ఈ విషయాలను పట్టించుకోలేదు. ప్రభాస్ సినిమాకు కలెక్షన్లు రావడానికి హీరోయిన్‌తో ఎక్స్‌పోజింగ్ చేయడంలో తప్పు లేదు కానీ అవే దుస్తులు బయట వేసుకుంటే తప్పు అనడం సరికాదు. బాలీవుడ్‌లో తీస్తున్న సినిమాలకు మనమేం తీసిపోయాం..అంటూ ఈ మధ్య పాత, కొత్త దర్శకులు చెలరేగిపోతున్నారు. ఏమన్నా అంటే పాన్ ఇండియా... అంతర్జాతీయంగా ఆడేస్తోంది అని మీసాలు తిప్పేస్తున్నారు. బీర్ కల్చర్, పబ్ కల్చర్, డ్రగ్స్, హత్యలు, వైవిధ్యమైన అత్యాచారాలు... నేరాలు ఏం కర్మరా మాకు.. మా కళ్లకు అని మొత్తుకునే వాళ్లు పెరిగిపోయారు. అయినా మా హీరో సినిమా అంటే ఆ మాత్రం ఉండాలి. ఆడవారిని దేగకళ్లతో కాల్చేస్తున్నా తన సినిమా అంటే ప్రేక్షకులు ఆ మాత్రం ఆశిస్తారని నిస్సిగ్గుగా చెప్పుకునే హీరోలు జనం మధ్య ఉన్నప్పుడు శ్రీరంగ నీతులు చెప్పడం విచిత్రం. స్త్రీని అంగడి సరుకుగా చూసే బుద్ధి మార్చుకోవాలి. సమాజానికి దోహదపడే సినిమాలు తీసి ఈ నీతులు చెబితే ఆనందంగా వింటారు. అంతేకాదు సమాజం బాగుపడుతుందని సంతోషిస్తారు. వారి వ్యాఖ్యలను స్వీకరిస్తారు.

- టి. గీతావాణి

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

అప్పల్రాజు కేసు!



'నల్లి' కుట్టు

"మన అనకాపల్లి అప్పల్రాజు మీద కేసులు మీద కేసులు బనాయించీసీ.. పీడీ ఏక్టు కింద బొక్కల తోసీయడం కొంచెం బాధగా ఉంది.. అన్నేయం గదా!"

హైదరాబాద్ కోఠీ నుంచి తెప్పించిన హుక్కా కూజాలో.. ఎండు గంజాయి ఆకులు పోసి, అగ్గి ముట్టించి.. గొట్టం దశమంతు నాయుడి నోటికి అందించాడు పరదేశి నాయుడు.

" నా లెవులు పెంచేత్తున్నావురా.. ఎదవా! నవాబు లాగా నన్ను మార్చేత్తున్నావు"-కొత్త గదా! మెత్తగా పీల్చాడు నాయుడు. చుట్టా, చిలుం కన్నా సదుపాయం అనిపించింది నాయుడికి! వాలు కుర్చీలో చేరబడి.. ఎదుటి బల్ల మీద రెండు కాళ్లు పెట్టి ఊపుతూ..

"అప్పల్రాజు శానా తప్పులు సేశాడ్రా! కనికరం అక్కర లేదు. పెద్ద, పేద్ద కంపెనీవోళ్ళు.. అడుగుతారు ప్రెభుత్వాన్ని.. కంపెనీ పెడతామూ.. భూము లివ్వండనీ... అప్పల్రాజులాటోళ్లు అడ్డుపడితే ఎలాగ రా!?"- గొట్టం పీల్చి కొంచెం గాల్లోకి వదిలాడు.

"అలాక్కాదన్నా! పూర్వీకుల భూములు.. ఎంతైనా మమకారం ఎవులుకైనా!"

"ఇది మమకారాల కాలం కాదురా! పసుపు కుంకుమ కింద కన్నోళ్లు ఇచ్చారు, ఇల్లరికం అల్లుడునని మా అత్తోరిచ్చారు.. అంటే కుదరదు.. ఇది కలికాలం కాదు.. కరెన్సీ కాలం.. ఇంగిత జ్ఞానం ఉండాల! కాలజ్ఞానం సెప్పిన బ్రెహ్మంగారి ఇల్లు ఏటయిపోయింది!?"

పరదేశిని పరధ్యానం ఆవరించింది. నేలమీద చేరబడ్డాడు. గమనించాడు నాయుడు.

" ఏట్రా! ఎర్రజెండా గాలి తగిలిందేటి!?"- గొట్టం పక్కన పడేసి గట్టిగా అరిచాడు.

తుళ్ళిపడి లేచాడు పరదేశి.

" అన్నా.. అన్నా.. సిన్న మగతొచ్చింది.. సెమించన్నా.. ఇంకా ఏటి గావాలా! "- లేచి నిలబడి చేతులు కట్టుకున్నాడు.

" ఎంతసేపు ఈ పొగ! నాలిక్కి.. నసాళానికి తడి ఏదీ!? రాష్ట్రం.. కేంద్రం మధ్య సంబంధం గురించి నీ బుర్ర పనిచేయడం లేదా!?

అర్థమైంది పరదేశికి.. పరుగు పరుగున లోపలికి వెళ్లి.. ద్రవ సంబంధ మంచీ, చెడ్డా తెచ్చి పెట్టాడు.

బుక్కెడు తాగీ.. కొంచెం హుక్కా పీల్చీ..

" అప్పల్రాజు గురించి నువ్వు కొంచెం ఫీలవుతున్నట్టు ఉన్నావు గదా!"

నాయుడు మనసులో ఏముందో తెలియని పరదేశి, నక్క వినయంతో కళ్ళు మిటకరించాడు.

" మనం నాటు సారా బట్టీలు నడుపుతున్నా.. బస్తీలకు గంజాయి బస్తాలు పంపుతున్నా.. సెందనం సెట్లు నరికి అమ్మేత్తున్నా.. రంగు రాళ్ల తవ్వీసీకుంతన్నా.. మన మీద ఎందుకు ఇలాంటి కేసులు పెట్టరు! సెప్పిమీ!?"- నాయుడు ద్రవం చప్పరించి, గ్లాసు దించి, కుర్చీలో చేరబడ్డాడు. మూతపడిన సగం కళ్ళల్లో అతడికి ఏవో సరిగమపదనిషాలు!

పరదేశి పరధ్యానం వదిలేసి, నాయుడి ధ్యానం లోకి వచ్చాడు. సగం మూత కళ్ళతోనే, నాయుడు మాటలు కొనసాగిస్తున్నాడు.

" మనిషి కాడు కాబట్టి.. పూజలు, భజనల జనం ఉన్నారు కాబట్టి.. నోరు లేదు కాబట్టి.. లేకపోతే, సమచ్చారానికి ఒకసారి నువ్వు పులుముకుంటన్న.. ఈ సెందనం ఎక్కడిది? పరిమిషనుందా? అని సిమ్మాద్రప్పన్న మీదే కేసులు పెట్టీగలదు మన ప్రెభుత్వం. అప్పల్రాజు ఒక లెక్కా! అర్థమైందా!?"

" మన ప్రేంతమోడు గదా! అని, కొంచెం మనుసు సివుక్కుమంది అంతే!"

" మనకెందుకురా సివుక్కూ! సిగ్గూ,లజ్జా ఎప్పుడో ఒదిలేసినోళ్ళం. . నీకు ఒక ఇషయం సెప్పాలా.. మనము.. మన తర్వాత తరమూ బతకాల.. మొసళ్ల మధ్య జలగల్లాగా.. పులులు తిని ఒదిలేసిన జీవాలను , పీక్కుతినే నక్కల్లాగా.. బతకాలా!"

" అన్నా! అర్థమైంది.. అప్పల్రాజు సంగతి మనకేలా! నిజమేనన్నా"

" ఒరే! కింద నుంచి మీద వరకూ.. కోటీశ్వరులు పంపించే బోటీమాంసాల పొట్లాలు తిన్నోళ్లే! మన బాధ మనం పడుదుం... దుప్పి మాంసం ఒచ్చిందా!?"

" లేదన్నా! ఆ మైనింగోడు దెబ్బేశాడు... ఈ పూటకి సెమలపిల్లే! సరిపెట్టుకుందాం". ★

పెళ్లి మాత్రమే సరిపోదు..

- దంపతులు కలిసి జీవిస్తేనే 'గ్రీన్‌కార్డు'
- అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అటార్నీ బ్రాడ్ బెర్న్‌స్టీన్

వాషింగ్టన్ : వలసదారుల విషయంలో అమెరికా కఠినంగా వ్యవహరిస్తున్నది. ఇందులో భాగంగా కఠిన నిబంధనలను తీసుకొస్తున్నది. ఈ తరుణంలో అమెరికన్ గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే విషయంలో జాగ్రత్తలు, పూర్తి అవగాహన అవసరమని నిపుణులు చెప్తున్నారు. అమెరికాలో శాశ్వత నివాసానికి అనుమతినిచ్చే 'గ్రీన్‌కార్డు' పొందడం ఇప్పుడు మరింత కష్టంగా మారనున్నది. గతంలో అమెరికన్ పౌరులను వివాహం చేసుకోవడం ద్వారా సులభంగా గ్రీన్‌కార్డు పొందే అవకాశం ఉండేది. ప్రస్తుత డోనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ఈ నిబంధనలను కఠినతరం చేసింది. కాగితాల మీద పెళ్లి జరిగితే సరిపోదనీ, భార్యాభర్తలు ఇద్దరూ ఒకే ఇంట్లో నివసిస్తేనే గ్రీన్ కార్డు దరఖాస్తులను పరిగణలోకి తీసుకుంటామని అక్కడి అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అటార్నీ బ్రాడ్ బెర్న్‌స్టీన్ స్పందించారు. "మీరు బంధంలో ఉన్నంత మాత్రాన గ్రీన్‌కార్డు రాదు, కలిసి నివసిస్తేనే వస్తుంది" అని తెలిపారు. ఉద్యోగం, చదువు, ఇతర వ్యక్తిగత కారణాలతో దంపతులు వేర్వేరు ఇళ్లలో నివసిస్తే అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం ఆ దరఖాస్తులను తిరస్కరించే అవకాశముందని వివరించారు. ఇమ్మిగ్రేషన్ ప్రయోజనాల కోసమే పెళ్లి చేసుకున్నారా? అనే కోణంలో అధికారులు లోతైన విచారణ జరుపుతున్నారని వివరించారు. దంపతులు ఒకే చిరునామాలో ఉన్నారా? లేదా? అనే విషయం పైనే కాకుండా, వారి మధ్య ఉన్న బంధం ఎంత వరకు నిజాయితీతో కూడుకున్నదనేది కూడా అధికారులు అంచనా వేస్తారని తెలిపారు. ఇంటి తలుపు తట్టి మరీ విచారణ చేసే అవకాశాలున్నాయనీ, కాబట్టి విడిగా ఉండే దంపతులు దరఖాస్తు చేసుకునే ముందు న్యాయ సలహా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి వలసదారులు, కొన్ని దేశాలే టార్గెట్‌గా డోనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రీన్ కార్డ్ హోల్డర్లపై ఆయన దృష్టి పెట్టారు. గతంలో 'ఆందోళనకర దేశాలు'గా గుర్తించిన 19 దేశాలకు చెందిన శాశ్వత నివాసితుల గ్రీన్‌కార్డులను సమగ్రంగా సమీక్షించాలని ఆయన ఆదేశించారు. దీంతోపాటు గ్రీన్ కార్డ్ దరఖాస్తుదారుల పని అనుమతి కాలాన్ని 18 నెలలకు కుదించారు. ఇప్పటికే ఏటా 50 వేల మందికి వీసాలు ఇచ్చే డైవర్సిటీ వీసా (డివి) లాటరీ ప్రోగ్రామ్‌ను కూడా ప్రభుత్వం నిలిపివేసింది.

ఫాస్ట్‌ఫుడ్ తిని విద్యార్థిని మృతి

అమ్రోహా : ఉత్తర ప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లా మండీ ధనౌరా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫాస్ట్ ఫుడ్ తిని నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థిని ఇల్మా (17) మరణించింది. క్యాబేజి సరిగ్గా ఉడకబెట్టకపోవడంతో, అందులోని పురుగులు ఆమె శరీరంలో ప్రవేశించాయని, మెదడులో తిత్తులు ఏర్పడటం వల్ల మరణించినట్లు వైద్యులు చెప్పారని ఆమె తండ్రి తెలిపారు. ఢిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత నెల 29న మరణించినట్లు చెప్పారు.

భూ వివాదాలు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు

(మొదటిపేజి తరువాయి)

పంపిణీ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రైతుల వద్దనున్న పాత పాస్‌పుస్తకాలను తీసుకుని వాటి స్థానంలో కొత్తవి పంపిణీ చేయడంతోపాటు పాత పుస్తకాలను మనుగడలో లేకుండా చేయాలని ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా రైల్వే లెవెల్ క్రాసింగ్‌లను తొలగించి వాటి స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు లేదా రైల్వే అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రధాని నిర్ణయించారని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా 766 రైల్వే లెవెల్ క్రాసింగ్స్ ఉండగా, వాటిలో ఆర్‌అండ్‌బి రహదారులపై 329, పంచాయతీరాజ్ రోడ్లు వెంబడి 319 ఉండగా మిగతావి ఇతర రహదారులపై ఉన్నాయన్నారు. ఇప్పటికే 363 ఆర్‌ఒబి, ఆర్‌యుబిలు మంజూరు కాగా, మరో 403 మంజూరు కావాల్సి ఉందన్నారు.

తెలుగును కాపాడుకుందాం

(మొదటిపేజి తరువాయి)

చేశారు. సీనియర్ పత్రికా సంపాదకులు కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ పుస్తక పఠనం పట్ల యువతలో ఆసక్తి పెరుగుతోందన్నారు. పాత్రికేయులు, కవి అప్పరసు కృష్ణారావు మాట్లాడుతూ అనాదిగా సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న ఘనత పుస్తకాలకే దక్కుతుందని, సమాజం, శాస్త్రవిజ్ఞానం, వ్యవస్థల పనితీరును, పరిణామక్రమాన్ని అద్దం పడుతూనే భవితకు మార్గదర్శనం చేయగల శక్తి పుస్తకాలకు ఉందని పేర్కొన్నారు. పుస్తక మహోత్సవ కమిటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య స్వాగతోపన్యాసం చేశారు. కన్వీనర్ డి.విజయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. అధ్యక్షులు టి.మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు.

'స్వచ్ఛ నగరం'లో మృత్యు జలాలు

ఇండోర్‌లో 15కి పెరిగిన మరణాలు

- మా బిడ్డను పరిహారం బతికిస్తుందా?
- ప్రశ్నించిన పసికందు తల్లిదండ్రులు



కలుషిత నీరు తాగి మృతిచెందిన చిన్నారి, వివరాలు వెల్లడిస్తున్న అమ్మమ్మ, కలుషిత నీటిని చూపుతున్న స్థానికుడు

భోపాల్ : బిజెపి డబుల్ ఇంజిన్ సర్కారు పాలనలోని మధ్యప్రదేశ్ స్వచ్ఛమైన తాగునీటిని కూడా అందించలేకపోతోంది. దేశంలో 'స్వచ్ఛనగరం'గా ఎనిమిదిసార్లు అవార్డు అందుకున్న ఇండోర్ నగరంలోని భగీరథపురాలో కలుషితమైన నీటిని తాగి మరణించిన వారి సంఖ్య శుక్రవారం నాటికి 15కి పెరిగింది. వీరిలో ఆరు నెలల చిన్నారి కూడా ఉంది. ఈ మున్సిపల్ కార్పొరేషన్ సరఫరా చేసిన నీటిని తాగి గత 10 రోజుల్లో రెండు వేల మందికి పైగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యారు. గురువారం వరకూ 272 మంది ఆసుపత్రుల్లో చేరారని, 71 మంది డిశ్చార్జి అయ్యారని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. 32 మంది రోగులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో చికిత్స పొందుతున్నారని చెప్పారు.

పదేళ్లకు పుట్టిన బిడ్డ మరణించాడు... పసికందు మరణంతో కన్నీరు మున్నీరు

ప్రార్థనలు, మొక్కుల తరువాత పదేళ్లకు పుట్టిన బిడ్డ మరణించాడని భగీరథ్‌పురాలోని మరాఠీ మొహల్లాలో బాలుడు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఆరు నెలల చిన్నారి అవ్యాన్ సాహు అమ్మమ్మ కృష్ణ సాహు మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి పరహారం తీసుకోలేదు. మా బిడ్డ పోయాడు. పరిహారం తనను బతికిస్తుందా? డబ్బు కంటే మా బిడ్డ గొప్పవాడు' అంటూ రోదించారు. పెళ్లయిన పదేళ్లకు ఎన్నో మొక్కుల తర్వాత తన కూతురుకు బిడ్డ పుట్టాడని, ఇంతలోనే కలుషిత నీటి వల్ల మరణించాడని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన పాలపొడిలో మున్సిపల్ కుళాయి నీటిలో కలిపి ఇవ్వడమే ప్రాణం తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించగా, తిరస్కరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కలుషిత నీటి వల్ల ఏ తల్లీ బిడ్డను కోల్పోకుండా చూడాలని అదే ప్రాంతానికి చెందిన అనితా సేన్ కోరారు. ఇప్పటికైనా స్వచ్ఛమైన నీటిని అందించాలని అన్నారు.

నీటికి బదులు విషం పంపిణీ చేశారు : రాహుల్‌గాంధీ ఆగ్రహం

ఇండోర్‌లో నీటికి బదులు విషం పంపిణీ చేయడం వల్లే మరణాలు సంభవించాయని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విమర్శించారు. పేదలు మరణించినప్పుడలా ప్రధాని మోడీ మౌనంగా ఉంటారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన కేంద్రాన్ని నిలదీశారు. ఇండోర్‌లో నీటికి బదులు విషం పంపిణీ చేసినా మోడీ ప్రభుత్వం మొద్దునిద్రపోతోందని అన్నారు. ఇండోర్‌లోని ప్రతి ఇల్లు శోక సంద్రంగా మారిందని అన్నారు. నీరు మురికిగా ఉందని, దుర్వాసన వస్తోందని ప్రజలు పదేపదే ఫిర్యాదు చేసినా ఎందుకు వినిపించుకోవడం లేదని, ఎందుకు అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. బాధ్యులైన అధికారులు, నేతలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. స్వచ్ఛమైన నీరు అవసరం కాదని, అది జీవించే హక్కు అని అన్నారు. మధ్యప్రదేశ్ దుష్పరిపాలనకు కేంద్రంగా మారిందని అన్నారు. దగ్గు మందుతో చిన్నారుల మరణాలు, ప్రభుత్వాస్పత్రుల్లో ఎలుకలు పిల్లలను చంపడం, ఇప్పుడు కలుషిత నీటి మరణాలు సంభవించాయని విమర్శించారు.

బళ్లారిలో హింస

- బ్యానర్ ఏర్పాటు విషయంలో గొడవ
- బిజెపి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల అనుచరుల మధ్య ఘర్షణ
- హస్తం కార్యకర్త మృతి, పలువురికి గాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

బెంగళూరు : కర్ణాటకలోని బళ్లారి భగ్గుమంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిజెపిలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల అనుచరులు, మద్దతుదారుల మధ్య ఘర్షణ తీవ్ర హింసకు దారి తీసింది. ఈ ఘటనలో కాంగ్రెస్ కార్యకర్త ఒకరు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. బళ్లారిలో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన బ్యానర్ విషయంలో బిజెపి గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి, కాంగ్రెస్‌కు చెందిన బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డిల అనుచరుల మధ్య ఈ గొడవ తలెత్తింది. ఇద్దరు ఎమ్మెల్యేల అనుచరులు నిముషాల వ్యవధిలో కర్రలతో అక్కడికి చేరుకున్నారు. రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘర్షణలో ఒక కాంగ్రెస్ కార్యకర్త చనిపోయాడు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు తొలుత గాల్లోకి కాల్పులు జరిపారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో లాఠీచార్జ్ చేశారు. భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. ఆ తర్వాత అక్కడి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. భరత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గాలి జనార్ధన్‌రెడ్డి మద్దతుదారులు కాంగ్రెస్ కార్యకర్తను హత్య చేశారని చెప్పారు. దీనికి జనార్ధన్‌రెడ్డి బాధ్యత వహించాలని చెప్పారు. హత్యా అభియోగాల కింద ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్టించటం కోసం ఒక పెద్ద కార్యక్రమానికి తలపెట్టామని, చెడగొట్టడం కోసం జనార్ధన్‌రెడ్డి అంతరాయం కలిగించారని, తమ కార్యకర్తను చంపారని చెప్పారు. వాల్మీకి పేరిట దశాబ్దాల నుంచి రాజకీయాలు చేస్తున్న బిజెపి వాల్మీకి వ్యతిరేకంగా మారిందని అన్నారు.

సోషల్ మాధ్యమం ఎక్స్‌కు కేంద్రం నోటీసులు

- 72 గంటల్లో చర్యలు తీసుకోవాలంటూ ఆదేశం

న్యూ ఢిల్లీ : ఎలాన్ మస్క్‌కు చెందిన సోషల్ మాధ్యమం ఎక్స్‌కు భారత ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ శుక్రవారం అధికారికంగా నోటీసులు జారీ చేసింది. ఐటి చట్ట నిబంధనలను అమలు చేయడంలో తీవ్రమైన లోపాలున్నాయని నోటీసులో పేర్కొంది. ఎక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) టూల్ అయిన గ్రోక్‌లో మహిళలు, పిల్లలపై అసభ్యకరమైన కంటెంట్‌ను ప్రచారం చేస్తుందని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం స్పందించింది.. గ్రోక్ కోడింగ్‌ను, ఫ్రేమ్‌వర్క్‌ను సమీక్షించాలని, చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించాలని కేంద్రం ఆదేశించింది. దీనిపై 72 గంటల్లో సరిచేయాలని లేని పక్షంలో చర్యలు తప్పవని నోటీసులో హెచ్చరించింది. ఈ మేరకు ఎక్స్ ఇండియా ఆపరేషన్స్ చీఫ్ కంప్లైయన్స్ ఆఫీసర్‌కు నోటీసులు అందించింది. ఈ నోటీసులో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000, ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ నిబంధనల పాటించడంలో విఫలమైనట్లు స్పష్టం చేసింది. వీటిని పాటించకపోవడం తీవ్రంగా పరిగణించింది. " మీ ప్లాట్‌ఫామ్, దాని బాధ్యతాయుతమైన అధికారులు, చట్టాన్ని ఉల్లంఘించే వినియోగదారులపై ఐటి చట్టం, ఐటి నిబంధనలు, ఇతర చట్టాల ప్రకారం ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా కఠినమైన చట్టపరమైన పరిణామాలకు దారితీయొచ్చు" అని ఆ ఉత్తర్వులో పేర్కొంది. గ్రోక్ ఎఐ టూల్ యొక్క సాంకేతిక, పాలనా ఫ్రేమ్‌వర్క్‌ను తక్షణమే సమీక్షించాలని ఆదేశించింది. అయితే దీనిపై ఎఐ చాట్‌బాట్ గ్రోక్ స్పందించింది. భద్రతా చర్యలలో లోపాలున్నాయని అంగీకరిస్తూ చర్యలు తీసుకుంటామని కేంద్రానికి తెలిపింది..

నువ్వు భారతీయుడివా కాదా ? ఈ పరికరం చెప్పేస్తుంది జాగ్రత్త!

- ఉత్తర ప్రదేశ్‌లో పేదలకు పోలీసు అధికారి బెదిరింపులు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- హడావుడిగా రంగంలోకి పోలీసు విభాగం



(ఇన్‌సెట్‌లో) ఈ మిషన్‌తో భారతీయుడివా కాదా తెలుస్తుందని బెదిరిస్తున్న అధికారి , సాధారణ తనిఖీలకు వెళ్లిన పోలీసులు

ఘజియాబాద్ : "నువ్వు బంగ్లాదేశీ జాతీయుడివా? నువ్వెవరనేది నువ్వు చెప్పకపోయినా ఈ పరికరం చెప్పేస్తుంది... అని భయపెడుతూ ఒక పోలీసు అధికారి ఒక వ్యక్తి వీపుపై స్మార్ట్ ఫోన్‌లా కనిపిస్తున్న ఒక పరికరాన్ని పెట్టి అక్కడ మురికివాడలోని నిరుపేద ప్రజలను బెదిరిస్తున్న వీడియో తాజాగా వెలుగుచూసింది. 'మీరు అక్రమంగా వలస వచ్చారో లేదో ఈ పరికరం చెప్పేస్తుంది' అంటూ వారిని బెదిరించడం అందులో కనిపిస్తోంది. అటువైపు వ్యక్తి మాత్రం తాను బీహార్‌లోని అరారియా జిల్లాకు చెందిన వాడినని చాలా గట్టిగా చెప్పడం వినిపించింది. ఆ పోలీసు అధికారి ఉత్తర ప్రదేశ్ ఘజియాబాద్‌లోని కౌశాంబి పోలీసు స్టేషన్‌కు చెందినవారు కాగా, పోలీసులు రోజువారీ సాగించే తనిఖీల కార్యక్రమంలో భాగంగా ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. అధికారాన్ని ఉపయోగించి పేద ప్రజల హక్కులపై దాడి చేస్తున్న ఈ తీరు పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.విదేశీ అక్రమ వలసదారులను గుర్తించడమే లక్ష్యంగా ఒకపక్క ఎన్నికల కమిషన్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను చేపట్టగా, మరోపక్క పోలీసులు కూడా ఈ విషయంలో పలుచోట్ల పలు రకాలుగా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్‌లో, ఈశాన్య రాష్ట్రాల్లో అనేకమందిని బంగ్లాదేశ్ నుండి వలస వచ్చారనే పేరుతో బలవంతంగా తరలించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా ఘజియాబాద్ పోలీసు అధికారి ఒకరు పాల్పడిన చర్య సోషల్ మీడియాలో వైరల్ అయింది.

తప్పు దిద్దుకుంటామన్న పోలీసులు : దర్యాప్తునకు ఆదేశాలు

పోలీసు అధికారి వీడియో బయటకు రాగానే ఘజియాబాద్ పోలీసు డిపార్ట్‌మెంట్ హడావిడిగా రంగంలోకి దిగింది. దీనిపై విచారణకు ఆదేశించినట్లు శుక్రవారం ఇందిరాపురం సర్కిల్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ కార్యాలయం తెలిపింది. ఈ మేరకు జిల్లా పోలీసు విభాగం ఒక ప్రకటన జారీ చేసింది. ప్రజల జాతీయతలను నిర్ధారించే డ్రైవ్‌ను ప్రత్యేకంగా ఏమీ చేపట్టలేదని, శాంతిభద్రతలను కాపాడేందుకు, ప్రజల్లో విశ్వాసాన్ని పెంచేందుకు, నేరాలు జరగకుండా నివారించేందుకు పోలీసులు, సాయుధ బలగాలు నిర్వహించే సెక్యూరిటీ అపరేషన్లే 'రొటీన్ ఏరియా డామినేషన్ ఎక్సర్‌సైజ్' అని ఆ ప్రకటన పేర్కొంది. ఇందులో భాగంగా గస్తీ ముమ్మర పెట్రోలింగ్, రూట్ మార్చ్‌లు, సున్నితమైన, హై రిస్క్ గల ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతాయని ఆ ప్రకటన పేర్కొంది.

ప్రభుత్వంపై నమ్మకం లేదు, న్యాయస్థానం చర్యలు తీసుకోవాలి : కాంగ్రెస్ డిమాండ్

ఈ వీడియోను హైకోర్టు సుమోటోగా పరిగణనలోకి తీసుకుని ఆ పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 'ఉన్నతాధికారుల నుంచే ఇలాంటి ఆదేశాలు వస్తున్నాయని, అందువల్ల ఇటువంటి అధికారులపై చర్యలు తీసుకుంటారని రాష్ట్ర పోలీ సులు, ప్రభుత్వంపై మాకేమీ అంచనాలు లేవు" అని ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్ పేర్కొన్నారు. యుపిలో ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యమని, చట్టబద్ధ పాలనను కూడా పూర్తిగా ఉల్లంఘించే ఇటువంటి ఘటనలపై హైకోర్టు చర్యలు తీసుకోవాలని కోరారు.

అమెరికాతో చర్చలకు సిద్ధం

- చమురు నిల్వల కోసమే దాడులు
- వెనిజులా అధ్యక్షుడు మదురో వ్యాఖ్యలు

కరాకస్ : అమెరికాతో చర్చలకు సిద్ధమని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో ప్రకటించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా పేరుతో ట్రంప్ కరేబియన్ సముద్ర తీరంలో దాడులు తెగబడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యునైటెడ్ స్టేట్స్‌తో ఒప్పందానికి సిద్ధంగా ఉన్నట్లు మదురో తెలిపారు. ఆ దేశ టెలివిజన్‌లో గురువారం ప్రసారమైన ఒక ఇంటర్వ్యూలో మదురో ఈ వ్యాఖ్యలు చేశారు. వెనిజులాలో ప్రభుత్వాన్ని మార్చాలని, దేశంలోని విస్తారమైన చమురు నిల్వలను స్వాధీనం చేసుకోవాలని అమెరికా కోరుకుంటోందని మదురో స్పష్టం చేశారు. ఆగస్టులో కరేబియన్ సముద్రంలో భారీ సైనిక మోహరింపుతో ప్రారంభమైన దాడులు నెలల తరబడి కొనసాగించడానికి ఇదే కారణమయని ఆయన పేర్కొన్నారు. "వారు ఏమి కోరుకుంటున్నారు? బెదిరింపులు, భయపెట్టడం, బలవంతం ద్వారా తమను తాము రుజువు చేసుకోవాలని వారు కోరుకుంటున్నారని స్పష్టమవుతోంది" అని మదురో అన్నారు. రెండు దేశాలు " డేటా ఆధారంగా చర్చించడానికి " ఇదే సరైన సమయమన్నారు.

చమురు పెట్టుబడులకు ఆహ్వానం

మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన ఒప్పందంపై చర్చించాలనుకుంటే, అందుకు తాము సిద్ధంగా ఉన్నామన్న విషయం అమెరికా ప్రభుత్వానికి తెలుసునని మదురో తెలిపారు. "వారు చమురును కోరుకుంటే, వెనిజులా అమెరికా పెట్టుబడులకు సిద్ధంగా ఉంది, చెవ్రాన్ కంపెనీ మాదిరిగా, వారికి ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడ కావాలంటే అక్కడ ఎలా కావాలంటే అలా సరఫరా చేస్తాం" అని ఆయన అన్నారు. వెనిజులా ముడి చమురును అమెరికాకు ఎగుమతి చేస్తున్న ఏకైక ప్రధాన చమురు సంస్థ చెవ్రాన్ కార్పొరేషన్. ఈ సంస్థను ఇటీవలే అమెరికా నిలుపుదల చేసింది.. మదురో ప్రసంగిస్తున్న రోజే ఐదు పడవలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు అమెరికా సైన్యం ప్రకటించడం గమనార్హం. అమెరికా వెల్లడించిన డేటా ప్రకారం, తాజా దాడులతో సహా మొత్తం 35 పడవలపై దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 115 మంది మరణించారు. ఇందులో సాధారణ మత్స్యకారులున్నారని వెనిజులా తెలిపింది.

సిఐఎ డ్రోన్ దాడి

వెనిజులాలోని డాకింగ్ ప్రాంతంలో గత వారం సిఐఎ డ్రోన్స్‌తో దాడి చేసింది. అమెరికా దాడులు ప్రారంభించి నప్పటి నుండి వెనిజులా గడ్డపై జరిగిన మొట్టమొదటి ప్రత్యక్ష దాడి ఇదే. ఈ విషయాన్ని ట్రంప్ ఒక మీడియా సమావేశంలో పరోక్షంగా వెల్లడించారు. అక్రమ మాదక ద్రవ్యాలు, ఉగ్రవాదం పేరుతో మదురోపై అమెరికా ఒత్తిడి పెంచుతూనే ఉంది. మదురోకి రాజీనామా తప్ప వేరే ప్రత్యామ్నాయం లేదని ట్రంప్ బెదిరించిన సంగతి తెలిసిందే. ఈ డ్రోన్ దాడి గురించి త్వరలో మాట్లాడతానని మదురో తెలిపారు...

ఇరాన్‌లో హింసాత్మక ఆందోళనలు

- ట్రంప్ మద్దతు

టెహ్రాన్: ఇరాన్ అంతర్గత వ్యవహారంలో జోక్యం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరించారు. దేశంలో గత వారం నుండి నిరసనలు జరుగుతున్నాయి. దీని వెనకాల అమెరికా ఉందనే విమర్శలున్నాయి. అయితే వారిని అణిచేస్తే ప్రతిస్పందించడానికి వాషింగ్టన్ సన్నద్ధంగా ఉందని ట్రంప్ శుక్రవారం తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫారమ్‌లో హెచ్చరించారు. వారికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. గురువారం ఇరాన్‌లోని అనేక నగరాల్లో ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణల్లో ఆరుగురు మరణించినట్లు సమాచారం. రాజధాని టెహ్రాన్‌లోని దుకాణదారులు అధిక ధరలు, ఆర్థిక స్తబ్దతపై ఆదివారం సమ్మెకు దిగారు. దీంతో అల్లర్లు దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా వ్యాపించాయి.. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ 2018 లో అమెరికా ఆంక్షలను విధించినప్పటి నుండి సవాళ్లను ఎదుర్కొంటుంది. ట్రంప్ తన మొదటి పదవీకాలంలో అంతర్జాతీయ అణు ఒప్పందం నుండి వైదొలిగిన తర్వాత ఈ ఆంక్షలు విధించారు.

ఖండించిన ఇరాన్

ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లారిజానీ ట్రంప్ వ్యాఖ్యలను ఖండించారు. " మా అంతర్గత విషయాల్లో అమెరికా జోక్యం చేసుకోవడం సరికాదు. ఇది గందరగోళానికి, అమెరికా ప్రయోజనాలను నాశనం చేయడానికి సమానమని ఆయనకు (ట్రంప్) తెలిసి ఉండాలి" అని అలీ అన్నారు.

ఫిబ్రవరి 5న బండ్లపల్లికి కాంగ్రెస్ నేతలు?

- జనవరి 5 నుండి రాష్ట్రవ్యాప్త ప్రచారోద్యమం



న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) కేంద్రం రద్దు చేసిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 5న ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బచావో ఆందోళన్ చేపట్టాలని కాంగ్రెస్ ప్రతిపాదించింది. అందులో భాగంగా పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జునఖర్గే అనంతపురం జిల్లాలోని నార్పల మండలం బండ్లపల్లి గ్రామాన్ని సందర్శించే అవకాశం వుంది. 20ఏళ్ల క్రితం ఈ చారిత్రక పథకాన్ని ప్రారంభించిన గ్రామం అది. సోనియా గాంధీ, అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో 2006 ఫిబ్రవరి 2న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఆ సమయానికి వారు ఇక్కడ పర్యటించాలని ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ప్రతిపాదించారు. దీన్ని పార్టీ నాయకత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది. 'కార్మికుల హక్కులను ప్రభుత్వ భిక్షగా మార్చడానికి' మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 5న దేశవ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ సిద్ధమైన నేపథ్యంలో ఈ ప్రతిపాదన ప్రాముఖ్యతను సంతరించుకుంది.

ఉపాధి హామీ అమలును బలోపేతం చేయాలని, గ్రామీణ కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరుతూ జనవరి 5న రాష్ట్రవ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని ప్రారంభించాలని అన్ని జిల్లా, మండల, గ్రామస్థాయి నేతలకు ఎపి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఇండియా బ్లాక్ భాగస్వాములతో, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, యువజన, మహిళా విభాగాల సమన్వయంతో అందరూ విస్తృతంగా పాల్గొనేలా ఈ ప్రచారోద్యమాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఈ ఉద్యమంలో భాగంగా జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పార్టీ నేతలు, కార్యకర్తలు కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేపడతారు. విబి-జి ఆర్‌ఎం జిపై ఆ వేదిక ద్వారా ఫిర్యాదులు అందజేస్తారు. శాంతియుతంగా నిరసనలు చేపడతారు.



పట్టణ ప్రాంతాల్లో స్పందన తక్కువ

- ఎస్ఐఆర్ అమలు రాష్ట్రాల్లో ధోరణులపై ఇసి

న్యూఢిల్లీ : ప్రస్తుతం తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల నుంచి అందుతున్న ఎన్యూమరేషన్ ఫారాలు చాలా తక్కువగా వున్నాయని ఎన్నికల కమిషన్ అధికారులు శుక్రవారం తెలిపారు. పనులకు వెళ్లడం లేదా వృత్తిపరమైన కారణాలతో ఇళ్ళల్లో లేకపోవడం ఈ ఫారాలు అందజేయకపోవడానికి ప్రధాన కారణంగా వుంటోందని చెప్పారు. ఇతర ప్రాంతాలకు నిరంతరంగా వలస వెళ్లడం కూడా మరో కారణంగా కనిపిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లస్థాయి అధికారులకు అందజేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాల సంఖ్య చాలా ఎక్కువగా వుంటోంది. లక్నో, కాన్పూర్, నొయిడా వంటి నగరాల్లో ఓటర్ల నుండి అందుతున్న ఫారాలు చాలా తక్కువగా వున్నాయన్నారు. ఎస్ఐఆర్ అమలవుతున్న రాష్ట్రాల్లో నెలకొన్న ధోరణులను వారు ఉదహరించారు. గతేడాది బీహార్‌లో ఎస్ఐఆర్ అమలైనపుడు పాట్నాలోనూ ఇదే ధోరణి నెలకొంది. నవంబరు 4న అండమాన్ నికోబార్ దీవులు, లక్షదీవులు, ఛత్తీస్‌ఘడ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌ల్లో ఎస్ఐఆర్ రెండో దశ ప్రారంభమైంది. ఉత్తరప్రదేశ్ మినహా, మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురితమైంది. అస్సాంలో విడిగా ప్రత్యేక సవరణ జరుగుతోంది. రాష్ట్రాల్లో చివరిసారిగా నిర్వహించిన ఎస్ఆఐఆర్‌ని కటాఫ్ తేదీగా చూస్తున్నారు. బీహార్‌లో 2003నాటి ఓటర్ల జాబితాను ఎస్ఐఆర్‌కు ఉపయోగించారు. చాలా రాష్ట్రాల్లో 2002, 2004 మధ్య కాలంలో చివరిసారిగా ఓటర్ల జాబితా సవరణలు జరిగాయి. ఆ రాష్ట్రాలు ప్రస్తుత ఓటర్ల మ్యాపింగ్‌ని దాదాపు పూర్తి చేశాయి.

విద్యుత్ సవరణ బిల్లుపై యుద్ధమే!

(మొదటిపేజి తరువాయి)

అనడంతో సిఐటియు నేరుగా జోక్యం చేసుకోవడంతో యాజమాన్యం చర్చలకు పిలవగా తమ డిమాండ్లను యాజమాన్యం అంగీకరించదన్నారు.

కొత్త విద్యుత్ సవరణ బిల్లుపై గ్రామ గ్రామాన చైతన్యం:

విద్యుత్ చట్ట సవరణ బిల్లు అమలుకు బిజెపి మొండిగా ముందుకెళ్తోందని, ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని ప్రవేట్ పవర్ జనరేటర్(కార్పొరేట్ల)కు ఇచ్చి దేశంలోని సుమారు రూ.80లక్షల కోట్ల విలువైన విద్యుత్ సంస్థల ఆస్తులను వారి చేతుల్లో పెట్టి విద్యుత్ రంగాన్ని అమ్మజూపడం దేశ ద్రోహమని, దీన్ని సిఐటియు అంగీకరించదన్నారు. ఈ విద్యుత్ బిల్లు అమలైతే ప్రధానంగా రైతులు తీవ్రంగా నష్టపోతారని, తర్వాత ఇళ్ల వినియోగదారులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని తక్షణమే క్రాస్‌సబ్సిడీని ప్రజలకు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తుందని దీనిపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రజలను కదిలించే సదస్సులను విద్యుత్ యూనియన్‌లు నిర్వహిస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో ఈ బిల్లుపై కేంద్రంతో పెద్దయుద్ధమే సిఐటియు చేయబోతుందన్నారు. అన్ని రాష్ట్రాల్లో గ్రామ గ్రామాన కమిటీలు వేసి కొత్త విద్యుత్ చట్టంపై కిసాన్ సంయుక్త మోర్చాతో కలసి సిఐటియూ పోరాడుతుందన్నారు.

ఆకాశమూ అదానీకే!

(మొదటిపేజి తరువాయి)

భారత్ కేవలం ఒక ఫీడర్ మార్కెట్ (ప్రయాణికులను అందించేదిగా) మిగిలిపోయే ప్రమాదం ఉంది. అదాని గ్రూప్ పెద్ద మొత్తంలో ఆదాయాన్ని ఆర్జించడం కోసం విదేశీ విమాన కంపెనీల కోసం వత్తాసు పలుకుతూ.. దేశీయ కంపెనీలను నిర్వీర్యం చేసే యోచనలో ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారత్ నుంచి అత్యంత లాభదాయకమైన అంతర్జాతీయ మార్గాల్లో విదేశీ కంపెనీల వాటా పెరగడం ద్వారా దేశీయ కంపెనీలు దివాలా తీసే ప్రమాదం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భారత్‌లో అదాని గ్రూప్ ప్రస్తుతం ఎనిమిది విమానాశ్రయాలను నిర్వహిస్తూ.. ఈ రంగంలో గుత్తాధిపత్యాన్ని కలిగి ఉంది. అదాని వ్యాపారం పెరుగుదల కోసం ఇతర దేశీయ విమాన కంపెనీలను నష్టపరచడానికే కేంద్రంతో సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఖతార్, సింగపూర్, ఇండోనేషియా, మలేషియాతో సహా పలు దేశాలతో కుదుర్చుకున్న ద్వైపాక్షిక ఒప్పందాల్లో ఆయా దేశాల్లోని అంతర్జాతీయ విమానయాన కంపెనీలకు అనుమతించేలా చూడాలని ఒత్తిడి చేస్తోంది.

ఉమర్ ఖలీద్‌కు బెయిలివ్వండి

(మొదటిపేజి తరువాయి)

మాటలను నేను తరచుగా ఆలోచిస్తూ వుంటాను. వీటి ప్రభావం మనలను ఆవరించకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. మీ తల్లిదండ్రులను కలుసుకోవడం చాలా సంతోషంగా వుంది. మీ గురించే మేమందరం ఆలోచిస్తున్నాం" అని పేర్కొన్నారు. డిసెంబర్‌లో అమెరికాలో ఖలీద్ తల్లిదండ్రులు పర్యటిస్తున్న సమయంలో వారిని కలుసుకున్న మమ్దానీ ఈ నోట్‌ను అందజేశారు. దాన్ని ఖలీద్ భాగస్వామి బనోజ్యోత్స్న సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. "జైళ్లు మిమ్మల్ని ఏకాకులను చేయడానికి ప్రయత్నించినప్పుడు, మాటలు ప్రయాణిస్తాయి' అని మమ్దానీ పేర్కొన్నారు.

నిందితుడికి మద్దతు పలికితే దేశం సహించదు : బిజెపి

ఉమర్ ఖలీద్‌కు మద్దతుగా మమ్దానీ చేసిన వ్యాఖ్యలపై బిజెపి అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 'మన ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తడానికి ఆయనెవరు? భారతదేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే వ్యక్తికి మద్దతుగా నిలుస్తున్నారా?' అంటూ ఎదురుదాడి చేశారు.

స్పోర్టివ్‌గా స్పోర్ట్స్ వీక్



హాయ్ ఫ్రెండ్స్,

నా పేరు అక్షయ్ కుమార్. మా స్కూల్లో ఇటీవల స్పోర్ట్స్ వీక్ నిర్వహించారు. స్పోర్ట్స్ కెప్టెన్‌గా మా టీంకి సపోర్ట్ ఇవ్వడం, అన్ని టీమ్స్ బాగా ఆడేలా చూసే బాధ్యత నా మీద పెట్టారు. కెప్టెన్‌గా ఇది నా మొదటి స్పోర్ట్స్ వీక్. ఈసారి ఆటలకి అగ్ని, జల్, పృథ్వీ, వాయు టీంలు వాళ్ళ వాళ్ళ బృందాలతో సిద్ధమయ్యాయి. ప్రతి టీం ఆడేటప్పుడు ఆ టీంలో ఉన్న విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అది చూసి మాకు చాలా సంతోషంగా అనిపించింది. ప్రతి టీం వాళ్లు 'మేమంటే మేమనే'లా గట్టి పోటీ ఇచ్చారు. చాలా ఎంజాయ్ చేస్తూ మా స్పోర్ట్స్ వీక్‌ని పూర్తి చేసాము. బహుమతుల గురించిన ఆలోచనే లేకుండా ప్రతి ఒక్కరూ పోటీలో పాల్గొనడం, అందరం కలిసికట్టుగా పోటీపడడం మా అందరికీ బాగా అనిపించింది ఫ్రెండ్స్.



- పి.అక్షయ్ కుమార్,
ఎనిమిదో తరగతి,
అరవింద హై స్కూలు, కుంచనపల్లి.

హేమంత సౌందర్యం



శీతాకాలం వచ్చింది చల్ల చల్లగా
వాతావరణం మారింది హాయి హాయిగా
పుడమి పురివిప్పి ఆడింది పచ్చ పచ్చగా
అడవి మైమరచి పాడింది తీయ తీయగా

పచ్చిక బయళ్లు నవ్వాయి తెల్ల తెల్లగా
మంచు ముత్యాలు పూశాయి వేయివేయిగా
స్వచ్ఛకాంతులే రువ్వాయి జగతి మురియగా
మచ్చలేని పూర్ణ చంద్రులే ప్రగతి చాటగా

కొబ్బరాకు అంచుల్లో రతనాలే రమ్యంగా
అబ్బురంగా అతిశయంగా జర జర జారంగా

విరిసిన ప్రతి సుమం హిమ బిందువులను ముద్దాడగా
మురిసిన ప్రతి హృదయం భూపాల రాగమే తీయగా

- గుండాల నరేంద్రబాబు,
తెలుగు సాహిత్య పరిశోధకులు (పిహెచ్డి),
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి,
94932 35992.

నేను గీసిన బొమ్మ





ఎం.లావణ్య,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పారసాం,
నెల్లిమర్ల మండలం,
విజయనగరం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పరుగే ఊపిరిగా .. ఒలింపిక్స్ లక్ష్యంగా ...

ఏ మనిషికైనా పుట్టుకతో కాదు; ప్రయత్నంతోనూ, ప్రతిభతోనూ గుర్తింపు వస్తుంది. కఠోర శ్రమతో, ఆత్మవిశ్వాసంతో సాధన చేస్తే అనుకున్నది సాధించవొచ్చని ఆ యువకుడు నిరూపించాడు. పరుగుల వేటలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తన సత్తా చాటుతున్నాడు. అతడే కరబోతు పైడప్పడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా తన లక్ష్యమైన 'పరుగు'ను కొనసాగించాడు. తను ఎంచుకున్న ఆర్మీలో స్థానం సంపాదించుకున్నాడు.



విశాఖ జిల్లా భీమిలి మండలం సింగనబందపాలెం గ్రామానికి చెందిన కరబోతు సన్యాసిరావు, నారాయణమ్మ దంపతుల చిన్న కుమారుడు పైడప్పడు. సొంత ప్రాంతంలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో తల్లిదండ్రులు ఇద్దరూ కూలి పనుల కోసం విజయవాడకు వలస వచ్చారు. ఆ తర్వాత మొగల్రాజపురం కొండపై (రావిచెట్టు సెంటరు) అద్దె ఇంట్లో ఉంటూ కుమారుడిని చదివించారు. చిన్నప్పటి నుంచే పైడప్పడుకు పరుగు (రన్నింగ్) అంటే బాగా ఇష్టం. ప్రాథమిక విద్య నుంచే ప్రాక్టీస్ ప్రారంభించాడు. తల్లిదండ్రులు ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకుంటూ వచ్చే కూలి డబ్బులతోనే కుటుంబం గడిచేది. అనునిత్యం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూసిన పైడప్పడు జీవితంలో మంచి స్థానంలో నిలిచి వారికి బాగా సాకాలని భావించాడు. నిద్ర లేస్తే పలకరించే కష్టాలు, కన్నీళ్లు అతని పరుగుకు అడ్డంకి కాలేదు. అంతర్జాతీయ స్థాయి పతకం సాధించి అమ్మకు కానుకగా ఇవ్వాలన్న లక్ష్యం అతని పరుగుకు ప్రేరణగా నిలిచింది. కూలి పనులపై వెళ్లి అమ్మ రెక్కల కష్టానికి తనవంతు సాయం అందిస్తూనే పరుగు పోటీల్లో సత్తా చాటుతుండేవాడు. ఇంటర్ పూర్తయ్యే సమయానికి పరుగులో పలు పతకాలను కైవసం చేసుకున్నాడు.

తండ్రి మరణంతో ...

2018 డిసెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పైడప్పడు తండ్రి సన్యాసిరావు మృతి చెందాడు. అప్పటి నుంచి కుటుంబ భారం పూర్తిగా నారాయణమ్మపైనే పడింది. రోజుకు ఏడెనిమిది ఇళ్లల్లో పనులు చేసుకుంటూ నారాయణమ్మ కుమారుడిని ఇంటర్ వరకూ చదివించింది. పైడప్పడు ఓవైపు చదువుకుంటూ రన్నింగ్ ప్రాక్టీస్ కొనసాగించాడు. అథ్లెటిక్స్‌లో ప్రవేశించి పతకాల సాధనపై దృష్టి సారించాడు. తల్లి సంపాదన కుటుంబ పోషణకు చాలకపోవటంతో పైడప్పడు కూలిపనులకు వెళ్లేవాడు. కొన్నాళ్లపాటు పేపర్ బాయ్‌గా కూడా పనిచేశాడు. తెల్లవారుజామున పేపర్ వేయటం పూర్తయిన తర్వాత 6.10 గంటలకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చేరుకుని అక్కడ సింథటిక్ ట్రాక్‌పై ప్రాక్టీస్ చేసేవాడు. సెలవు రోజుల్లో దొరికిన కూలి పనులకు వెళ్లేవాడు. వచ్చిన డబ్బులను చదువు అవసరాలకు ఉపయోగించేవాడు. సాయంత్రం 4 గంటలకు విజయవాడ లయోల కళాశాలలో రన్నింగ్ ప్రాక్టీస్ చేసేవాడు. ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు క్రీడల్లోనూ అథ్లెటిక్స్‌లో రాణించేవాడు. జాతీయస్థాయిలో రెండు పతకాలు, రాష్ట్రస్థాయిలో 17 బంగారు, 2 సిల్వర్, మూడు బ్రౌంజ్ పతకాలను కైవసం చేసుకున్నాడు.



ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా...

జాతీయస్థాయిలో రాణించటంతో అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కూడా వచ్చాయి. ఒలింపిక్స్ లక్ష్యంగా పరుగునే ఊపిరిగా చేసుకుని రోజుకు ఆరు గంటలకు కఠోర సాధన చేసేవాడు. పరుగురాణి పిటి ఉషను ఆదర్శంగా తీసుకుని రన్నింగ్‌ను ప్రాక్టీస్ చేశాడు. 17 ఏళ్ల వయస్సులోనే రాష్ట్రస్థాయిలో 17 పతకాలను సాధించిన ఘనతను కూడా పొందారు. అండర్-16, 800 మీటర్లలో రన్నింగ్‌లో నాలుగు, అండర్-18, 800 మీటర్లలో రన్నింగ్ మూడు, అండర్-16 1500 మీటర్ల రన్నింగ్‌లో రజిత పతకం, 400X400 మిక్సిడ్ రిలే రన్నింగ్‌లో కాంస్య పతకం, గుడివాడలో 2019, 2018లో జరిగిన 10కె రన్‌లో రెండు రజితాలు, అమరావతి రన్నర్ ఆధ్వర్యంలో జరిగిన 5కే, 10 కే రన్నింగ్‌లో మరో రెండు రజిత పతకాలు సాధించాడు. వీటితోపాటు జాతీయస్థాయిలో పలు పోటీల్లో పాల్గొని ఐదో ర్యాంక్‌ను సాధించాడు. అనేక మారథాన్లలో పాల్గొని మంచి పతకాలు పొందారు. కఠినమైన పరుగులు తీయటం, ఎత్తు పల్లాల మధ్యలో పరుగెత్తటం, మోకాళ్ల మీద ఎక్కువ ఒత్తిడి పడుతున్నా వాటినన్నింటినీ తట్టుకుంటూ మారథాన్‌ను పూర్తిచేయటంతో దిట్టగా మారాడు.

ఆర్మీలో ఉద్యోగం

2024లో బెల్గావిలో జరిగిన ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పైడప్పడు ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రజ్ఞ, వికాసం, ఫిజికల్ ఫిట్‌నెస్, ఆరోగ్యం ఇలా అన్ని పరీక్షలను ఎదుర్కొన్నాడు. 2025 మార్చిలో ఆర్మీ శిక్షణకు ఆరునెలలపాటు వెళ్లి పూర్తిచేశాడు. త్వరలో దేశ రక్షణ రంగంలో కాశ్మీర్‌లో ఉద్యోగం చేయటానికి వెళ్లబోతున్నాడు. విజయవాడలోని వివిధ ప్రాంతాల్లో ఆర్మీకి ప్రిపేరవుతున్న అభ్యర్థులకు అతడు మంచి సందేశాన్ని ఇస్తున్నాడు. కఠోర శ్రమ చేయటం ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చునని తన అనుభవాన్ని వివరిస్తున్నాడు.

- యడవల్లి శ్రీనివాసరావు

అమ్మ స్ఫూర్తితో ...



చిన్నప్పటి నుంచి నాకు రన్నింగ్ అంటే చాలా ఇష్టం. ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా. తల్లిదండ్రులు పేదరికం తాలూకా పడిన ఇబ్బందులు నాకు తెలుసు. నాన్న చనిపోయాక తల్లి ఎంతో నాకోసం కష్టపడింది. ఆమెకు మంచిగా చూసుకుంటా. దేశ రక్షణ సేవలో నేనూ పాలు పంచుకోవటానికి అవకాశం లభించినందుకు సంతోషిస్తున్నా.

- కరబోతు పైడప్పడు, ఆర్మీ ఉద్యోగి






మా చిరునామా రంగవల్లి
మెయిల్ ఐడి :
jeevanapageps@gmail.com,
వాట్సాప్ : 83329 25496

కె. ఉమారాణి



అడ్వాన్స్ బుకింగ్‌లో 'జన నాయగన్' రికార్డు

కోలీవుడ్ కథానాయకుడు దళపతి విజయ్ నటిస్తున్న చివరి చిత్రం 'జన నాయగన్' గురించి ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. హెచ్ వినోద్ దర్శకత్వంలో పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం విడుదల కానుంది. శనివారంనాడు ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లుగా చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ ట్రైలర్ ద్వారా కథపై కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. ఓవర్సీస్ మార్కెట్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ రూ.15 కోట్లు గ్రాస్ వసూళ్లను సాధించినట్లుగా ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. బాలకృష్ణ 'భగవంత్ కేసరి' సినిమాకు ఇది రీమేక్ అనే ప్రచారాన్ని దర్శకుడు హెచ్ వినోద్ ఖండించారు. 'నేను ఇలాంటి విషయాలను ధ్రువీకరించను. అలాగని కొట్టిపారేయను. ఇది ఒక రీమేకా ఏదైనా చిత్రం నుంచి స్ఫూర్తి పొందిందా అనేది పక్కన పెట్టండి. ఇది పక్కా 'దళపతి' మూవీ. ప్రేక్షకులు ఆందోళన చెందకుండా థియేటర్లకు వచ్చి సినిమాను ఆస్వాదించండి' అని పేర్కొన్నారు.



త్వరలో 'మా ఇంటి బంగారం' టీజర్

'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' నిర్మాణ సంస్థలో సమంత నటిస్తూ నిర్మాణం తలపెట్టిన 'మా ఇంటి బంగారం' చిత్రం నుండి త్వరలో టీజర్ రాబోతోంది.

ఈ మేరకు.. 'సమంత ప్రభు 2' మా ఇంటి బంగారం టీజర్ అతి త్వరలో విడుదల కానుంది' అని చిత్రబృందం ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని నందిని రెడ్డి తెరకెక్కిస్తున్నారు. క్రైమ్ థ్రిల్లర్‌గా వస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు కాంతార విలన్ గుల్షన్ దేవయ్య, దిగంత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు.

4న 'మనశంకర వరప్రసాద్ గారు' టీజర్



చిరంజీవి, నయనతార జోడీగా నటించిన సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు'. ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్ జోనర్‌లో ఈ సినిమా తెరకెక్కింది. సంక్రాంతికి వస్తుండటం, అనిల్ రావిపూడి- చిరు కాంబో కావటంతో ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీ ట్రైలర్‌ను ఈనెల నాల్గోతేదీన విడుదల చేయబోతున్నట్లుగా నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ వెల్లడించింది. గతేడాది 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో అనిల్ రావిపూడి బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. మన శంకరవరప్రసాద్ గారు సినిమాలో వెంకటేష్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు.

'రాజాసాబ్'పై జెలసీతో కామెంట్లు : మారుతి



'రాజాసాబ్' సినిమా హిట్టయితే నేనేదే గొప్పోడినైపోతాననే దురుద్దేశ్యంతో కొంతమంది జెలసీతోనే ఫ్లాప్ కావాలని కోరుకుంటున్నారు. ఆ దిశగానే సోషల్‌మీడియాలో ట్రోలింగ్‌లు, పోస్టింగులు పెడుతున్నారని అనిపిస్తోంది. అలాంటి వారికి నా సినిమాతోనే సరైన సమాధానం చెబుతా. ఈర్ష్య, అసూయ మానవ నైజం. నాకు భారీ హిట్ పడితే. ఎక్కడ బిజీ అయిపోతాడేమోననే భయంతో కొంతమంది అలా కోరుకుంటున్నారు. రాజా సాబ్ హిట్ అయితే... చిన్న సినిమా ఈవెంట్లకు రానేమో అని వాళ్లు భయపడుతున్నారు. హిట్ వచ్చినా..ఫ్లాప్ వచ్చినా మరో సినిమా తీస్తా. రాజాసాబ్ తర్వాత చిన్న సినిమా తీయాలనుకుంటే తీస్తా. నా కథకి ఏ హీరో సెట్ అయితే ఆ హీరోతో వెళ్లిపోతా. బిజీగా ఉండాలని మాత్రమే కోరుకుంటా' అని మారుతి స్పష్టం చేశారు. కథానాయకుడు ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ జోడీగా నటించిన చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వంలో ఈ సినిమా ఈనెల 9న విడుదల కానుంది. ప్రచార కార్యక్రమాల్లో ఆయన బిజీగా ఉంటున్నారు. 'రాజాసాబ్' తీసిన ఆయనపై సోషల్ మీడియాలో వస్తున్న కామెంట్లకు పై విధంగా సమాధానమిచ్చారు.

ఎఫ్.ఎన్.సి.సి అవార్డుల ప్రదానం



ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్.ఎన్.సి.సి) సినీ పురస్కారాల ప్రదానం ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించారు. 2025కిగానూ ఉత్తమ చిత్రంగా 'కోర్ట్'కు, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ కథానాయకుడు, ఉత్తమ కథానాయిక విభాగాల్లో 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రానికి పురస్కారాల్ని ప్రదానం చేశారు. 'కోర్ట్' దర్శక నిర్మాతలు రామ్ జగదీశ్, దీప్తి గంటా, 'రాజు వెడ్స్ రాంబాయి' నిర్మాతలైన వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి, దర్శకుడు సాయిలు కంపాటి, కథానాయకుడు అఖిల్‌రాజ్‌లకు సినీ ప్రముఖులు అల్లు అరవింద్, అశ్వనీదత్, ఎఫ్.ఎన్.సి.సి అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు పురస్కారాల్ని ప్రదానం చేశారు. జ్ఞాపికతోపాటు, రూ.25 వేలు చొప్పున నగదు బహుమతిని అందజేశారు. అలాగే నిర్మాతలుగా యాభయ్యేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న అల్లు అరవింద్, అశ్వనీదత్‌తోపాటు, సినీ, రాజకీయ ప్రముఖులు కాజా సూర్యనారాయణను ఈ వేదికపై ఎఫ్.ఎన్.సి.సి కమిటీ సన్మానించింది. వి.బి.ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో టెలివిజన్ పురస్కారాల్నీ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్.నారాయణ, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షమీ, పంత్ ఎంపికపై సుదీర్ఘ చర్చ

- **బుమ్రా, హార్దిక్‌లకు విశ్రాంతి**
- **న్యూజిలాండ్‌తో వైట్‌బాల్ సిరీస్‌కు జట్ల ప్రకటనపై ఉత్కంఠ**





ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) సెలెక్షన్ కమిటీ న్యూజిలాండ్‌తో జరిగే వైట్‌బాల్ సిరీస్‌కు జట్ల ఎంపికపై సుదీర్ఘంగా చర్చ నడిచింది. సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్, కోచ్ గౌతమ్ గంభీర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో అర్ధరాత్రి వరకు ఒక కొలిక్కి రాలేదు. సెలెక్టర్లు ముఖ్యంగా మహ్మద్ షమీ, రిషబ్ పంత్ ఎంపికలపైనే ప్రధానంగా చర్చ నడించింది. షమీని సుదీర్ఘకాలంగా జాతీయ జట్టుకు దూరంగా ఉంచడం మంచిదా? అనే అంశంపైనే ఈ చర్చ కొనసాగించింది. ఇక టి20ల్లో ఓపెనర్ కోటాలో సాయి సుదర్శన్, సంజు శాంసన్ రేసులో ఉండగా.. వికెట్ కీపర్ కోటాలో సంజు శాంసన్, ఇషాన్ కిషన్‌ల ఎంపికపై చర్చ నడిచింది. అలాగే మిడిలార్డర్‌లో 5, 6 స్థానాల్లో ఎవరెవరు బ్యాటింగ్‌కు సరిపోతారనే అంశం, ఈ ఫార్మాట్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌లో వైఫల్యంపైనా సెలెక్టర్లు చర్చ జరిపారు. వన్డేల్లో వికెట్ కీపర్, మిడిలార్డర్ బ్యాటర్‌గా కెఎల్ రాహుల్ పేరు దాదాపు ఏకగ్రీవం అయినట్లు సమాచారం. కెఎల్ రాహుల్ బ్యాటింగ్‌తోపాటు అతడు డిఆర్‌ఎస్‌కు వెళ్లే సందర్భంలో తీసుకొనే నిర్ణయాలు జట్టుకు ఉపయుక్తంగా ఉంటున్నాయి. ఇక దేశవాళీ సీజన్ విజయ్ హజారే వన్డే టోర్నీలో రాణిస్తున్న సర్ఫరాజ్ ఖాన్, దేవదత్ పడిక్కల్, మహ్మద్ షమీ ఎంపికలపైనా సెలెక్షన్ కమిటీ తర్జన బర్జన పడినట్లు తెలిసింది. అలాగే సర్ఫరాజ్ ఖాన్‌తోపాటు మహ్మద్ షమీకి చాలాకాలంగా జాతీయ జట్టులో ఎంపికకోసం నిరీక్షణకు తెర దింపితే మంచిదనే ఏకాభిప్రాయంపైనే సెలెక్టర్లు ఒక కొలిక్కి రాలేకపోయారు. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రాలకు విశ్రాంతినిస్తే మంచిదని, దీంతో వారు టి20 ప్రపంచకప్‌కు మరింత సిద్ధమయ్యేందుకు ఇది దోహదపడు తుందని సెలెక్షన్ కమిటీ భావించినట్లు సమాచారం. ముఖ్యంగా మహ్మద్ షమీ ఎంపికపై సెలెక్షన్ కమిటీ సుదీర్ఘ చర్చ నడిచింది.. రెగ్యులర్ వికెట్ కీపర్‌గా కెఎల్ రాహుల్, స్టాండ్‌బై వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్‌ను ఎంపిక చేస్తే మంచిదనే అభిప్రాయానికి వచ్చారు. ఇక న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌వడోధర వేదికగా జనవరి 11 నుంచి ప్రారంభం కానుండగా.. మిగిలిన రెండు వన్డేలు రాజ్‌కోట్‌లో 14న, ఇండోర్‌లో 18న జరగనున్నాయి. ఆ తర్వాత ఐదు టి20 సిరీస్ జరగనుంది. 21 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఫిబ్రవరిలో భారత్-శ్రీలంక వేదికగా జరిగే టి20 ప్రపంచకప్‌కు ముందు భారతజట్టు ఆడే ఆఖరి సిరీస్ ఇదే.

హైదరాబాద్‌కు ఆడనున్న సిరాజ్, తిలక్

దేశవాళీ క్రికెట్ విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో సిరాజ్, తిలక్ వర్మ ఆడనున్నారు. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు వీరు హైదరాబాద్ తరఫున ఆడేందుకు సిద్ధంగా ఉన్నట్లు శుక్రవారం వెల్లడించారు. నేడు ఛండీగఢ్‌తో జరిగే లీగ్ మ్యాచ్‌కు సిరాజ్ ఆడనున్నట్లు, 6న బెంగాల్‌తో జరిగే మ్యాచ్‌కు తిలక్‌వర్మ హైదరాబాద్ తరఫున ఆడనున్నట్లు మేనేజ్‌మెంట్ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే 8న జమ్ము-కాశ్మీర్‌తో జరిగే మ్యాచ్‌కూ వీరిద్దరూ అందుబాటులో ఉంటారని మేనేజ్‌మెంట్ ఆ ప్రకటనలో పేర్కొంది. అనంతరం న్యూజిలాండ్‌తో జరిగే వైట్‌బాల్ సిరీస్‌కు వీరు టీమిండియా జట్టుతో కలవనున్నారు. 2025లో హైదరాబాద్ జట్టు సూపర్ లీగ్ దశకు చేరుకొనే క్రమంలో నాలుగు మ్యాచుల్లో ఏడు వికెట్లు పడగొట్టాడు. ఈ సీజన్‌లో సిరాజ్ ఒకే ఒక్క మ్యాచ్ ఆడాడు.

అంతర్జాతీయ క్రికెట్‌కు ఉస్మాన్ ఖవాజా గుడ్‌బై

సిడ్నీ టెస్ట్ చివరిదంటూ ప్రకటన



సిడ్నీ: ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. 2010-11లో ఈ మైదానంలోనే యాషెస్ సిరీస్‌లో అరంగేట్రం చేసిన ఖవాజా.. మళ్లీ అదే మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగే చివరి టెస్ట్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌నుంచి వైదొలుగుతున్నాడు. ఇంగ్లండ్‌తో ఐదో టెస్ట్ ప్రారంభానికి ముందు జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 39ఏళ్ల ఖవాజా ఈ విషయాన్ని వెల్లడించాడు. 'నేను ఊహించిన దానికంటే క్రికెట్ ఎక్కువే ఇచ్చింది. ఇది నేను ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకం, ఆటకు మించి స్నేహితులు మరింత ప్రోత్సాహాన్నిచ్చారు' అని పేర్కొన్నాడు. యాషెస్ సిరీస్ పెర్త్ టెస్ట్‌లో గాయపడ్డ ఖవాజా.. రెండో టెస్ట్‌కు దూరమయ్యాడు. 3వ టెస్ట్‌కు స్మిత్ దూరం కావడంతో మిడిలార్డర్ బ్యాటింగ్‌కు దిగి 82, 40పరుగులతో రాణించాడు. ఈ టెస్ట్‌లో ఆసీస్ గెలిచి సిరీస్ కైవసం చేసుకోగా.. స్వల్ప స్కోర్లు నమోదైన బాక్సింగ్ డే టెస్ట్‌లో 29, 0 పరుగులతో నిరాశపరిచాడు. ఖవాజా 87టెస్టుల్లో 43.39 సగటుతో 16 సెంచరీలతో సహ 6,206పరుగులు చేశాడు.

బషీర్, పాట్స్‌లకు చోటు

యాషెస్ సిరీస్‌లో భాగంగా మెల్‌బోర్న్ టెస్ట్‌లో సంచలన విజయం సాధించిన ఇంగ్లండ్ జట్టు ఐదో, చివరి టెస్ట్‌కు జట్టును ప్రకటించింది. సిడ్నీ వేదికగా జనవరి 4నుంచి జరిగే ఆఖరి టెస్ట్ కోసం ఇంగ్లండ్ కీలక మార్పులు చేసింది. ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్‌బోర్డు(ఇసిబి) శుక్రవారం ప్రకటించిన 12మంది ఆటగాళ్ల జాబితాలో యువ స్పిన్నర్ షోయబ్ బషీర్, మాథ్యూ పాట్స్‌లకు చోటు దక్కింది. పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్ టెస్టుల్లో ఓడి సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్ జట్టు ఆ తర్వాత జరిగిన బాక్సింగ్ డే టెస్ట్‌లో 14ఏళ్ల తర్వాత విజయాన్ని నమోదు చేసుకొని ఆతిథ్య జట్టుకు ఝలక్ ఇచ్చింది. తొడ కండరాల నొప్పితో బాధపడుతున్న గస్ అట్కిన్సన్ ఐదో టెస్ట్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో మాథ్యూ పాట్స్ ఎంపికయ్యాడు. **జట్టు: స్టోక్స్(కెప్టెన్), క్రాలే, డకెట్, స్టోక్స్, రూట్, బేథెల్, బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), బషీర్, కర్సే, జాక్స్, పాట్స్, టంగ్.**

నేడు ప్రొ రెజ్లింగ్ లీగ్ వేలం

అమన్, అంతిమ్‌పైనే ఫ్రాంచైజీల చూపు

న్యూఢిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్(పిడబ్ల్యుఎల్) వేలం నేడు జరగనుంది. ఐటిసి హోటల్ మౌర్యలో శనివారం జరిగే ఈ వేలంలో రెజ్లర్లను కొనుగోలు చేసుకొనేందుకు 6 ఫ్రాంచైజీలు పోటీపడనున్నాయి. హర్యానా థండర్స్, టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్, పంజాబ్ రాయల్స్, మహారాష్ట్ర కేసరి, ఢిల్లీ దంగల్ వారియర్స్ మరియు యుపి డామినేటర్స్ ఫ్రాంచైజీలు వేలంలో ప్రాతినిధ్యం వహించనున్నాయి. ప్రతి ఫ్రాంచైజీ ఒక అంతర్జాతీయ, ఒక భారత, దేశీయ రెజ్లర్లను తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సి ఉంది. ఒక్కో ఫ్రాంచైజీ రూ.7కోట్లతో ఆటగాళ్లందరినీ కొనుగోలు చేసుకోవాల్సి ఉంది. టోర్నీలో ఆడే రెజ్లర్లందరికీ కలిపి రూ.20కోట్ల ప్రైజ్ మనీ దక్కనుంది. 21ఏళ్ల భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ పురుషుల విభాగంలో రూ.18లక్షలు, మహిళల కేటగిరీలో అంతిమ్ పంఘల్ రూ.10లక్షల కనీస ధరతో వేలం రేసులో ఉన్నారు. అమన్, అంతిమ్ ఈ ధరతో వేలం రేసులో నిలవడంతో అత్యంత ఖరీదైన దేశీయ ఆటగాళ్లుగా నిలిచారు. ప్రొ రెజ్లింగ్ టోర్నమెంట్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరగనుంది.

మాజీ ఎమ్మెల్యే గంటెల సుమన మృతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్


గంటెల సుమన (ఫైల్)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పాయకరావుపేట ఎస్‌సి రిజర్వుడు నియోజకవర్గం మాజీ శాసన సభ్యురాలు గంటెల సుమన (67) శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. 1958 డిసెంబర్ 21న ఆమె జన్మించారు. ప్రస్తుతం విశాఖలోని అక్కయ్యపాలెంలో నివసిస్తున్న ఆమె గత కొంతకాలంగా అస్వస్థతతో ఉన్నారు. నగరంలోని కేర్ ఆస్పత్రిలో పది రోజుల క్రితం చేరారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆమెకు భర్త వీరయ్య, కుమారుడు కిరణ్, కుమార్తె ప్రియదర్శిని ప్రియ ఉన్నారు. అక్కయ్యపాలెం సంగం ఆఫీసుకు ఎదురుగా ప్రియదర్శిని ఓల్డ్ ఏజ్ హోమ్ స్థాపించి నిర్వహిస్తున్నారు. సుమన భౌతికకాయాన్ని అక్కయ్యపాలెంలోని ప్రియదర్శిని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. శనివారం ఉదయం 11 గంటలకు జివిఎంసి ప్రధాన కార్యాలయం సమీపంలోని క్రిస్టియన్ సెమెట్రీలో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆమె కుమారుడు కిరణ్ తెలిపారు. సుమన ప్రారంభంలో 1983లో టిడిపి తరఫున పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ తరపున 1989, 1994, 1999 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి పరాజయం పొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని వీడి అదే నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. సుమన ఎయులో ఎంఎ చదివారు. తాటిచెట్లపాలెంలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఆ తర్వాత సృజన పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకురాలుగా పనిచేసి, అదే కాలేజీకి ప్రిన్సిపల్‌గా సేవలందించారు. సుమన మరణ వార్త తెలియడంతో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పారిశుధ్యంపై అవగాహనకు ప్రాధాన్యత

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వచ్ఛాంధ్రలో భాగంగా పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. అమరావతిలోని సంస్థ కార్యాలయంలో ఈ అంశంపై ఎఐఐఎల్‌ఎస్‌జి, వాష్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలపై శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 4 నెలల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలను ఆశించిన స్థాయిలో నిర్వహించలేదన్నారు. ఏజెన్సీల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఫొటోలకే పరిమితం కాకుండా, కార్యక్రమాల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నందున తగిన ఫలితాలు రావాలన్నారు.

'నక్ష' సర్వేకు గడువు వారం రోజులే..!

- పూర్తి కాకుంటే రూ.20 కోట్ల ప్రోత్సాహకం వెనక్కు
- పూర్తి చేయాలంటూ ఆర్‌ఐలు, ప్లానర్స్‌కు కమిషనర్ ఆదేశం


నక్ష కార్యక్రమం సర్వేపై ఆర్‌ఐలు, ప్లానర్స్‌తో మాట్లాడుతున్న అనంత కమిషనర్ బాలస్వామి

ప్రజాశక్తి- అనంతపురం కార్పొరేషన్

నగరాల్లోని భవనాల గుర్తింపునకు కేంద్ర ప్రభుత్వం నక్ష సర్వే కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో అనంతపురం, ఒంగోలు కార్పొరేషన్లను ఎంపిక చేశారు. ఈ సర్వేను వంద శాతం పూర్తి చేస్తే కార్పొరేషన్‌కు రూ.20 కోట్లు ఇన్సెంటివ్ వస్తుంది. ఈ నెల 9వ తేదీలోగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాల్సిన బాధ్యత సచివాలయ ప్లానర్స్‌పై ఉంది. అనంత కార్పొరేషన్‌లో నక్ష సర్వే వారం రోజుల్లో వంద శాతం లక్ష్యానికి చేరుకుంటుందా? లేదా? అన్న దానిపై సందేహం నెలకొంది. అనంత కార్పొరేషన్‌లో సర్వే ప్రారంభించి ఆరు నెలలు కావస్తున్నా ఇది వంద శాతానికి చేరుకోలేదు. ఇప్పటికి 92 శాతానికి మాత్రమే పరిమితమైనట్లు అధికార గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ సర్వే జరిగే సమయంలో ఇన్‌ఛార్జి ఏసిపిగా విధులు నిర్వర్తిస్తున్న శిరీషపై ప్లానర్స్ తిరుగుబాటు చేశారు. పని ఒత్తిడి పేరిట గురి చేస్తున్నారని, మరికొన్ని కారణాలతో ఆమెపై నిరసన స్వరం వినిపించారు. ఈ పరిణామం నక్ష సర్వేపై పడింది. ఇదే సమయంలో ప్రస్తుత టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నిరీక్షణ్ ఇటీవల దీర్ఘకాలిక సెలవు వెళ్లారు. మరో టిపిఎస్ మంజుల సైతం నేతల ఒత్తిళ్ల నడుమ పూర్తి స్థాయిలో సర్వేను ముందుకు తీసుకెళ్లలేని పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది.

వంద శాతం సర్వే పూర్తి కావాలి : కమిషనర్

నక్ష కార్యక్రమం సర్వే తీరుపై శుక్రవారం నాడు వార్డు ప్లానర్స్ రెవెన్యూ విభాగం ఆర్‌ఐలతో కమిషనర్ బాలస్వామి సమీక్ష జరిపారు. ఈ సమావేశానికి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు హాజరుకాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ముగిసే సమయానికి కొందరు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫారం-14, ఫారం-5లో వివరాలు సేకరించి అప్లోడ్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లపై ఉందని, నగరంలోని అన్ని ప్రభుత్వ భవనాలకు నక్ష కార్యక్రమానికి సంబంధించిన సర్వేపై నోటీసులు జారీ చేయాలని ఆయన ఆదేశించారు. భవనాల ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్లను యజమానులు ఇవ్వకపోతే వాటిని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నుంచి సేకరించి అప్లోడ్ చేయాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. డబుల్ ఎంట్రీస్, అసెస్మెంట్ లోకలన్ పక్షంలో వాటిని గుర్తించాల్సిన బాధ్యత కూడా ఆర్‌ఐలపై ఉందన్నారు. సర్వేలో 'నాట్‌ట్రేసబుల్' అన్న పదాన్ని చాలా తక్కువగా వాడాలని సూచించారు. రానున్న వారం రోజుల్లో ఈ సర్వే పూర్తి కావాలన్నారు. సర్వేను వంద శాతం పూర్తి చేస్తే మున్సిపాల్టీకి రూ.20 కోట్లు ఇన్సెంటివ్ వస్తుందని ఈ విషయాన్ని సర్వే బృందంలోని అందరూ గుర్తించాలన్నారు. ఇదే సమయంలో నక్ష సర్వే రిపోర్ట్ ఆమోదింపజేసుకున్న 25, 69, 72 సచివాలయాల ప్లానర్లను కమిషనర్ అభినందించారు. మిగిలిన వారు కూడా సర్వేను పూర్తి చేయాలంటూ కమిషనర్ వారికి సూచించారు.

నక్ష సర్వే ఇలా..!

అనంతపురం నగరంలో ప్రభుత్వ భవనాలు 223, ప్రయివేటు భవనాలు 59,405 ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు 56,601 భవనాలకు నక్ష సర్వేను పూర్తి చేసినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. నగరంలో ముగ్గురు ప్లానర్స్ మాత్రమే సర్వే పూర్తి చేసి వారి వివరాలు ఆమోదింపజేసుకున్నారు. ఇంకా 13 మంది సర్వే పూర్తి చేసి సమర్పించిన వివరాలకు ఆమోదముద్ర పొందాల్సి ఉంది. 29 మంది ప్లానర్ల సర్వే ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. మరో 26 మంది అరకొర వివరాలతో సర్వేను మధ్యలో ఆపారు. ఇలా 2804 భవనాలకు సంబంధించి అసెస్మెంట్లు ఆస్తి పత్రాలు వివరాలు సేకరించి ఆన్‌లైన్ అప్లోడ్ చేయాల్సి ఉంది.

హైడ్రో ప్రాంతంలో హెలికాప్టర్ చక్కర్లు

ప్రజాశక్తి- అనంతగిరి (అల్లూరి జిల్లా)



అల్లూరి జిల్లా ఏజెన్సీలో పలు ప్రాంతాలలో గత రెండు, మూడు రోజుల నుండి హైడ్రో ప్రాంతంలో హెలికాప్టర్ చక్కర్లు కొడుతుండడంతో స్థానిక ఆదివాసి గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. అనంతగిరి మండలం నాన్ షెడ్యూల్ గుమ్మకోట పంచాయతీ గుజ్జెలి, అరకు మండలం బస్కి పంచాయతీ పరిధి దేవరపల్లి, హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలస వంటి ప్రాంతాలలో శుక్రవారం మిట్ట మధ్యాహ్న సమయంలో కొండలకు తాకుతూ గ్రామాల ఆవాస ప్రాంతాల్లో హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. స్థానికులు తమ కెమెరాల్లో దీనిని ఫోటోలు తీశారు. వీడియోలు చిత్రీకరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు సర్వే కోసమే ఈ హెలికాప్టర్ తిరుగుతున్నట్లు స్థానిక గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలల క్రితం ఆదివాసులు చేపట్టిన ఆందోళనలతో హైడ్రో పవర్ ప్రాజెక్టులు పనులు కాస్త మందగించాయి. గత కొన్ని నెలల క్రితం రాత్రుల సమయంలో డ్రోన్ కెమెరాలు చక్కర్లు కొట్టడంతో ఆందోళనలకు గురయ్యారు. డ్రోన్ కెమెరాలు అర్ధరాత్రి పూట తిరుగుతున్నాయని, తక్షణమే నిలుపుదల చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఆదివాసి గిరిజన సంఘం నేతలు, హైడ్రో పోరాట కమిటీ సభ్యులు లిఖిత పూర్వకంగా విన్నవించారు. దీంతో, తాత్కాలికంగా నిలిపివేశారు.

చైతన్య బఘేల్‌కి బెయిల్ జారీ


రాయ్‌పూర్ : లిక్కర్ కుంభకోణానికి సంబంధించిన రెండు కేసుల్లో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ నేత భూపేష్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌కి హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఛత్తీస్‌గఢ్ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)/ ఆర్థిక నేర విభాగం (ఇఒడబ్ల్యు) దాఖలు చేసిన కేసుల్లో బెయిల్ జారీ చేసినట్లు ఇడి కౌన్సిల్ సౌరభ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

2019 -2022 మధ్య భూపేష్ బఘేల్ ప్రభుత్వ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందని, ఫలితంగా రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఇడి ఆరోపించింది. ఈ కేసుకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో చైతన్య బఘేల్‌ని ఇడి జులైలో అదుపులోకి తీసుకుంది. జైలులో ఉన్న సమయంలోనే అవినీతి విచారణకు సంబంధించి ఎసిబి/ఇఒడబ్ల్యు సెప్టెంబర్‌లో ఆయనను అదుపులోకి తీసుకుంది.

జాతీయ సీనియర్ వాలీబాల్ జట్టు ప్రకటన

- టోర్నీకి ఆంధ్ర జట్టు సారథిగా విశాఖ క్రీడాకారుడు ప్రశాంత్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖ)



జాతీయ సీనియర్ పురుషుల వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర జట్టును శుక్రవారం ప్రకటించారు. వారణాసిలో జరగనున్న 72వ జాతీయ వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర పురుషుల జట్టుకు విశాఖ నగరానికి చెందిన అంతర్జాతీయ వాలీబాలర్, జిఎస్‌టి అండ్ కస్టమ్స్ విశాఖ శాఖ ఉద్యోగి పిన్నమరాజు ప్రశాంత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ పోటీలు జనవరి 4 నుండి 11 వరకు జరగనున్నాయి. జట్టులో ఎస్.సుధీర్‌కుమార్, పి.గణేష్, వీరి వెంకటేష్, ఎం,సుదీర్, మైలపల్లి సత్యం, బీర భానుబాబు, మంతెన మనోజ్ దత్తా, ఐ.కళ్యాణ్ కుమార్, గుబ్బల శ్రీనివాస్, బుర్ల హేమంత్, బోకం ఆదిత్య, గోపిరెడ్డి వెంకటశివ, పెనుమత్స కృష్ణ చైతన్య ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రతిష్టాత్మక జాతీయ టోర్నీలో పాల్గొంటున్న ఆంధ్ర జట్టు సభ్యులను అసోసియేషన్ ప్రతినిధులు అభినందించి పతాకం సాధించాలని ఆకాంక్షించారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో గురుకుల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- సబ్బవరం (అనకాపల్లి జిల్లా)

జాతీయ స్థాయి క్రీడల్లో టెన్నికాయిట్ పోటీలో స్థానిక అంబేద్కర్ గురుకులం విద్యార్థులు సత్తా చాటారు. కేరళలో జరిగిన 37వ సబ్ జూనియర్ బాలుర టెన్నికాయిట్ పోటీలలో గురుకులం ఎనిమిదో తరగతి విద్యార్థి ఒ. రవి కిషోర్‌క డబుల్స్‌లో మూడో స్థానం, తొమ్మిదోతరగతి విద్యార్థి జె సంపత్ వినయ్ కుమార్‌కు చెందిన టీం జాతీయ స్థాయిలో ఛాంపియన్ షిప్ సాధించారని గురుకులం పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ కేశవరావు తెలిపారు. క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను స్థానిక తహశీల్దార్ బి.చిన్నికృష్ణ అభినందించారు. కార్యక్రమంలో పిఇటి వర్రి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేను ఆరోగ్యంగానే ఉన్నా..

- అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన వయసు, ఆరోగ్యం గురించి వస్తున్న విమర్శలను ఖండించారు. వాల్ స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన ఆరోగ్యం పూర్తిగా బాగున్నదని స్పష్టం చేశారు. ట్రంప్ వయసు ప్రస్తుతం 79 ఏండ్లు. అధ్యక్షుడిగా రెండో పదవీకాలాన్ని పూర్తి చేస్తే, పదవీ విరమణ సమయానికి ఆయన వయసు 82 ఏండ్లకు చేరుకుంటారు. అదే జరిగితే చరిత్రలోనే అత్యంత వృద్ధుడైన అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ నిలుస్తారు.

ఇటీవల కొన్ని బహిరంగ కార్యక్రమాల్లో ట్రంప్ నిద్రపోతున్న, చేతిపై మేకప్ వేసుకున్న ఫొటోలు వైరల్ కావడంతో ఆయన ఆరోగ్యంపై చర్చ మొదలైంది. అక్టోబర్‌లో తాను ఎంఆర్‌ఐ స్కాన్ చేయించుకున్నానని చెప్పి తర్వాత దానిని సిటి స్కాన్ అని వివరించడం కూడా అనుమానాలకు దారి తీసింది. అయితే ఇవన్నీ మీడియా సృష్టించిన అపోహలు అని అన్నారు. ఫొటోగ్రాఫర్లు తాను కండ్లు మూసిన క్షణాన్ని పట్టుకొని 'నిద్రపోతున్నాడు' అనే ప్రచారాన్ని చేస్తున్నారని తెలిపారు. తాను రోజుకూ 325 మిల్లీగ్రాముల ఆస్పిరిన్ తీసుకుంటున్నానని కూడా వెల్లడించాడు. రక్తం పలుచగా ఉండేందుకే అలా చేస్తున్నాననీ, అయితే ఇదే కారణంగా చేతులపై గాయాలు, నీలి మచ్చలు వస్తున్నాయనీ, వాటిని కప్పి పుచ్చేందుకే మేకప్ వాడుతున్నానని ట్రంప్ వివరించారు.

అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ వయసు, ఆరోగ్యం గురించి ట్రంప్ గతంలో తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ట్రంప్ కూడా ఇవే తరహా ప్రశ్నలను ఎదుర్కొంటుండటం గమనార్హం. అయితే వయసు తనపై ఎలాంటి ప్రభావమూ చూపలేదని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

పంప్డు స్టోరేజ్ ప్రాజెక్టు కోసం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి- సీలేరు (అల్లూరి జిల్లా)

పంప్డు స్టోరేజీ ప్రాజెక్టు కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఎపి జెన్‌కో అధికారులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీలేరు పంప్డు స్టోరేజీ జెఎసి సభ్యులు నక్కా జ్ఞానేశ్వరరావు, కారే శ్రీనివాస్, వల్లీ ప్రసాద్, చిటికెల రాము, బాలకృష్ణ, మిందీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో సీలేరు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కులమతాలకు అతీతంగా ఇక్కడకు వచ్చి జలవిద్యుత్ కేంద్రం నిర్మాణంలో భాగస్వామ్యులయ్యామని, పనులు పూర్తయిన తరువాతే ఇక్కడే స్థిరపడి వ్యాపారాలు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా నిర్మించబోయే ప్రాజెక్టులో నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని, నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాలని జెఎసి డిమాండ్ చేస్తోందని చెప్పారు. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులో స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతతో భర్తీ చేయాలని కోరారు. ఈ విషయంలో ఒకరిని ఒకరు దూషించడం సరికాదని, రిజర్వేషన్లు హక్కులు కల్పన ప్రభుత్వం చూసుకుంటుందని, ఈ సందర్భంగా ఎపి జెన్‌కో అధికారులు స్పందించి ప్రాజెక్టు నిర్మాణంలో స్థానికంగా ఉన్న వారికి, నష్టపోయిన వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో నివసించేవారికి విద్యుత్తు, వైద్యం, మంచినీరు సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- కంటోన్మెంట్ (విజయనగరం)

విజయనగరంలోని జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నారు. విశాఖపట్నంలోని జాలారిపేటకు చెందిన ఉదయ్ వెంకటతేజ (19) స్థానిక జెఎన్‌టియులో హాస్టల్‌లో ఉంటూ ఇఇఇ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం ఉదయం తోటి స్నేహితులు కళాశాలకు వెళ్లినప్పటికీ వెంకటతేజ మాత్రం వసతి గృహంలోనే ఉండిపోయారు. మధ్యాహ్నం భోజన విరామంలో తోటి విద్యార్థులు గదికి వచ్చి తలుపు కొట్టినప్పటికీ తెరవలేదు. దీంతో, అనుమానం వచ్చి చూసిన విద్యార్థులకు వెంకటతేజ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించారు. వెంటనే అధ్యాపకులకు సమాచారం ఇవ్వడంతో పోలీసుల వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

బొలెరో బోల్తా.. 17 మంది కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - బుక్కపట్నం (శ్రీసత్యసాయి జిల్లా)

బుక్కపట్నం మండల పరిధి చిలకల గడ్డపల్లి గ్రామం వద్ద వ్యవసాయ కార్మికులతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 17 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... నల్లమాడ మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాదాపు 30 మంది వ్యవసాయ కార్మికులు మండల పరిధిలోని పొడరాళ్లపల్లి గ్రామానికి వ్యవసాయ పనులు నిమిత్తం బొలెరో వాహనంలో వెళ్తున్నారు. చిలకల గడ్డపల్లి గ్రామం వద్ద ఈ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జయమ్మ, కళావతి, చెన్నమ్మ, చిన్నకృష్ణమ్మ, గంగాదేవి, రత్నమ్మ, కేశమ్మ, ఉత్తన్న, రామాంజనేయులు, లక్ష్మీనరసింహ సహా 17 మంది వ్యవసాయ కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని గ్రామస్తులు 108 వాహనంలో నల్లమాడ, పుట్టపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఉత్తన్న, కళావతిలను మెరుగైన వైద్య సేవ కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి బంధులు తరలించారు.

ఎస్‌ఐని కొట్టిన బిజెపి కార్పొరేట్ కొడుకు

- దేహశుద్ధి చేసిన స్థానికులు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో పోలీస్ అధికారిపై చేయి చేసుకున్న బిజెపి కార్పొరేటర్ కుమారుడికి ప్రజలు దేహశుద్ధి చేశారు. వారణాసిలో చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఘటనా స్థలి నుంచి అతడిని రక్షించి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీనియర్ అధికారి శుక్రవారం తెలిపారు. హుకుల్‌గంజ్‌కు చెందిన బిజెపి కార్పొరేటర్ బ్రిజేష్‌చంద్ర శ్రీవాస్తవ కుమారుడు హిమాన్ష్ శ్రీవాస్తవ గురువారం సాయంత్రం సబ్ ఇన్‌స్పెక్టర్‌ని చెంపపై కొట్టాడు. ఆగ్రహించిన ప్రజలు అతనికి దేహశుద్ధి చేశారు. అనంతరం ప్రజల నుండి అతనిని పోలీసులే రక్షించాల్సి వచ్చింది. హిమాన్ష్‌పై కేసు నమోదు చేసి, జైలుకు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాంకేతికతతో అవినీతికి అడ్డుకట్ట

- 2025లో 115 కేసులు నమోదు
- ఎసిబి డిజి అతుల్‌సింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో




ఆర్థిక సాంకేతికతతో అవినీతికి అడ్డుకట్ట వేసేలా ఆయా కార్యాలయాలపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నట్లు అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ (డిజి) అతుల్ సింగ్ వెల్లడించారు. అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు ఆధునిక సాంకేతికతను ముఖ్యంగా ఎఐ టెక్నాలజీని ఉపయోగించనున్నట్లు తెలిపారు. విజయవాడ ఆర్‌టిసి బస్టాండు ప్రాంగణంలోని ఎసిబి సమావేశహాలులో శుక్రవారం 2025 వార్షిక నివేదికపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడులు నిర్వహించడం, అరెస్టులు చేయడమనేది కాకుండా వీరందరికి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేసుల సంఖ్య ముఖ్యం కాదని, అరెస్టు చేసిన ప్రతి ఒక్కరికీ శిక్షలు పడేలా చేయడమనేది ఇందులో కీలకమన్నారు. ఏడాదిలో అవినీతి తిమింగళాలపై దాడులు నిర్వహించామన్నారు. 17(ఎ) కింద అనుమతులు తీసుకున్న తర్వాతనే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేస్తున్నట్లు, మొత్తమ్మీద ఈ ఏడాదిలో 115 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో 69 కేసులు ఆయా ఉద్యోగులు లంచాలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నవేనన్నారు. మిగిలిన కేసుల్లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు ఉన్నాయన్నారు. ఎసిబి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న కేసుల్లో 19 కేసులు ల్యాండ్ రెవెన్యూకు సంబంధించినవేనన్నారు. రెవెన్యూ తర్వాత నమోదు చేసిన కేసుల్లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో 5 కేసులు, తర్వాత స్థానాల్లో హోంశాఖలో 4, ఆర్థికశాఖలో 4 కేసులు నమోదు చేశామన్నారు. ఇతర శాఖలకు సంబంధించి 27 కేసులు నమోదు చేశామన్నారు. బినామీ ఆస్తులకు సంబంధించి 7 శాఖల ఉద్యోగులపై కేసులు నమోదు చేశామన్నారు. బినామీ ఆస్తులను నిగ్గుతేల్చడంలో కొంత ఇబ్బంది కలుగుతోందని, అందుకే ఎఐ టూల్స్‌తో పాటు ఆధునిక సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించామన్నారు. కాల్ సెంటర్ 1064కు వచ్చే ఫిర్యాదులపై 16 కేసులు నమోదు చేసినట్లు ఎసిబి డిజి తెలిపారు. 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు తెలిపారు. 8 కేసుల్లో శాఖా విచారణలు చేపట్టామన్నారు. సమాచారం తెలిసినవారు 9440440057 నెంబరుకు తెలపొచ్చన్నారు. అలాగే 5 నుంచి 7 ఏళ్ల జైలు శిక్షలు పడిన కేసులు కూడా ఉన్నాయన్నారు. పరకామణి కేసు కోర్టు పరిధిలో ఉందని, కోర్టు సూచనలు మేరకే పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆర్ జయలక్ష్మి, జెడిఎ సురేష్‌బాబు, అశోక్‌కుమార్, చీఫ్ లీగల్ అడ్వైజరు పివి రాంబాబు పాల్గొన్నారు.

సాంస్కృతిక వారసత్వానికి రక్షణ

- గురజాడ గృహ పునరుద్ధరణకు రూ.12.05 లక్షలు మంజూరు
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి- విజయనగరంకోట



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తెలుగు జాతికి గర్వకారణమైన ప్రముఖ సంఘసంస్కర్త, సాహిత్య యుగపురుషుడు గురజాడ అప్పారావు చారిత్రక గృహాన్ని సాంస్కృతిక వారసత్వ సంపదగా భావించి దాని పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురజాడ చారిత్రక గృహానికి తగిన రక్షణ లేక ఆకతాయిలు లోపలికి ప్రవేశిస్తున్నారనే విషయాన్ని గురజాడ వారసులు వెంకట ప్రసాద్, ఇందిరా దంపతులు ఈ నెల 25న తన దృష్టికి తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. దీనిపై తాను వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యతో చర్చించామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ ఇంజనీర్ గురజాడ గృహాన్ని పరిశీలించి అంచనాలు రూపొందించగా, వాటిని పరిశీలించిన అనంతరం గృహ పునరుద్ధరణ, భద్రత చర్యల కోసం మొత్తం రూ.12.05 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తయ్యిందన్నారు. గురజాడ గృహం కేవలం ఒక నివాసం మాత్రమే కాకుండా తెలుగు సాహిత్య, సామాజిక చైతన్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ నిధులతో టాయిలెట్ నిర్మాణం, పైకప్పు వాటర్‌ప్రూఫ్ మరమ్మతులు, భవనానికి రంగులు వేసే పనులు చేపడతామని చెప్పారు. పాత గోడ గడియారం మరమ్మతులు, ఓపెన్ ఏరియా అభివృద్ధి పనులు జరుగుతాయని, విద్యుత్ వ్యవస్థను సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్‌కు మారుస్తామని తెలిపారు. ఈ గృహం కలకాలం నిలిచి గురజాడ ఆలోచనలు, ఆదర్శాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్ (విజయనగరం)

బాడంగి పోలీసు స్టేషనులో 2024 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన బాడంగి మండలం వాడాడ గ్రామానికి చెందిన వాడాడ వెంకటరమణకు విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరు చేస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. బాడంగి మండలం రాజేరు గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక కనపడడంలేదని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై బాడంగి ఎస్ఐ జె.తారకేశ్వరరావు మిస్సింగు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో వాడాడ గ్రామానికి చెందిన వాడాడ వెంకటరమణ ఆ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించి కత్తిపూడి తీసుకెళ్లి అక్కడ ఆ బాలికను శారీరకంగా పలుమార్లు అనుభవించినట్లు తెలియడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి కేసును దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి 20ఏళ్ల జైలుశిక్ష విధించారు. కేసు దర్యాప్తులో క్రియాశీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఎస్‌పి ఎఆర్ దామోదర్ అభినందించారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ వెంకటేష్

6 నుంచి 'కార్గో' గ్రామాల్లో మట్టి పరీక్షలు

ప్రజాశక్తి- మందస (శ్రీకాకుళం జిల్లా)

కార్గో ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో ఈనెల 6 నుంచి పదో తేదీ వరకు రైట్స్ సంస్థ ప్రతినిధులు పర్యటించి మట్టి పరీక్షలు చేయనున్నారని కార్గో ఎయిర్‌పోర్టు ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ వెంకటేష్ తెలిపారు.

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మట్టి పరీక్షలకు రైతులు సహకరించాలని కోరారు. గ్రామసభలు నిర్వహించిన అనంతరం ప్రజాభిప్రాయం మేరకే కార్గో ఎయిర్‌పోర్టుపై ముందుకెళ్తామన్నారు. కార్గో ఎయిర్‌పోర్టుకు సంబంధించి 1400 ఎకరాలను సేకరించి, అందులో 300 ఎకరాలను అభివృద్ధి చేసి నిర్వాసితులకు అందజేస్తామన్నారు.

2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం, ఆర్‌ఆర్ ప్యాకేజీ కూడా అందిస్తామని తెలిపారు. నష్టపోయిన కొబ్బరి, జీడి, మామిడి, పనస చెట్లకు అధికారులతో నోటిఫైడ్ చేసి, ప్రతి చెట్టుకూ అదనంగా పరిహారం ఇస్తామన్నారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సైన్స్, పర్యావరణ శాఖలో ఆర్థిక లోపాలు!

- ఎత్తిచూపిన కాగ్ నివేదిక
- తక్షణమే దిద్దుబాటు చర్యలు అవసరమని సూచన



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ సైన్స్, పర్యావరణ విభాగాల్లోని అనేక ఆర్థిక లొసుగులు, లోపాలు, అమల్లోని వైఫల్యాలను కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఎత్తిచూపింది. రూ.152.47 కోట్ల బకాయిలను వసూలు చేయడంలో రేడియేషన్, ఐసోటోప్ టెక్నాలజీ బోర్డు (బిఆర్‌ఐటి) విఫలమైన అంశాన్ని కూడా కాగ్ తన ఆడిట్‌లో కనుగొంది. వీటికి తోడు కీలకమైన సంస్థల వ్యాప్తంగా నెలకొన్న అనేక అవకతవకలను, లోపాలను కూడా తన నివేదికలో పేర్కొంది. డిసెంబరు 18న ఈ నివేదికను పార్లమెంట్‌కు అందజేసింది.

బిఆర్‌ఐటి ఆర్థిక వైఫల్యాలు : అణు ఇంధన విభాగం పరిధిలోని బిఆర్‌ఐటి (రేడియేషన్, ఐసోటోప్ టెక్నాలజీ బోర్డు) రూ.152.47కోట్ల బకాయిలను వసూలు చేయడంలో విఫలమైంది. పన్ను నిబంధనలను పాటించడంలో కూడా ఈ సంస్థ విఫలమైంది. దీంతో రూ.62.04 కోట్ల మేర పన్నులు పేరుకుపోయాయి. 2003-04 నుండి 2022 - 23 మధ్య కాలంలో 9 ప్రాజెక్టులు జాప్యం కావడంతో అటు ఖర్చు ఇటు సమయం రెండూ పెరిగిపోయాయి. ఆర్థిక పారదర్శకత లేకుండా పోయింది. డిజిటల్‌పరమైన చొరవలు తీసుకోవడంలో కూడా విఫలమైంది.

భార జల బోర్డు ఐటి వైఫల్యాలు : భార జల బోర్డు (హెవీ వాటర్ బోర్డు) కోసం ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఐఐఎస్) యొక్క కీలకమైన కార్యకలాపాల్లో అనేక తప్పులు దొర్లాయని, ఆటోమేషన్‌లో కూడా ఆలస్యం జరిగిందని పేర్కొంది.

ఖర్చు పెట్టని నిధులు : సైన్స్, పర్యావరణ విభాగాలకు కేటాయించిన నిధుల్లో చాలా భాగం ఖర్చు పెట్టకుండానే గడిచిపోయింది. 2022-23లో మొత్తంగా 8,917.85కోట్లు (10.92శాతం) మేర నిధులు ఉపయోగించలేదు ఇతర ఆర్థిక లోపాలు : ప్రైవేటు ఎయిర్‌పోర్టు ఆపరేటర్ల నుండి వాతావరణ సమాచార సంబంధిత చార్జీలను వసూలు చేయడంలో భారత వాతావరణ విభాగం (ఐఎండి) విఫలమైందని కాగ్ తన నివేదికలో పేర్కొంది. అవగాహనా ఒప్పందాలు (ఎంఓయు) అమలు కాకపోవడం వల్ల రూ.7.28కోట్ల మేర మొత్తాలను రాబట్టలేకపోయిందని తెలిపింది. మరోవైపు భారత అణు విద్యుత్ కార్పొరేషన్‌లో 2013-17 మధ్య కాలంలో ఉద్యోగులకు చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని వెల్లడైంది.

ఇలా కీలకమైన రంగాలవ్యాప్తంగా ఆర్థిక నిర్వహణా లోపాలు, అమల్లో వైఫల్యాలు పట్ల కాగ్ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే కఠినమైన పర్యవేక్షణా యంత్రాంగం వుండాలని, అత్యవసరంగా కొన్ని చోట్ల సంస్కరణలు చేపట్టాల్సి వుందని సూచించింది. ఈ అసమర్థతలు, లోపాల వల్ల దీర్ఘకాలంలో భారతదేశ శాస్త్రీయ, పర్యావరణ కార్యకలాపాలు దెబ్బతినే అవకాశం వుందని హెచ్చరించింది.

ఆ లెక్కలు నమ్మలేం!

- భారత ఆర్థిక గణాంకాలపై ఐఎంఎఫ్ అనుమానాలు
- జిడిపి, ప్రభుత్వ ఖాతాల డేటాకు 'సి గ్రేడ్'
- ఎన్‌బిఎఫ్‌సిలతో భవిష్యత్‌లో ప్రమాదాలు

భారత ఆర్థిక గణాంకాల నాణ్యతపై అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) తీవ్ర సందేహాలు వ్యక్తం చేసింది. డేటాలో లోపాలను ప్రస్తావించింది. ఈ విషయంలో భారత్‌కు 'సి గ్రేడ్'ను ఇచ్చింది. ఈ విషయాలు ఐఎంఎఫ్ రూపొందించిన ఓ నివేదికలో వెల్లడయ్యాయి. ప్రపంచంలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, జిడిపి వృద్ధి గణనీయంగా పెరుగుతున్నదని మోడీ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఐఎంఎఫ్ తాజా నివేదికతో భారత ఆర్థిక గణాంకాల్లోని డొల్లతనం, విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారాయని ఆర్థికరంగ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

న్యూఢిల్లీ : అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ఆర్టికల్-4 సంప్రదింపుల నివేదిక- 2025లో భారత ఆర్థిక వ్యవస్థను నాలుగు రంగాల్లో సమీక్షించింది. అందులో ఆర్థిక విధానం, ద్రవ్య విధానం, ఆర్థిక రంగం, నిర్మాణాత్మక సంస్కరణలు వంటివి ఉన్నాయి. భారత జాతీయ ఖాతాలు, ప్రభుత్వ ఆర్థిక గణాంకాలకు మాత్రం ఐఎంఎఫ్ సి గ్రేడ్‌ను కేటాయించింది. భారత గణాంకాలపై ఐఎంఎఫ్ సందేహాలు వ్యక్తం చేసింది. ఆర్థిక గణాంకాలు పూర్తిగా లేకపోవడం, ప్రజలకు పారదర్శకంగా అందుబాటులో లేకపోవడం వంటి అంశాలను ఐఎంఎఫ్ ప్రస్తావించింది. ప్రొఫెసర్ అరుణ్ కుమార్ వంటి పలువురు ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తలు ఇదే అంశంపై ఎన్నో ఏళ్ల నుంచి హెచ్చరిస్తుండటం, ఇప్పుడు ఐఎంఎఫ్ కూడా దీనిని ఎత్తిచూపటం గమనార్హం. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు, కరోనా లాక్‌డౌన్ వంటి సందర్భాల్లో దేశంలో అసంఘటిత రంగం తీవ్రంగా నష్టపోయినా, దాని వాస్తవ పరిస్థితి జిడిపి లెక్కల్లో ప్రతిబింబించటం లేదనేది ప్రధాన అంశం.

ఐఎంఎఫ్ నివేదిక ఎందుకు ప్రభావమెంత?


ఐఎంఎఫ్ ఆర్టికల్-4 వంటి నివేదికలు సాంకేతిక సమీక్షలు మాత్రమే కాకుండా, ప్రపంచ ఆర్థిక విధానాలపై ప్రభావం చూపే 'జ్ఞాన ఉత్పత్తులు' అని పెట్టుబడిదారీవర్గాలు భావిస్తుంటాయి. జిడిపి వృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, ద్రవ్యోల్బణ నియంత్రణ, మార్కెట్ ఆధారిత సంస్కరణలను ఇవి సమీక్షిస్తాయి. ఆయా రంగాలపై ఐఎంఎఫ్ 'ముద్ర' పడితే పెట్టుబడిదారులకు విశ్వాసం పెరుగుతుంది. విమర్శలు వస్తే ప్రభుత్వాలపై విధాన మార్పులకు ఒత్తిడి పెరుగుతుంది. దీనివల్ల పెట్టుబడులు రాకపోవడం, వచ్చిన పెట్టుబడులు వెనక్కిపోయే ప్రమాదం కూడా ఉన్నదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఐఎంఎఫ్ సూచనలు

ప్రభుత్వ ఆదాయ-వ్యయ నిర్వహణపై ఐఎంఎఫ్ కొన్ని సూచనలు చేసింది. అప్పులు నియంత్రణలో ఉంచాలనీ, పన్ను వసూళ్ల సామర్థ్యం పెంచాలని, పెట్టుబడులు, సామాజిక రంగాలపై ఖర్చు పెంచాలని వివరించింది. భారత్‌పై అమెరికా విధించిన అధిక సుంకాల వల్ల వృద్ధి మందగిస్తే, కఠిన ఆర్థిక క్రమశిక్షణను తాత్కాలికంగా నిలిపి వేసి, 'తటస్థ ఆర్థిక విధానం' పాటించాలని ఐఎంఎఫ్ సూచించింది.

ఎన్‌బిఎఫ్‌సిలపై హెచ్చరికలు

దేశంలో ఆర్థిక రంగం, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బిఎఫ్‌సి)లపై ఐఎంఎఫ్ హెచ్చరించింది. ఏమాత్రం రక్షణ లేని వ్యక్తిగత రుణాలు, ఎన్‌బిఎఫ్‌సిల విస్తరణపై ఆందోళన వ్యక్తం చేసింది. విద్యుత్ రంగంపై ఆధారపడిన పెద్ద ఎన్‌బి ఎఫ్‌సిల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నా యని పేర్కొంది. ప్రయివేటు, ప్రభుత్వ ఎన్‌బిఎఫ్‌సిలకు సమాన నియంత్రణలు, కఠిన లిక్విడిటీ నిబంధనలు అవసరమని సూచించింది.



తయారీరంగం పెరగలేదు

భారత ఉత్పాదకత ప్రధానంగా సేవారంగం వల్లే పెరిగిందనీ, తయారీ రంగం మాత్రం వెనుకబడి ఉన్నదని ఐఎంఎఫ్ పేర్కొన్నది. వ్యవసాయ రంగం నుంచి తయారీ, సేవారంగాలకు కార్మికుల మార్పు అవసరమని అభిప్రాయ పడింది. భారతదేశం పరిశోధన, అభివృద్ధిపై చాలా తక్కువ ఖర్చు చేస్తున్నదని తెలిపింది.

విశ్వవిద్యాలయ - పరిశ్రమ సహకారం బలోపేతం కావాలని నివేదికలో పేర్కొన్నారు. తయారీరంగ విస్తరణకు భూసేకరణ ప్రధాన అడ్డంకిగా మారిందన్న ఐఎంఎఫ్, భూ రికార్డుల ఆధునీకరణ, త్వరిత అనుమతులు అవసరమని సూచించింది. దివాళా చట్టం మెరుగుపడినప్పటికీ, కేసుల ఆలస్యం పెద్ద సమస్యగా ఉన్న దనీ, న్యాయవ్యవస్థ సామర్థ్యం పెంచాలని సూచించింది.

ఐఎంఎఫ్ నివేదికలోని అంశాలపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. పాత ఆర్థిక నమూనాను ప్రోత్సహిస్తున్నదనీ, మూడు దశాబ్దాలుగా అమలులో ఉన్న ఈ విధానాలు దేశంలో ఉద్యోగాలను సృష్టించడంలో విఫలమయ్యాయనీ, అసమానతలు పెరిగాయని తెలిపారు. సార్వత్రిక విద్య, ఆరోగ్యం, పెన్షన్లు, కార్మిక హక్కులు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. పరోక్ష పన్నులతో దేశంలో సామాన్యులపై పెను భారం పడుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నివేదిక కేంద్ర ప్రభుత్వ పెట్టుబడిదారీ, కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలు వైఫల్యాల్ని ఎత్తిచూపుతున్నదని అభిప్రాయపడుతున్నారు.

సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా

- షెడ్యూల్ ఖరారు

ఢాకా: భారతజట్టు సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లనుంది. గత ఏడాది ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వాయిదా పడిన ఈ సిరీస్‌ను రీ షెడ్యూల్ చేస్తున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్‌బోర్డు(బిసిబి) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. షెడ్యూల్ ప్రకారం గత ఏడాది భారత జట్టు బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లాల్సి ఉండగా.. అప్పుడు బంగ్లాదేశ్‌లో చెలరేగిన అల్లర్ల కారణంగా ఈ సిరీస్ వాయిదా పడింది. దీంతో సెప్టెంబర్‌లో బంగ్లా పర్యటనకు భారత జట్టు రానున్నట్లు బిసిబి క్రికెట్ ఆపరేషన్స్ చీఫ్ షహరీర్ నఫీజ్ తాజాగా ప్రకటించారు. రీ షెడ్యూల్ ప్రకారం భారత జట్టు సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్‌తో మూడు వన్డేలు, మరో మూడు టి20 మ్యాచ్‌లు ఆడనుంది. భారత బృందం ఆగస్టు 28న బంగ్లాదేశ్‌కు వెళ్లి... సెప్టెంబర్ 1న జరిగే తొలి వన్డేతో సిరీస్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 3న రెండో వన్డే, సెప్టెంబర్ 6న మూడో మ్యాచ్ ఆడనుంది. అనంతరం సెప్టెంబర్ 9 నుంచి ఇరుజట్ల మధ్య టి20 సిరీస్ ప్రారంభం కానుండగా.. 12, 13 మిగిలిన రెండు టి20లు జరగనున్నట్లు షహరీర్ నఫీజ్ తాజాగా ప్రకటనలో పేర్కొన్నారు.



మార్‌క్రమ్‌కు పగ్గాలు...

- టి20 ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికా జట్టు ఇదే!

జొహన్నెస్‌బర్గ్: 2024 టి20 ప్రపంచకప్ రన్నరప్ దక్షిణాఫ్రికా జట్టు ఈసారి టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఈ మెగా టోర్నీకి దక్షిణాఫ్రికా జట్టు సెలెక్టర్లు శుక్రవారం ప్రకటించారు. 15మంది ఆటగాళ్ల బృందానికి ఎడెన్ మార్‌క్రమ్ సారథ్యం వహిస్తుండగా.. హార్డ్ హిట్టర్ ట్రిస్టన్ స్టబ్స్‌కు అనూహ్యంగా చోటు దక్కలేదు. అతని స్థానంలో 19ఏళ్ల యువ పేసర్ క్వెనా మఫాకాను మెగా టోర్నీకి సెలెక్టర్లు ఎంపిక చేశారు. టి20 ప్రపంచకప్ దక్షిణాఫ్రికా జట్టు సీనియర్లు, జూనియర్లతో దుర్భేద్యంగా ఉంది. ఇటీవల భారత పర్యటనలో గాయపడ్డ కగిసో రబడాకూ చోటు లభించింది. అండర్-19 ప్రపంచకప్‌లో మెరిసిన యువ పేసర్ క్వెనా తొలిసారి దక్షిణాఫ్రికా జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేయనున్నాడు. స్టబ్స్‌తోపాటు, హెండ్రిగ్స్‌లకు మొండిచెయ్యి చూపించిన దక్షిణాఫ్రికా బోర్డు.. జేసన్ స్మిత్‌ను తొలిసారి ఎంపిక చేసింది.

జట్టు : మార్‌క్రమ్(కెప్టెన్), డికాక్, బ్రెవీస్, డేవిడ్ మిల్లర్ డొనోవాస్ పెరీరా, డి-జార్జి, లిండే, యాన్సెన్ బాష్, ఎంగిడి, రబడా, కేశవ్ మహరాజ్, నోర్జే, మఫాకా, జేసన్ స్మిత్.



ఉధృతంగా పోరాటాలు

ప్రభుత్వ నిర్బంధాలను అధిగమించి దేశవ్యాప్తంగా కార్మిక పోరాటాలు విస్తృతమౌతున్నాయని సిఐటియు మహాసభకు హాజరైన పలువురు ప్రతినిధులు చెప్పారు. కార్యదర్శి నివేదిక పార్ట్-1పై అనతలవట్టం ఆనందన్ నగర్ లో రెండవరోజైన శుక్రవారమూ చర్చలు కొనసాగాయి. వివిధ రాష్ట్రాలనుండి పాల్గొన్న ప్రతినిధులు తమ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్న నిర్బంధ విధానాలను, వాటిని కార్మికలోకం ప్రతిఘటిస్తున్న తీరును వివరించారు.

అనతలవట్టం ఆనందన్ నగర్ (విశాఖపట్నం) నుండి
ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి



మహాసభలో ప్రతినిధుల చర్చలు

సంఘటితం చేస్తున్నాం : అస్సాం ప్రతినిధి దినేష్



అస్సాం రాష్ట్రంలో సిఐటియుపై ప్రభుత్వం నిర్బంధం విధిస్తోందని, స్వయాన ముఖ్యమంత్రే సిఐటియుపై దాడికి పూనుకున్నారని ఆ రాష్ట్ర ప్రతినిధి దినేష్ విమర్శించారు. రాష్ట్రంలో కార్మిక హక్కుల ఉల్లంఘన ఎక్కువగా జరుగుతుందని, కనీసం వేతనాలు చెల్లించటం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కువగా తేయాకు (టీ) ప్లాంటేషన్ కార్మికులు పనిచేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం గత పదేళ్లుగా కనీస వేతనాలను నిర్ధారించలేదని అన్నారు. తాము ప్రభుత్వానికి అనేకసార్లు విజ్ఞప్తి చేశామని, అందువల్ల రాష్ట్ర ముఖ్యమంత్రి కనుసన్నల్లో సిఐటియుపై నిర్బంధం జరుగుతోందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్, బిజెపి కార్యక్రమాలు ఎటువంటి నిబంధనలు లేకుండా యథేచ్ఛగా జరుగుతున్నాయని, కార్మికుల ఆందోళనలకు మాత్రం అనేక ఆంక్షలు విధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సిఐటియు 'హక్కుల కోసం పోరాటం' నినాదంతో కార్మిక వర్గాన్ని సంఘటితం చేస్తోందని, ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతామని అన్నారు. కనీస వేతనాలు నోటిఫై చేసే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

భూసేకరణపై పోరాట విజయం : కర్ణాటక ప్రతినిధి సునంద



భూసేకరణపై పోరాడి విజయం సాధించామని కర్ణాటక ప్రతినిధి హెచ్ఎస్ సునంద అన్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం వంటి స్కీం వర్కర్ల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించామన్నారు. తమ పోరాటానికి దిగొచ్చిన ప్రభుత్వం చర్చలకు పిలిచిందన్నారు. సిఐటియు డిమాండ్లను వివరించామని, దీనిపై త్వరలోనే సానుకూల ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భూసేకరణకు వ్యతిరేకంగా తాము జరిపిన పోరాటం విజయవంతమైందని, ప్రభుత్వం ఎట్టకేలకు వెనక్కి తగ్గి భూ సేకరణ నిర్ణయాన్ని విరమించుకుందని అన్నారు. ఈ పోరాటంలో అన్ని వర్గాలను ఐక్యం చేయడంలో సఫలీకృతం అయ్యామని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై నిర్వహించిన పోరాటాల్లోనూ విజయం సాధించామని తెలిపారు.

ఐటి రంగంలో ఉద్యమాలు : చీనాంగ్షుక్ దాస్



ఐటి ఉద్యోగుల సంఘం ప్రతినిధి చీనాంగ్షుక్ దాస్ మాట్లాడుతూ.. ఐటి రంగంలో సంఘం బలోపేతానికి కృషి జరుగుతోందన్నారు. ఇప్పటికే అనేక ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు. టిసిఎస్ వంటి ఐటి కంపెనీల్లో పని గంటలపై పోరాటం జరుగుతుందని అన్నారు. మహిళా ఉద్యోగులకు మెటర్నిటీ సెలవులు లేవని, అలాగే పని పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగుతోందని తెలిపారు. కర్ణాటక, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో సంఘం కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఇతర రాష్ట్రాల్లోనూ కాస్త మెరుగయ్యామని పేర్కొన్నారు. ఐటి ఉద్యోగుల ఆందోళనలపై కర్ణాటకతో పాటు వివిధ రాష్ట్రాల్లో నిర్బంధం కూడా ఉందని పేర్కొన్నారు. సంఘాన్ని అన్ని రాష్ట్రాలకూ విస్తరించేందుకు చర్యలు చేపడతామని అన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు : ఆశిష్ మిశ్రా



ఎల్ఐసి ఏజెంట్స్ సంఘం ప్రతినిధి వివేక్ ఆశిష్ మిశ్రా మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి ప్రయత్నం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో తమ ఏజెంట్లకు సమస్యలు ఉత్పన్నమయ్యాయని, దీనిపై పోరాటం సాగిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు నిర్వహించామని చెప్పారు.

నిర్బంధాన్ని ఛేధించి పోరాటం: మహారాష్ట్ర ప్రతినిధి షభా

ప్రభుత్వ నిర్బంధాన్ని ఛేధించి పోరాటం సాగించామని మహారాష్ట్ర ప్రతినిధి షభా అన్నారు. రాష్ట్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం కార్మిక పోరాటాలను అణచివేసేందుకు అనేక చర్యలకు పాల్పడుతోందని, దీనిని సిఐటియు తిప్పికొట్టిందని తెలిపారు. అంగన్వాడీల పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరుగుతోందని, దీనిని సిఐటియు సవాల్ చేస్తోందని అన్నారు. ఎమ్మెల్యేగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినోద్ నికోలే ఉన్నారని, ఆయన అసెంబ్లీలో కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఆందోళనలు : రమేష్బాబు

రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రతినిధి డి రమేష్ బాబు మాట్లాడుతూ.. రైల్వే రంగంలో తమ సంఘం కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయని అన్నారు. రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై అనేక రాష్ట్రాల్లో ఆందోళనలు జరుగుతున్నాయని, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్లో అనేక ఉద్యమాలు చేశామని అన్నారు. సంఘం ఇప్పుడిప్పుడే విస్తరిస్తోందని, సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి జరుగుతుందని అన్నారు. అన్ని రాష్ట్రాలకూ విస్తరిస్తామని అన్నారు.

బలోపేతం చేస్తాం : ఎఫ్ఎంఆర్ఐ ప్రధాన కార్యదర్శి పార్థ రకిత్

ఎఫ్ఎంఆర్ఐ ప్రధాన కార్యదర్శి పార్థ రకిత్ మాట్లాడుతూ.. యాజమాన్యాల నిర్బంధాలను ఎదుర్కొని ముందుకు సాగుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరు సాగిస్తున్నామని, సంఘాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

హక్కుల కోసం పోరాటం

కార్మికుల సంఘటితం

- సిఐటియు అస్సాం రాష్ట్ర కార్యదర్శి తపన్ శర్మ

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి



అస్సాంలో హక్కుల కోసం పోరాటం అనే నినాదంతో కార్మిక వర్గాన్ని సంఘటితం చేస్తున్నామని అస్సాం సిఐటియు రాష్ట్ర కార్యదర్శి తపన్ శర్మ అన్నారు. అదేవిధంగా అస్సాం ముఖ్యమంత్రి మతోన్మాద ఎజెండాను ముందుకు తీసుకొని కార్మికులను విభజించే విధానాలపై కూడా మేము కార్మిక వర్గాన్ని చైతన్యపరుస్తాన్నామని అన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా ఆయనను ప్రజాశక్తి పలకరించింది. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాలు మాటల్లోనే...

ప్ర: అస్సాంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలేంటి?

జ: అస్సాంలో కార్మిక హక్కుల ఉల్లంఘన ఎక్కువగా జరుగుతుంది. కనీసం వేతనాలు చెల్లించటం లేదు. సిఐటియుగా మేము రూ.800 వేతనాన్ని డిమాండ్ చేస్తున్నాం. అస్సాంలో ఎక్కువగా తేయాకు ప్లాంటేషన్లో కార్మికులు పని చేస్తున్నారు. అస్సాం ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా కనీస వేతనాలను నిర్ధారించ లేదు. మేము ప్రభుత్వానికి అనేక సార్లు విజ్ఞప్తి చేసాం. రాబోయే రోజుల్లో ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే విధంగా, కనీస వేతనాలు నోటిఫై చేసే వరకూ పోరాటం చేస్తాం.

ప్ర: అస్సాంలో టీ ప్లాంటేషన్ కార్మికుల పరిస్థితులు ఎలా వున్నాయి?

జ: అస్సాంలో టీ ప్లాంటేషన్ ముఖ్యంగా బొర్రాక్ వాలీ మరియు బ్రహ్మపుత్ర వ్యాలీలో ఉన్నాయి. ఇక్కడ కనీస వేతనాలు అమలు జరగటం లేదు. రోజు వారీ వేతనం కేవలం రూ.215 మాత్రమే చెల్లిస్తున్నారు. మేము సిఐటయు ఆధ్వర్యంలో సంఘాలను ఏర్పాటు చేసి పోరాటాలు చేసిన చోట కనీస వేతనాలు అమలు కొంత మేర జరుగుతుంది. మిగిలిన చోట అమలు జరగడం లేదు.

రాబోయే రోజుల్లో మేము టీ ప్లాంటేషన్ కార్మికుల కోసం ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం వుంది.

ప్ర : అస్సాం నుంచి పనుల కోసం బయటి రాష్ట్రాలకు వెళుతున్న వలస కార్మికులకు మీరేం చెబుతారు?

జ: అస్సాం నుంచి అనేక మంది కార్మికులు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్కు వలసలు వెళ్తున్నారు. ఇక్కడ ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకపోవటం, అలాగే కనీస వేతనాలు లేకపోవటం వలన వలసలు ఎక్కువగా జరుగుతున్నాయి. అస్సాం కార్మిక శాఖ మంత్రి అసెంబ్లీలో చేసిన ప్రకటన మేరకు ఏడు లక్షలకు పైగా అస్సాం కార్మికులు ఇతర రాష్ట్రాల్లో పని కోసం వలస వెళ్లటం జరిగింది. వలస వెళ్లిన రాష్ట్రాల్లో కూడా అస్సాం కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం కేరళ రాష్ట్రం మాత్రమే వలస కార్మికుల కోసం గెస్ట్ వర్కర్ స్కీం కింద వలస కార్మికుల ప్రయోజనాలను కొంత మేరకు కాపాడుతున్నది.



గ్రూపు చర్చల్లో తెలంగాణ ప్రతినిధులు

అజ్ఞాతంగా పని... అపూర్వ విజయం

- ఢిల్లీ అంబూజా సిమెంట్ ఫ్యాక్టరీ పోరాట నాయకులు పివి అనియన్

అనతలవట్టమ్ ఆనందన్ నగర్ నుండి
ఎన్.మధుసూదనరావు



'అది ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పరిధిలోని భూభాగం. దేశ రాజధాని ఢిల్లీ నగరానికి 40 కిలోమీటర్ల దూరం. దాద్రి పరిసరాల్లో గల ఒక సిమెంట్ ఫ్యాక్టరీని మూడేళ్ల క్రితం అదాని తన గుప్పెట్లోకి తీసుకున్నారు. అప్పటి నుండి ఇక్కడి కార్మికుల పరిస్తితి దారుణంగా మారింది. 'బతికి ఉన్న ఏ మనిషికి సెలవు ఇవ్వం' అని చేప్పేవారు. పనిగంటలు విపరీతంగా పెంచేశారు. సంఘాలు పెట్టుకోకూడదన్నారు. ఈ పరిస్థితుల్లో సిఐటియు కార్యకర్తలు అజ్ఞాతంగా పనిచేశారు. కార్మికులను సంఘటితం చేశారు. సుదీర్ఘంగా ఈ పనికొనసాగింది. చివరకు సమ్మెతో అపూర్వ విజయం సాధించాం' అని ఢిల్లీ రాష్ట్ర సిఐటియు కార్యదర్శి పివి అనియన్ చెప్పారు. సిఐటియు మహాసభకు హాజరైన ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీలో చోటుచేసుకున్న పరిణామాలను, కార్మికుల ప్రతిఘటనను వివరించారు.

ప్ర: అంబూజా సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికులను ఏలా ఏకం చేశారు..?

జ: ఢిల్లీకి 40 కిలోమీటర్ల దూరాన గల 'దాద్రి'లో మూడేళ్ల క్రితం అంబూజా సిమెంట్ ఫ్యాక్టరీని అదాని స్వాధీనం చేసుకున్నాడు. కాంట్రాక్టు కార్మికులు వందలోపే ఉంటారు. రోజువారీ వేతనాలు, వైద్యం, ఇన్సూరెన్స్, సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ ఇలా ఈ విషయం గురించి కార్మికుడు ప్రశ్నించినట్టయితే ఇండస్ట్రీ నుంచి బయటకు నెట్టేసేవారు. యూనియన్లు కూడా లేవు. అంతా కాంట్రాక్ట్ వర్కర్లే కావడంతో అణగిమణిగి ఉండేవారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ నుంచి కొద్దిమంది సిఐటియు గ్రూపు ఇక్కడ రహస్యంగా పనిచేయడం మొదలుపెట్టింది. క్రమేణా అందరూ సిఐటియు పరిధిలోకి వీరంతా వచ్చారు. చిన్న కమిటీ ఒకటి ఫ్యాక్టరీ బయట వేసి పని ప్రారంభించాం. యూనియన్ను నిర్మించేందుకు కొన్ని నెలల పాటు శ్రమించగా అత్యంత వేగంగానే యూనియన్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవడం జరిగింది.

ప్ర: వేతనాలు ఎలా ఉండేవి?

జ: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.12వేలు మాత్రమే నిర్ణయించింది. యూనియన్ రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్నాక లోపలకెళ్లి సిఐటియు పనిచేయడం ప్రారంభించాం. వేతనాల పెంపుకోసం ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చాం. చాలామంది ఇక్కడ కాంట్రాక్టు కార్మికులు గ్రాడ్యుయేషన్ చదివిన బీహార్ వాళ్లు ఉన్నారు. అంతా పోరాటాల్లోకి పెద్ద సంఖ్యలో వచ్చారు. సిఐటియు వీరందరినీ ఐక్యంగా నడిపించడంతో యాజమాన్యం దిగివచ్చి చార్టర్ ఆఫ్ డిమాండ్స్కు అంగీకరించి నాలుగేళ్లలో అన్నీ పూర్తిచేస్తామని ఒప్పందంపై సంతకాలు పెట్టడం పెద్ద విజయం.

ప్ర: విజయం సాధించాక వచ్చిన హక్కులేమిటి?

జ: ప్రధానంగా రూ.12వేల నుంచి రూ. 21వేలకు జీతం పెంచుకోవడం పెద్ద ఘన విజయం. ఢిల్లీ ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని వేతనాలు పెంచింది. సెలవులు, ఇఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలను దశల వారీగా అమలు చేసేందుకు అంగీకారం కుదిరింది. సిమెంట్ ఇండస్ట్రీ అయినందున విపరీతమైన ధూళి, దుమ్ము కార్మికుల ఆరోగ్యాలను దెబ్బతీస్తుండడంతో అగ్రిమెంట్ అమలు కోసం సిఐటియు ఇంకా పోరాడుతూనే ఉంది. ఉత్తరప్రదేశ్ నోయిడా (దాద్రి) ప్రాంతంలోనే అంబూజా సిమెంట్, బెల్ పరిశ్రమ తాలూకా ఆఫీస్ ఒకటి ఇక్కడే ఉండడంతో వర్కర్ల హక్కుల కోసం నోయిడా కార్పొరేట్లను సిఐటియు సవాల్ చేస్తూ పోరాటాలను కొనసాగిస్తుంది. బెల్ ఆఫీసులోనూ 190 మంది కాంట్రాక్టు వర్కర్లు తమ సమస్యలపై తాజాగా సిఐటియు జెండా కింద పోరాడుతున్నారు.

23 ఏళ్ల తర్వాత

సమ్మెతో కనీస హక్కులు

- ఢిల్లీ మున్సిపల్ వర్కర్ల నాయకురాలు మధుబాల

అనతలవట్టమ్ ఆనందన్ నగర్ నుండి
బి.శ్రీనివాసాచారి



దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ఏక్తా కర్మచారి (మలేరియా విభాగంలోని) కాంట్రాక్టు కార్మికులు ఐదు వేల మంది 23 ఏళ్ల పాటు 1996 నుంచి వెట్టిచాకిరే బతుకుగా జీవితాలను ఈడ్చారు. సుదీర్ఘ పోరాటాలు,సమ్మె తరువాత వారు కనీస హక్కులు సాధించారు. ఆ పోరాటం జరిగిన తీరును ఢిల్లీ యాంటీ మలేరియా ఏక్తా కర్మచారి యూనియన్ (ఎఎంఇకెయూ-సిఐటియూ అనుబంధం) ఉపాధ్యక్షురాలు మధుబాల ప్రజాశక్తికి వివరించారు.

ప్ర : ఢిల్లీ మున్సిపాల్టీలో పోరాటం ఎలా మొదలైంది?

జ: మలేరియా విభాగంలో ఐదువేల మంది కార్మికులు ఉన్నారు. వీరంతా 1996 నుంచి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీలో కాంట్రాక్ట్ వర్కర్లుగా పనిచేస్తున్నారు. వీరిని మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటిఎస్) సిబ్బంది అంటారు. ఇంటింటికీ వెళ్లి మలేరియా వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా డొమస్టిక్ బ్రీడింగ్ చెకప్ చేస్తుంటారు. ఇది క్షేత్రస్థాయిలో అనేక ఆరోగ్య సమస్యలను తెచ్చిపెట్టే పని. తక్కువ వేతనాలతోనూ, సెలవులకు నోచుకోకుండా ఇఎస్ఐ, పిఎఫ్ లేకుండా 2017 వరకూ పనిచేశారు. 2017లో సిఐటియూ గొడుగు ఏకం అయ్యారు.

ప్ర : పోరాటం తర్వాత సాధించిన హక్కులేమిటి?

జ: 23ఏల్ల తర్వాత గానీ వీరికి మోక్షం కలుగలేదు. ఇఎస్ఐ, పిఎఫ్, సదుపాయాలను సాధించుకున్నారు. అయితే మెడికల్ లీవ్లు, ఎర్నడ్ లీవ్లు, కారుణ్య నియామకాలు, రిటైర్మెంట్ తర్వాత గ్రాట్యుటీ ఇంతవరకూ సాధించలేదు. వీటికోసం పోరాడుతూనే ఉన్నారు. 2025 వరకూ వేరియబుల్ పే, వేరియబుల్ డిఎ గ్రేడ్ పే ఈ రెండూ వీరికి లేవు. 29 సెప్టెంబర్ 2025 నుంచి 31 అక్టోబర్ 2025 వరకూ 33 రోజులు నిరవధిక సమ్మె చేశారు. ఐదు వేల మంది కార్మికులూ పాల్గొనడంతో ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం 32వ రోజున చర్చలు జరిపి ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, ఢిల్లీ ప్రభుత్వంలోని ఆర్థిక మంత్రి, ముఖ్యమంత్రి, ప్రతిపక్ష, అఖిలపక్షాలకు చెందిన నాయకులతో ఒక కమిటీ వేసింది. ప్రధాన డిమాండ్ అయిన వేరియబుల్ డిఏ సాధించుకోవడం జరిగింది.

ప్ర: సమ్మెపై నిర్బంధం ఉందా?

జ: ఈ సమ్మెను అణచివేయడానికి ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వం అరెస్టులు, బెదరింపులు, ఉద్యోగాల నుంచి తీసేస్తామంటూ బెదిరింపులకు దిగింది, అయినా, కార్మికులు ఐక్యంగా ఉండి ప్రభుత్వ ప్రయత్నాలన్నిటినీ తిప్పి కొట్టి వేరియబుల్ డిఏ, గ్రేడ్ పే రెండూ సాధించుకున్నారు. దీనివల్ల ప్రతి ఒక్క కార్మికునికి కూడా వేతనాల్లో ఏడు వేల రూపాయల నుంచి రూ. ఎనిమిది వేలు పెరుగుదల కనిపించింది. వారు సాధించిన ఈ విజయంతో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీలో గల మిగతా విభాగాల్లో కాంట్రాక్టు వర్కర్లను సంఘటితం చేసే ప్రయత్నాల్లో ఉన్నాం. రాబోయే రోజుల్లో మెడికల్ లీవ్, కారుణ్య నియామకాలు, రిటైర్మెంట్ తర్వాత గ్రాట్యుటీ కోసం పోరాటాలు కొనసాగుతాయి.

పోరాడి సాధించుకున్నారు

పెండింగ్ వేతనాల కోసం క్లాప్ డ్రైవర్ల అవిశ్రాంత కృషి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సిఐటియు ఆధ్వర్యంలో కర్నూలులో క్లాప్ డ్రైవర్లు చేసిన 42 రోజుల పోరాటం ఫలితాన్నిచ్చింది. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్, పని భద్రత కల్పించాలని కర్నూలు నగరంలోని క్లాప్ డ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం చేయగా పెండింగ్ వేతనాలన్నిటినీ సాధించుకున్నారు... ఈ మూడేళ్ల కాలంలో కర్నూలు జిల్లా లో సిఐటియు చేపట్టిన సుదీర్ఘ పోరాటం... అఖిలభారత మహాసభల నేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

కర్నూలు నగరంలో చెత్త సేకరణ కోసం వైసిపి ప్రభుత్వంలో క్లాప్ విధానాన్ని తీసుకొచ్చారు. చెత్త వాహనాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా నగరంలోని చెత్తను సేకరించడం మొదలు పెట్టారు. వాహనాలను డ్రైవర్లను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. రెడ్డి ఏజన్సీకి డ్రైవర్ల జీతభత్యాల నిర్వహణ బాధ్యతను అప్పగించారు. నగరంలో 91 క్లాప్ ఆటోలు ఉండగా 97 మంది క్లాప్ డ్రైవర్లను నియమించారు. అయితే 13 నెలల పాటు క్లాప్ డ్రైవర్ల జీతాలను ఆ ఏజన్సీ చెల్లించలేదు. దీంతో సిఐటియు ఆధ్వర్యంలో 2023 డిసెంబర్ 20న కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ఆందోళనలను ప్రారంభించారు. 42 రోజుల పాటు పోరాటం సాగించారు. సిఐటియు ఆధ్వర్యంలో 16 వేల కరపత్రాలను ముద్రించి కర్నూలు నగరంలోని అన్ని వార్డుల్లోని ప్రజానీకానికి పంపిణీ చేశారు. వీధులలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. బిక్షాటన చేపట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు అర్ధనగ్న దీక్షలు నిర్వహించారు. గడ్డి తింటూ నిరసన తెలిపారు. మెడకు ఉరితాళ్లు బిగించుకున్నట్లు, తల కిందులుగా నిలబడి వినూత్నంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ పోరాటానికి సిపిఎంతో పాటు పలు ప్రజా సంఘాలు మద్దతు తెలిపారు. క్లాప్ డ్రైవర్ల ఆందోళన ఉధృతమైంది. నగరంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోయింది. నగరపాలక సంస్థ అధికారులు ఎన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా పారిశుధ్యాన్ని గాడిన పెట్టలేకపోయారు. చివరికి జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని కార్మికశాఖ అధికారులు సదరు ఏజన్సీతో చర్చలు జరిపేలా చర్యలు తీసుకున్నారు. రెండు నెలల్లోపు పెండింగ్ ఉన్న వేతనాలన్నిటినీ చెల్లిస్తామని ఏజన్సీ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో క్లాప్ డ్రైవర్లు దీక్షలను విరమించారు. ఇచ్చిన హామీ మేరకు రెండు విడతల్లో పెండింగ్ ఉన్న వేతనాల మొత్తాన్ని తిరిగి చెల్లించారు. సిఐటియు పోరాటం ఫలితంగానే ఇది సాధ్యమైంది. దీంతో క్లాప్ డ్రైవర్లు సిఐటియు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.



కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు తలకిందులుగా ఉండి నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

ఉమ్మడి పోరాటాలు ఉధృతం చేయాలి

- పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజమే
- సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి,
అనతలవట్టం ఆనందన్ నగర్



సోషలిస్టు రాజ్య స్థాపనతోనే ఈ దోపిడీ వ్యవస్థను అంతం చేయగలమని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పేర్కొన్నారు. సోషలిజం ఆశయాన్ని ముందుకు తీసుకెళ్ళడం ద్వారా సమాజాన్ని అన్ని రకాల దోపిడీల నుంచి విముక్తి చేయొచ్చని ఆయన అన్నారు. సిఐటియు 18వ మహాసభ మూడవ రోజున ఉద్యమ బలోపేతానికి ప్రత్యామ్నాయ మార్గాలను సభ ముందుంచారు. నయా ఉదారవాద విధానాలు సృష్టించిన సంక్షోభం, కార్పొరేట్ మతతత్వ శక్తుల దాడుల నేపథ్యంలో రాజకీయ, ఉద్యమ నిర్మాణ కర్తవ్యాలు రూపొందించినట్లు తెలిపారు. 'ప్రజల జీవితాలు, జీవనోపాధి హక్కులపై పాశవికదాడి జరుగుతోంది. నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేస్తున్న బిజెపి నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం, నయా ఫాసిస్టు లక్షణాలను అవలంభిస్తోంది. ఈ సంక్షోభాన్ని సామాజిక మార్పు కోసం ఉన్నతమయిన చైతన్యంగా మార్చే దిశగా అన్ని రంగాలలో మన జోక్యం, మన కార్యకలాపాలు ఉండాలి' అని నొక్కి చెప్పారు.

'నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధాన పాలనకు వ్యతిరేకంగా దశాబ్దాలుగా మనం కొనసాగిస్తున్న పోరాటాల అనుభవాలు అన్ని రంగాల్లో శ్రామిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతున్నాయని అన్నారు.

బూర్జువా ప్రభుత్వాల అసలు నైజాన్ని బట్టబయలు చేసి, దానికి వ్యతిరేకంగా పోరాడేలా ప్రజలను చైతన్య పర్చాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉందన్నారు. అదే సమయంలో మనం లేవనెత్తే డిమాండ్లు కూడా మారుతున్న మన పోరాట స్వరూప స్వభావాలకు అనుగుణంగా ఉండాలి. అందువల్ల మన పోరాటాలు, వాటి కోసం చేస్తున్న చొరవ అన్ని రంగాల్లో సరైన ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాడాటానికి అవసరమైన చైతన్యాన్ని అభివృద్ధి చేసే దిశగా ఉండాలి' అని అన్నారు.

సరైన ప్రజానుకూల ప్రత్యామ్నాయాల ప్రచారం, ఆచరణ ప్రజలను చైతన్యం చేయగలవు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో నడిచే నయా ఉదారవాద ప్రభుత్వాలు మార్పును అంగీకరించవు. అవి తమ దోపిడీ విధానాలను దూకుడుగా కొనసాగిస్తూనే ఉన్నాయి. ప్రస్తుత వ్యవస్థాగత సంక్షోభం నుండి బయట పడటానికి కార్పొరేట్ల నాయకత్వంతో పనిచేస్తున్న పాలకవర్గాలు దాడులే ఏకైక మార్గంగా భావిస్తున్నాయి. చివరికి ఇది నయా ఫాసిస్ట్ రూపం తీసుకుంటోంది. విషపూరితమైన మతతత్వ, విభజన ప్రచారాలు ఈ దోపిడీ వ్యవస్థకు ఆయుధాలుగా ఉన్నాయి. వాటిని ప్రతిఘటించడానికి కార్మిక వర్గాన్ని చైతన్యపరచడమే మార్గం' అన్నారు. 'పోరాటాలతో సాధించుకున్న రాజ్యాంగ, ప్రజాస్వామ్య, కార్మిక హక్కులను, అసమ్మతి, భిన్నాభిప్రాయాలను తెలిపే హక్కులను నిరాకరిస్తున్నారు. ఈ దాడులను ప్రతిఘటించడం, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి ప్రజానుకూల ప్రత్యామ్నాయాన్ని నిర్మించడం ఆవశ్యకం' అని అన్నారు.

'ప్రభుత్వ రంగ పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, ప్రాథమిక అత్యవసర సేవలను ప్రైవేటీకరించడాన్ని మహాసభ వ్యతిరేకిస్తుంది. ప్రైవేటీకరణ జీవనోపాధిని, పౌర సేవలను బలహీనపరుస్తుంది. జాతీయ వనరులను ప్రైవేట్ లాభాల కోసం మళ్లిస్తుంది.

దోపిడీతో కూడిన ప్రస్తుత సామాజిక వ్యవస్థను కూల్చివేసే పోరాటంతో పాటు ప్రత్యామ్నాయాన్ని నిర్మించే దిశగా అడుగులేయాలి' అని అన్నారు. 'దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటంతో పాటు ప్రజావ్యతిరేక విధానాలపై ఉమ్మడి పోరాటాలు సాగించాలి. పాలకవర్గం మనల్ని యంత్రాల స్థాయికి దిగజార్చాలని, వేతన బానిసలుగా మార్చాలని చూస్తోంది. వారి ఎజెండాకు మనం లోనుకాకూడదు. సమ సమాజ నిర్మాణానికి, బూజుపట్టిన రాజ్య వ్యవస్థను నాశనం చేయడానికి ప్రతిన బూనాలి. అని పిలుపునిచ్చారు.



మహాసభకు హాజరైన రాష్ట్ర ప్రతినిధులు

విస్తరణ దిశగా ఉద్యమాలు

చర్చల్లో ప్రతినిధులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అనతలవట్టం ఆనందన్ నగర్ (విశాఖపట్నం)

ఆటంకాలు అధిగమించి సంఘం విస్తరణ, సంఘటితం లక్ష్యంగా గడచిన మూడేళ్లల్లో అలుపెరగని స్థాయిలో పని చేశామని, పలు విజయాలు సాధించామని సిఐటియు 18వ అఖిల భారత మహాసభ రెండవ రోజు చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు ఉత్సాహంగా వివరించారు. కేంద్రంలోని మతతత్వ-కార్పొరేట్ బిజెపి ప్రభుత్వం, రాష్ట్రాల్లోని బిజెపి పాలిత, కార్మిక వ్యతిరేక ప్రభుత్వాల నిర్బంధాలు, సృష్టించిన ఇబ్బందులను వీరోచితంగా ఎదుర్కొన్నామని తెలిపారు. కొత్త ప్రాంతాలకు ఎర్ర జెండాను పరిచయం చేసి కార్మికుల, ఉద్యోగుల విశ్వాసం చూరగొన్నా మన్నారు. కార్మికుల్లో, ప్రజల్లో ఈ కాలంలో సంఘం ప్రతిష్ట మరింతగా పెరిగిందని, తమ సమస్యల పరిష్కారానికి అనివార్యంగా సిఐటియు వైపు చూసే స్థాయికి ఖ్యాతి ఇనుమడించిందని పేర్కొన్నారు. డిసెంబర్ 31-జనవరి 4 వరకు ఐదు రోజులపాటు ఇక్కడ జరుగుతున్న సిఐటియు మహాసభలో రెండవ రోజు శుక్రవారం ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రవేశపెట్టిన కార్యకలాపాలు (మొదటి భాగం), సంఘం నిర్మాణం (రెండవ భాగం) పై చర్చలు కొనసాగాయి. గురువారం ప్రారంభమైన కార్యకలాపాల రిపోర్టుపై చర్చలు శుక్రవారం ఉదయం వరకు జరిగాయి. వివిధ రాష్ట్రాలు, సంఘాల సమాఖ్యల నుంచి మొత్తం 59 మంది చర్చల్లో పాల్గొన్నారు. అనంతరం సంఘ నిర్మాణంపై రాత్రి 7 గంటల వరకు చర్చలు జరిగాయి.



రాష్ట్రం నుంచి చర్చలో పాల్గొన్న వి.ఉమామహేశ్వరరావు

మెరుగైన సమీకరణ
వి. ఉమామహేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్

గత మహాసభ ఇచ్చిన పిలుపు, మార్గదర్శకత్వం మేరకు మూడేళ్ల కాలంలో కార్మికుల సమీకరణ మెరుగుగా జరిగింది. కొత్త రంగాలకు విస్తరించాం. గత వైసిపి, ప్రస్తుతం ఎన్‌డిఎలో భాగస్వామ్యమైన టిడిపి ప్రభుత్వ విధానాలు కార్మిక వ్యతిరేకతను సంతరించుకున్నాయి. టిడిపి కూటమి హయాంలో 'సూపర్ డబుల్ ఇంజిన్' ప్రభుత్వం నడుస్తోంది. మోడీ సర్కార్ లేబర్ కోడ్స్ అమలుకు నోటిఫికేషన్ జారీ చేయకముందే ఇక్కడి చంద్రబాబు ప్రభుత్వం చట్టాలు చేసి అమల్లో పెట్టింది. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా మతతత్వ-కార్పొరేట్ బంధం బలపడి కార్మికులకు, ప్రజలకు వ్యతిరేకంగా పని చేస్తోంది. ఈ ఇబ్బందులను అధిగమించి సంఘం వైపు కార్మికులను, శ్రామికులను మెరుగైన స్థాయిలో సమీకరించాం. తమ సమస్యల పరిష్కారానికి సిఐటియు జెండా వైపు కదిలి వస్తున్నారు. గత వైసిపి హాయంలో అంగన్‌వాడీలు 40 రోజులకుపైన నిరవధిక సమ్మె చేసినప్పుడు అప్పటి ప్రభుత్వం ఎస్మా ప్రయోగించింది. టిడిపి సైతం కార్మికుల ఆందోళనలపై అదే ధోరణితో ఉంది. అయినప్పటికీ 4.60 లక్షల సభ్యత్వం సాధించాం. గిగ్‌వర్కర్స్, ఆక్వా, సిమెంట్ రంగాలపై దృష్టి సారించాం. ఆర్‌టిసి, ఎలక్ట్రిసిటీ, సెజ్‌లలో పని చేసే కాంట్రాక్టు వర్కర్స్‌పై కేంద్రీకరించి పని చేస్తున్నాం. రైల్వే కాంట్రాక్టు కార్మికుల దగ్గరకు వెళ్లడానికి ఆలోచిస్తున్నాం. దీనికి అఖిలభారత స్థాయి నుంచి సహకారం కోరుతున్నాం. కృష్ణపట్నం, విశాఖ పోర్టులలో కార్మికుల సమస్యలపై జోక్యం కోసం ప్రయత్నిస్తున్నాం. వైజాగ్ స్టీల్ పరిరక్షణకు నిరవధికంగా పోరాడుతున్నాం. టిటిడి కార్మికుల్లో పని చేస్తున్నాం. క్యూబా, వయనాడు విపత్తు, విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించి పంపించాం, ఈ కాలంలో 45 వేల మందికి వివిధ స్థాయిల్లోని కేడర్‌కు రాజకీయ విద్య అందించాం, లోటుపాటులు అధిగమించి మరింత మెరుగ్గా పని చేస్తాం.

చారిత్రక పోరాటాలు : శేషుకుమారి, ఆంధ్రప్రదేశ్

జనరల్ సెక్రటరీ రిపోర్టు పార్ట్-1పై చర్చల్లో పాల్గొంటూ... ఈ కాలంలో రాష్ట్రంలో స్కీం వర్కర్స్, కాంట్రాక్టు ఉద్యోగులు, విఆర్‌ఎ, విఒఎ తదితరుల డిమాండ్లపై ఆందోళనలు జరిగాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల సమస్యలు, వేతనాల పెంపు డిమాండ్లపై 42 రోజులపాటు సమ్మె జరిగింది. అప్పటి సర్కార్ తీవ్ర నిర్బంధం అమలు చేసింది. చివరికి ఎస్మా సైతం ప్రయోగించింది. ప్రభుత్వ నిర్బంధం ఉన్నప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో లక్ష మంది అంగన్‌వాడీ కార్మికులు వీరోచితంగా సమ్మెలో పాల్గొన్నారు. ఇది చారిత్రాత్మక పోరాటం. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం బలవంతంగా తెరిపించడానికి ప్రయత్నించడా అడ్డుకున్నారు. చలో విజయవాడ కార్యక్రమంపై అత్యంత క్రూరంగా అంగన్‌వాడీలపై ప్రభుత్వం క్రూరంగా దాడులు చేసింది. వందలాదిమందిని అరెస్ట్ చేసింది. చివరికి ప్రభుత్వం దిగొచ్చి చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి అంగీకరించింది. సర్వశిక్ష అభియాన్ 22 రోజులపాటు సమ్మె చేశారు. మున్సిపల్ కార్మికులు 16 రోజులు సమ్మె చేశారు. ఆశా కార్మికులు, విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికులు, విఒఎ కార్మికులు సమరశీలంగా ఆందోళనల్లో పాల్గొన్నారు. ఈ కాలంలో వైజాగ్ స్టీల్ కార్మికుల పోరాటం చారిత్ర సృష్టించింది.



ప్రతిష్ట పెరిగింది : విఎస్ రావు, తెలంగాణ



ఈ కాలంలో సిఐటియు నిర్వహించిన పోరాటాలు, కార్మికుల సమస్యలపై జోక్యంతో సంఘం ప్రతిష్ట పెరిగింది. బొగ్గు, విద్యుత్, రైల్వే, సిమెంట్, ప్రైవేటు సెక్యూర్టీ, బేవరేజెస్, టైరు, టెక్స్‌టైల్ రంగాల్లో విస్తరణ కోసం ప్రణాళికాబద్ధంగా పని చేశాం. వివిధ సంఘాలతో ఐక్య కార్యాచరణకు కృషి నిర్వహించాం. శ్రామిక మహిళలు, మహిళా రంగంలో కృషి మెరుగుపడింది. పరిశ్రమలలో కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై నిరంతరం పని చేశాం. ఫలితంగా శాండ్‌విక్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు కార్మికులు రెగ్యులరైజ్ అయ్యారు. జిహెచ్‌ఎంసి పరిధిలో ఆర్‌ఎన్‌కెవై యూనియన్ కృషి ఫలితంగా 1200 మంది పర్మినెంట్ అయ్యారు. వలస కార్మికుల సమస్యలపై పలు జిల్లాల్లో సర్వే చేశాం. నివాస ప్రాంతాల్లో సమస్యలపై కేంద్రీకరించి పని చేశాం.

యంగ్ వర్కర్స్ కమిటీలు : సునితా కురియన్, కేరళ



దేశ వ్యాప్తంగా ఉన్న సిఐటియు సభ్యత్వంలో 47 శాతం కేరళలోనే ఉంది. ఈ కాలంలో 17 శాతం సభ్యత్వం పెరిగింది. వ్యవసాయ రంగం తర్వాత ట్రాన్స్‌పోర్టు రంగం పెద్దది. కేరళలోని వామపక్ష ప్రభుత్వం కార్మికుల హక్కుల రక్షణకు తోడ్పడుతోంది. వలస కార్మికులకు అండగా నిలిచింది. రాష్ట్రంలో యువ వర్కర్స్ కమిటీలను ప్రత్యేకంగా వేస్తున్నాం. పలు రంగాల్లోకి విస్తరించాం. రంగాల వారీగా కోఆర్డినేషన్ కమిటీలు వేసి సంఘ విస్తరణకు, రాజకీయంగా తర్ఫీదు చేయడానికి అవిరళ కృషి సల్పుతున్నాం. హిందూ మతోన్మాద దాడులను, మోడీ ప్రభుత్వ కార్మిక హక్కుల హననానికి వ్యతిరేకంగా కార్మికులను సమీకరిస్తున్నాం.

పోరాట పటిమ విస్తృతి : విశ్వరూప్ బెనర్జీ, పశ్చిమబెంగాల్



అననుకూల రాజకీయ పరిస్థితుల మధ్య పని చేస్తున్నాం. మమత ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం లేదు. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ దాడులు పెరుగుతున్నాయి. అయినప్పటికీ ఈ కాలంలో బ్రిగేడ్ మైదానంలో భారీ ర్యాలీలు జరిగాయి. కేడర్‌లో రాజకీయ పటిమను, సమరశీలతను పెంపొందించి పటిష్ట సంఘ నిర్మాణాన్ని పునర్నిర్మాణం కావించడానికి కృషి చేస్తున్నాం.

ప్రజాస్వామ్యం లేదు : తపస్ దత్తా, త్రిపుర



బిజెపి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య హక్కులు లేవు. రాజకీయ వ్యతిరేకులనే పేరిట పాశవిక దాడులకు ప్రభుత్వ అండతో బిజెపి, అనుబంధ సంఘాలు, సంఘ పరివార్ పాల్పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సంఘం కార్యక్రమాలు నిశ్శబ్దంగా, రహస్యంగా చేయాల్సి వస్తోంది. అయినప్పటికీ ట్రాన్స్‌పోర్టు, టీ ప్లాంటేషన్లు, అటవీ ఉత్పత్తి రంగాల్లో పని చేస్తున్నాం. ఇరవై శాతం సభ్యత్వం పెరిగింది.

సింగిల్ ఇంజిన్ సర్కార్
జగదీష్ శర్మ, జమ్మూ కాశ్మీర్

జమ్మూ కాశ్మీర్‌లో సింగిల్ ఇంజిన్ సర్కారు నడుస్తోంది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఒమర్ అబ్దుల్లా చేతిలో ఏమీ లేదు. మొత్తం కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేతుల్లోనే ఉంది. కేంద్ర బలగాల నియంత్రణలో రాష్ట్రం నలిగిపోతోంది. ప్రజాస్వామ్యం లేనే లేదు. ఈ పరిస్థితుల్లో సిఐటియు నిర్మాణం కష్టసాధ్యంగా ఉంది. జమ్ము, కాశ్మీర్ వారీగా నిర్వహణ కమిటీలు వేసి పని చేస్తున్నాం. కొన్ని కమిటీలు ఉమ్మడిగా ఉన్నాయి.

పార్ట్-1పై చర్చల్లో పాల్గొన్న రాష్ట్రాలు, వివిధ ఫెడరేషన్లు

గౌరీశంకర్ (ఆటోమొబైల్), జయప్రకాశ్ (ప్రైవేటు సెక్యూర్టీ), పుల్లవల స్టాన్లీ (ఫిషరీస్), రాజుల (డొమస్టిక్ వర్కర్స్), కాంబ్లి వర్మ (టెక్స్‌టైల్స్), శ్రీనివాసన్ (పుదుచ్చేరి), పద్మశ్రీ (వర్కింగ్ ఉమెన్), గౌతం ఘోష్ (ప్లాంటేషన్ వర్కర్స్).

పార్ట్-2పై...

ఎస్‌కె మహేంద్రన్ (తమిళనాడు), చంద్రశేఖర్ (పంజాబ్), వాసన్ పవార్ (మహారాష్ట్ర), మనోహర్ (చత్తీస్‌గఢ్), మిశ్రా (బిఎస్‌ఎన్‌ఎల్), మంజునాథ్ (ఎల్‌ఐసి ఏజెంట్స్), వమమ్మ (ఆలిండియా ప్లాంటేషన్ మైగ్రేషన్ వర్కర్స్), కలై రాజన్ (అండమాన్ నికోబార్), రాజేంద్రన్ (ఉత్తరాఖండ్), నిషిధ్ చౌదరి (సిమెంట్), సహనాథ్ (ఉత్తరప్రదేశ్), శ్రీకుమార్ (స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్) గోపి కుమార్ (ఐటి, ఐటిఇస్) జోసఫ్ (కేరళ), ఎస్ కన్నన్ (తమిళనాడు), పుష్ప (ఆశా వర్కర్స్), హరిక్రిష్ణన్ (ట్రాన్స్‌పోర్టు), ఇంకా.. రాజస్థాన్, ఇంకా జార్ఖండ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, ఒరిస్సా నుంచి ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు.



సందడే.. సందడి

- ఆకట్టుకున్న కళారూపాలు
- ముగిసిన 'శ్రామిక ఉత్సవ్'

ప్రజాశక్తి - భీమునిపట్నం (విశాఖపట్నం)

సిఐటియు 18వ అఖిల భారత మహాసభను పురస్కరించుకుని ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో తలపెట్టిన శ్రామిక ఉత్సవ్ చివరి రోజు సందడిగా సాగింది. శుక్రవారం తమ ఆట.. పాట.. మాటలతో.. ప్రదర్శనలతో ఆద్యంతం కళాకారుల బృందాలు వీక్షకుల్లో ఉత్తేజం నింపాయి. చైతన్యం రేకెత్తించాయి. పాలకులు, పెట్టుబడిదారుల గుండెల్లో తూటాల్లా ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, పాడిన పాటలు, గేయాలు.. ఆద్యంతం హుషారుగా సాగాయి. జివిఎంసి కళాకారుల 'తీన్‌మార్' సభికుల్లో ఉత్తేజం, ఉత్సాహం నింపాయి. ఉపాధ్యాయులు జి.గౌరినాయుడు రాసిన 'నా దేశ గత చరిత్ర నెత్తుటి మరక.. అయినా నా తల్లి మనసు మీగడ తరగ' అంటూ గత దేశ చరిత్రను.. ప్రస్తుత దేశ పరిస్థితులను అన్వయిస్తూ కళాకారుల ప్రదర్శనలు సాగాయి. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన త్యాగధనుల స్ఫూర్తిని నింపుకుని పోరాడాలని, తద్వారానే పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమని వివరిస్తూ కళాకారులు తమ ప్రదర్శనలను కొనసాగించారు.'పట్టు పట్టక్క... జెండా పట్టక్క.. సిఐటియు నీకు.. నాకు అండ దండక్క' అంటూ విజయనగరం జిల్లా అంగన్‌వాడీలు ప్రదర్శించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. 'అంగన్వాడీ ప్రాజెక్టును గంగలో కలిపేస్తే ఊరుకోబోమని' వారు కళా ప్రదర్శన ద్వారా పాలకులను హెచ్చరించారు. ప్రజా కళాకారుడు సఫ్దర్ హష్మీ వర్ధంతిని పురస్కరించుకుని తొలుత కళాకారులు, నిర్వాహకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. హష్మీ స్ఫూర్తితో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించడమే ఆయనకు అర్పించే ఘన నివాళి అని కళాకారులు స్పష్టం చేశారు.

పోరాటమే ఊపిరిగా ముందుకు...

- డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్జిస్

అనతలవట్టం ఆనందన్ నగర్ నుండి జె.జగదీష్

కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం దీటుగా ప్రతిఘటిస్తోందని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్జిస్ అన్నారు. కార్మిక వర్గంపై నయా ఉదారవాద విధానాలు సాగిస్తున్న దాడిని ఐక్య ఉద్యమాల ద్వారా తిప్పికొట్టాలని ఆయన కోరారు. పాలస్తీనాలో అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష హత్యాకాండను ఆయన ఖండించారు. ఈనెలలో తన నేతృత్వంలో డబ్ల్యుఎఫ్‌టియు ప్రతినిధి బృందం పాలస్తీనాలో పర్యటించనున్నట్లు కిరిట్జిస్ తెలిపారు. ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్యలో 133 దేశాల నుండి 10 కోట్లకు పైగా సభ్యులు ఉన్నారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభకు విశాఖపట్నం వచ్చిన ఆయన ప్రజాశక్తి ప్రతినిధితో ముచ్చటించారు.

ప్ర: ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గంపై జరుగుతున్న దాడి ఎలా చూస్తారు?


జ: గత దశాబ్దకాలంగా నయాఉదారవాద దాడి వేగవంతం అయింది. కార్మిక ఉద్యమ బలోపేతానికి కార్మికులను సమీకరించడం ఒక్కటే మార్గం. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం చాలా తీవ్రంగా ఉంది. దీనివల్ల కార్మిక వర్గంపై సరికొత్త దాడి జరుగుతోంది. కార్మికుల హక్కులతో పాటు మొత్తం కార్మిక వర్గ ఆలోచనపైనే దాడి జరుగుతోంది. దీనిపై గతేడాదిగా ప్రపంచ కార్మిక వర్గం ఉద్యమిస్తోంది. యూరప్, లాటిన్ అమెరికా, ఆసియా దేశాల్లో కార్మికోద్యమం ఉధృతంగా సాగుతోంది. ఇండియాలో కూడా ఇదే పరిస్థితి ఉంది. పెట్టుబడిదారీ సంక్షోభం ముదురుతుండడంతో కార్మిక హక్కులపైన, సామాజిక సంక్షేమం పైన, ప్రజాతంత్ర హక్కులపైన దాడులు తీవతరమవుతున్నాయి.

ప్ర: ఈ దాడిని ఎలా ఎదుర్కొంటారు?

జ: కార్మికవర్గంపై ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం చేస్తున్నదాడిని పోరాటాలతోనే తిప్పికొడతాం. ప్రస్తుత క్లిష్ట పరిస్థితులను మార్చడానికి సమ్మె ఒక్కటే మార్గం. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఇండియాలో ఫిబ్రవరి12న జరిగే సమ్మె విజయవంతానికి భారీగా సమీకరణ జరుగుతుందని ఆశిస్తున్నాను. ఈ సమ్మెకు డబ్ల్యుఎఫ్‌టియు పూర్తి మద్దతునిస్తుంది.

ప్ర : అనేక దేశాల్లో నిరుద్యోగం పెరుగుతోంది... కారణం ఏమిటి?

జ: నిరుద్యోగ సమస్య ఇంతగా తీవ్రతరం కావడానికి పెట్టుబడిదారీ విధానమే ప్రధాన కారణం. ప్రపంచంలో యువత నిరుద్యోగ సమస్యతో సతమతమవుతోంది. యువతకు సరైన ఉపాధి దొరకడం లేదు. పరిస్థితి ఇలా ఉంటే కార్పొరేట్ల వల్లే ఉపాధి పెరుగుతుందని ప్రభుత్వాలు ప్రచారం చేయడం విడ్డూరం. ప్రభుత్వం తన బాధ్యత నుంచి



తప్పుకోవడానికి ఇలాంటి ప్రచారాలకు తెరలేపుతున్నారు.

ప్ర : వివిధ దేశాల్లో జరిగే పోరాటాలకు డబ్ల్యుఎఫ్‌టియు సంఘీభావం ఎలా చెబుతుంది?

జ: ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా డబ్ల్యుఎఫ్‌టియు వెంటనే స్పందిస్తుంది. అమానుషత్వానికి వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తుంది. బాధిత కార్మికవర్గాలకు సంఘీభావంగా నిలుస్తోంది. త్వరలోనే డబ్ల్యుఎఫ్‌టియు ప్రతినిధి బ ందం పాలస్తీనాను సందర్శిస్తుంది. పాలస్తీనియన్లను ఈ బృందం కలసి తమ సంఘీభావాన్ని, మద్దతును తెలియజేస్తుంది. గాజాలో ఇజ్రాయిల్ సాగించిన అకృత్యాలను ప్రపంచానికి తెలియజేస్తాం. పాలస్తీనకు మద్దతుగా జరిగే ఆందోళనల్లో భాగస్వామ్యం అవుతాం.



ఆకట్టుకున్న కళా రూపాలు



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68